# లోకానికి నేనే వెలుగు

## యేసుక్రీస్తు గాధా ప్రబోధం :
## కథా-కథన విదానంలో సృజనాత్మక ప్రబోధం



సంపుటి : 46 అక్టోబర్ - డిసెంబర్ 2023 సంచిక : 4

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

**సంపాదక వర్గం :**

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ కుర్మ తోమస్
ఫాదర్ సగినాల ప్రకాష్
ఫాదర్ దొడ్డ రాజా

**గురు విద్యార్థుల బృందం :**

బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్
అరికోట్ల భరత్ కుమార్
బాలసాని ప్రభు దాస్
దొప్పలపూడి రవీంద్ర

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 46 అక్టోబర్-డిసెంబర్ 2023 సంచిక : 4

## యేసుక్రీస్తు గాథా ప్రబోధం :
## కథా-కథన విధానంలో సృజనాత్మక ప్రబోధం

**ఫాదర్ దొడ్డ రాజా**
సంచిక సంపాదకులు

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**
ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 91-040-29561761, 29561762
E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminaryhyd.org

# విషయసూచిక


సంపాదకీయం

– *ఫాదర్ దొడ్డ రాజా* ........................................ **05**

దైవశాస్త్రజ్ఞుల సదస్సు 2023–నివేదిక సందేశం

– *ఫాదర్ రెడ్డిమాసు పాపయ్య* ........................................ **08**

**1.** యేసుగాథ, క్రీస్తుచరిత్రం, కొనసాగుతున్న కథనం

– *మహా పూజ్య ఉడుమల బాల* ........................................ **12**

**2.** భారత రాజ్యాంగంలో విశ్వసించు హక్కు, ఆచరించు హక్కు, ప్రచార హక్కు

– *శ్రీ కలపాల ప్రవీణ్ కుమార్* ........................................ **20**

**3.** మతమార్పిడిని నిరోధక చట్టం నేపథ్యంలో యేసుగాథను కథనవిధానంగా బోధించటం

– *ఫాదర్ డాక్టర్ దర్శి డాన్ బోస్కో* ........................................ **44**

**4.** నేటి తెలంగాణా, ఆంధ్ర నేపథ్యంలో క్రీస్తు సువార్త ప్రబోధం, పరివర్తన, మతమార్పిడి

– *రెవ. సిస్టర్ నాగోతు సుందరి,* MSI ........................................ **52**

**5.** క్షేత్ర స్థాయిలో యేసుగాథను కథనంగా బోధించడంలో చిక్కులు, సూచనలు

– *ఫాదర్ డాక్టర్ పొలిశెట్టి జయరాజు* ........................................ **71**

# సంపాదకీయం



బోధించే విధానం ప్రజల హృదయాలను ఆకట్టుకునే విధంగా ఉండాలి. అందుకని వివిధ రకాలుగా, వివిధ పద్దతుల్లో ప్రభోదించే ప్రయత్నం చేస్తుంటారు. కథలు, గాథల రూపంలో చెప్పటం అనాది కాలం నుండి వస్తున్న విధానమే. పూర్వపు ప్రవక్తల ప్రబోధాలు, యేసు క్రీస్తు సందేశాలు కథలు, ఉపమానాల రీతిలోనే సాగిపోయాయి. ప్రత్యేకించి యేసు ఉపమానాల విధానమే ఎంచుకున్నారు. ఉపమానాలు ఉపయోగించి దైవరాజ్యం, దైవరాజ్యం విలువలను తెలియచేసారు. ‘‘ప్రజలు గ్రహింప గలిగి నంత వరకు అనేక ఉపమానముల ద్వారా యేసు వారికి బోధించెను. ఉపమానములు లేకుండ ఆయన ఏమియు బోధింపలేదు.” (మార్కు 3:33-34.) ఆనాడే కథలు, కథనాలు ప్రజలను ఆకర్షించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి అని యేసు ఈ పద్ధతిని అనుసరించారు. వాటి మూలంగా మనం చెప్పాలనుకున్న విషయం ప్రజలు త్వరగా అర్థం చేసుకుంటారు. అంతేకాకుండా కథలోని లోతైన వివిధ భావాలను, వాటి అర్థం విడమర్చి సందర్భాఅనుకూలంగా చెప్పడానికి కూడ ఉపయోగపడుతాయి. నేటికిని అవి సందేశాత్మకంగా మనుషులను ప్రభావితం చేస్తూ, ప్రేరేపిస్తున్నాయి.

యేసుగాథను నేటి నేపథ్యంలో మన సంస్కృతి ప్రకారంగా ఎలా బోధించాలో తెలియ చెప్పే ఉద్దేశంతో ఈ శీర్షికను తీసుకొని వస్తున్నాం. ప్రస్తుత కాలంలో యేసు క్రీస్తు గాథ - కథనం, మరింత ధైర్యంగా సృజనాత్మకంగా, ప్రయోగాత్మకంగా, ప్రామాణికంగా వివరించాల్సిన అవసరం ఎంతో ఉంది.

యేసు క్రీస్తే ఒక సందేశం మరియు సందేశంకుడు. రెండు ఆయనే కనుక యేసుగాథ నేటికీ ఉనికి కోల్పోలేదు. అయన గాథ మానవ మనుగడకు కీలకం. దానిని తెలియ చెప్పే క్రొత్త మార్గాలు అన్వేషిస్తూ ఉండాలి. ఆయన అందించిన ఈ నిత్యసత్యాలు నేడు మన తెలుగు రాష్ట్రాలలో, మన సంస్కృతి సాంప్రదాయాలను అనుసరించి, మారుతున్న నేటి పరిస్థితుల దృష్ట్యా బోధించే పద్ధతులు, మార్గాలు, విధానాలు తెలియ చెప్పే ప్రయత్నంలో భాగంగా ఈ శీర్షికలో వ్యాసాలు ప్రచురించుచున్నాము.

నిజానికి మారుతున్న నేటి దేశ రాజకీయ పరిస్థితులు, కోల్పోతున్న ప్రాధమిక హక్కుల ఉనికి, మత మార్పిడి వ్యతిరేక చట్టాలు, పెరుగుతున్న మత ఛాందసవాదం, ఆనాదిగా వస్తున్న సామాజిక అసమానతల మధ్య సువార్త ప్రబోధ కార్యం చాల సమస్యలు, చిక్కులను ఎదుర్కుంటుంది.

ఈ మధ్య నా మిత్రుడు నాతో ఒక విషయం చెప్పాడు. అతడు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తునన్నాడు. మొత్తం ఆ పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హిందువు. ఉపాధ్యాయులు రోజు విధి హాజరు పట్టికలో సంతకం చేస్తారు. కాగా, ఆ ప్రధానోపాధ్యాయుడు ప్రతి రోజు హాజరు పట్టికలో "ఓం" అని రాసి సంతకం చేసేవారు. ఎంతో కాలంగా ఇది జరుగుతుంది. నా మిత్రుడు అతనితో ఏమి చెప్పలేదు. కాలం గడిచిపోతుంది. ఈ మధ్య కాలంలో ఆ ప్రధానోపాధ్యాయుడు "ఓం" ప్రక్కన 'జీసస్' అని రాయడం ప్రారంభించాడు. నా మిత్రుడు ఆశ్చర్యపోయాడు. నేను ఏమి చెప్పకపోయినా ఆయనకు ఆయనే నా యేసును గుర్తించాడు అని మనస్సులో అనందపడ్డాను. యేసు మాదిరిగా మన బోధే మన జీవితం అయితే యేసుగాథ ఎప్పటికి అందరికి అర్థం కాగలదు.

ఈ సంచికలోని వ్యాసాలు తెలుగు కతోలిక పీఠాధిపతుల మండలి కతోలిక సిద్ధాంత-దైవశాస్త్ర పరిశీలనా విభాగం నుండి వచ్చినవి. ఈ వ్యాసాలు రచించివారందరు దైవశాస్త్ర పండితులు. కావున తెలంగాణ-ఆంధ్ర ప్రాంతాల నేపథ్యంలో క్రీస్తుగాథ-ప్రబోధ విధాన కోణంలో పరిశోధనాత్మకంగా సమర్పించిన వీటిని అందించుటకు ఆనందించుచున్నాం.

ఈ వ్యాసాలు ముందుగా కతోలిక సిద్ధాంత – దైవశాస్త్ర పరిశీలనా విభాగం అక్టోబర్ 4–5, 2023, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాద్ నందు నిర్వహించిన 9వ వార్షిక సదస్సులో చర్చించి, చక్కగా తెలుగు భాషలో సిద్ధం చేసారు. ఈ రచనలను ముద్రించుటకు అనుమతించిన విభాగ అధ్యక్షులు మహా పూజ్య శ్రీ ఉడుమల బాల, వరంగల్ పీఠాధిపతులకు, ప్రప్రథమంగా హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఈ విభాగ సదస్సు నిర్వహించి, వ్యాస ప్రతులను సేకరించి సమయానుకూలంగా అందచేసి, వాటి ముద్రణకు మనస్సు పూర్తిగా సహకరించిన కార్యదర్శి ఫాదర్ రెడ్డిమాసు పాపయ్య గారికి అభినందనలు.

ఈ సదస్సులో ఉపన్యసించి, వ్యాస రూపంలో అందించిన మహా పూజ్య శ్రీ ఉడుమల బాల గారికి, శ్రీ కలపాల ప్రవీణ్ కుమార్ గారికి, ఫాదర్ డాక్టర్ దర్శి డాన్ బోస్కో గారికి, రెవ. సిస్టర్ నాగోతు సుందరి గారికి, ఫాదర్ డాక్టర్ పోలిశెట్టి జయరాజు గారికి అభినందనలు మరియు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

దైవ రాజ్యం కోసం కృషి చేస్తున్న గురువులు, మఠవాసులు, సువార్త భోదకులందరికి ఈ శీర్షిక ఉపయోగపడ గలదని ఆశిస్తూ,

ప్రభు సేవలో

**ఫాదర్ దొడ్డ రాజా**

సంచిక సంపాదకులు

# దైవశాస్త్రజ్ఞుల సదస్సు 2023- నివేదిక సందేశం

**- ఫాదర్ రెడ్డిమాసు పాపయ్య**



తెలుగు కతోలిక పీఠాధిపతుల మండలి "కతోలిక సిద్ధాంత-దైవశాస్త్ర పరిశీలనా విభాగ" అధ్యక్షులైన మహా పూజ్య ఉడుమల బాల అధ్యక్షతన, ఫాదర్ రెడ్డిమాస్ పాపయ్య గారి కార్యదర్శి పర్యవేక్షణలో 9వ వార్షిక సదస్సు అక్టోబర్ 4-5వ తారీకు 2023న భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదులో నిర్వహించబడింది. దీనిలో 42 మంది సభ్యులు పాల్గొన్నారు. వీరిలో ఒక పీఠకాపరి, ఐదుగురు గృహస్థ క్రైస్తవులు, 14 మఠకన్యలు, 22 మంది గురువులు పాల్గొన్నారు. ఈ సదస్సు తెలంగాణ-ఆంధ్ర ప్రాంత నేపథ్యంలో "క్రీస్తు గాథ - ప్రబోధనా పద్ధతుల్లో నూతన మార్గాలను" అన్వేషించే ప్రయత్నాల్లో కథా - కథన విధానం ఆసియా ప్రజల అవగాహనకు శక్తివంతమైనదని ఐదుగురు వక్తలు ఆలోచింపచేసే వ్యాసాలను సమర్పించారు. ఆసియా, భారతదేశ పీఠాధిపతుల సమాఖ్యలు ఈ అంశంపై లోతుగా చర్చించారు. బృంద చర్చలనందు తెలుగు స్థానిక శ్రీసభలో ఎదుర్కొంటున్న భిన్నసంస్కృతుల - సవాళ్ళ గురించి, తేవాల్సిన మార్పులను జాగ్రత్తగా పరిశీలించి, ఎంచుకోవలసిన విషయాలను పేర్కొంటూ, అనవసరమగు విషయాలను వదిలేస్తూ, తమ తమ అభిప్రాయాలను దైవశాస్త్రపరంగా నొక్కి వక్కాణించారు. "దైవశాస్త్రం" అనగా "విశ్వాస అవగాహనను అన్వేషించుట"! (Faith seeking understanding).

**పత్రాలు/వాక్కృతులు** : ఈ సదస్సులో దైవశాస్త్ర నిపుణులైన ఐదుగురు ఉపన్యాసకులు తెలంగాణ-ఆంధ్ర ప్రాంత నేపథ్యంలో క్రీస్తు గాథ-ప్రబోధ విధాన కోణంలో పరిశోధనాత్మకంగా ఉభయ రాష్ట్రాల శ్రీసభను దృష్టిలో ఉంచుకొని ప్రయోజనకర పత్రాలను సమర్పించారు.

1. మహా పూజ్య ఉడుమల బాల, వరంగల్ పీఠకాపరి, "భారతీయ, తెలుగు సంస్కృతుల్లో, ఇతర ధర్మాల్లో, మతాల్లో కథా-కథనం యొక్క భావం, విశిష్టత ప్రయోజనం" గురించి కీలక ఉపవ్యాసం చేశారు.
2. శ్రీ కలపాల ప్రవీణ్ కుమార్ గారు, కళాశాల ఆచార్యులు, "భారత రాజ్యాంగంలో విశ్వసించు హక్కు, ఆచరించు హక్కు, ప్రచార హక్కు" గురించి సోదాహరణ పత్రమును సమర్పించారు.
3. ఫాదర్ డాక్టర్ దర్శ డాన్ బోస్కో గారు "మతమార్పిడి నిరోధక చట్టాల నేపథ్యంలో యేసుగాథను కథనా విధానంగా బోధించడం" గురించిన పత్రమును పరోక్షంగా (In absentia) సమర్పించారు.
4. రెవ. సిస్టర్ నాగోతు సుందరి గారు "నేటి తెలంగాణ-ఆంధ్ర నేపథ్యంలో క్రీస్తుసువార్త ప్రబోధం, పరివర్తన, మతమార్పిడి" అనే అంశంపై కథా-విధానా పాత్రప్రాముఖ్యతను సమర్పించారు.
5. ఫాదర్ డాక్టర్ పొలిశెట్టి జయరాజు గారు "క్షేత్రస్థాయిలో యేసుగాథను, కథనంగా బోధించడంలో చిక్కులు-సూచనలు" అను అంశంపై శాస్త్రీయ పత్రమును సమర్పించారు.

ఈ వక్తలు అందరూ తమ తమ పత్రాలను దైవశాస్త్రపరంగా విశదీకరించారు. వాటి పై అర్థవంతమైన ప్రశ్నలు-జవాబులు, స్పందనలు - ప్రతిస్పందనలతో దైవశాస్త్రీయ సభగా ప్రతిధ్వనించింది ఆనాటి సదస్సు!

**బృంద చర్చలు** : ఈ సదస్సులో పాల్గొన్న వారు చిన్నబృందాలుగా ఏర్పడి, సమర్పించిన ఉపన్యాసాలపై చర్చించి, నివేదికలను సమర్పించారు. ఈ చర్చలు రెండు దఫాలుగా జరిగాయి.

**నివేదిక/ప్రతిపాదనలు** : శ్రీసభ దేవుని ప్రజలు. "ప్రపంచమంతటికి వెళ్లి సమస్త జనులకు సువార్తను ప్రకటించండి" (మార్కు 16:15) అను బాధ్యతను కలిగియున్నావారు. ఈ బాధ్యతా పయనంలో అందరూ ప్రేమతో జీవించాలి, పయనించాలి. ఈ పయనంలో ప్రతిఒక్కరూ క్రీస్తుతో వ్యక్తిగత పరిచయం, వ్యక్తిగత అనుభూతి కలిగి ఉండాలి. ఈ అనుభవం, ఈ అనుభూతి ప్రస్తుత కాలంలో సువార్తను జీవిస్తూ, ఆనందంగా ఇచ్చి పుచ్చుకోవాలని ప్రోత్సహిస్తుంది.

ఈ శుభవార్త స్వయంగా ఏసుక్రీస్తు. అతనిలో దేవుని ప్రేమ అంతయు మానవాళికి వ్యక్తం అవుతుంది. శ్రీసభ కేవలం బోధనల ద్వారానేగాక, క్రియారూపంలో ఈ పయనాన్ని కొనసాగిస్తుంది. శతాబ్దాలుగా ఎంతోమంది ఏసుక్రీస్తు వ్యక్తికి, ఆయన రక్షిత సందేశానికి ఆకర్షితులయ్యారు. అతని అనుచరులుగా మారారు. వారి ద్వారా యేసుగాథ కథగా చెప్పబడింది, చెప్పబడుతూనే ఉంది. ఒక్కో వ్యక్తిజీవిత కథలో, ఒక్కో జాతి సంస్కృతిలో, ఒక్కో పద్ధతిలో చెప్పబడుతూనే ఉంటుంది.

**నేటి సవాళ్లు** : భారతదేశంలోని శ్రీసభ, వర్తమానకాలంలో కొన్ని క్లిష్టమైన సవాళ్ళను ఎదుర్కొంటుంది. ఈ మారుతున్న పరిస్థితులను, పెరుగుతున్న సవాళ్లను, శ్రీసభ గుర్తించింది. కొన్ని కొత్త పౌర చట్టాలు, విధానాలు, శ్రీసభ భారతదేశంలో చేస్తున్నటువంటి సేవాపూరిత కార్యక్రమాలకు అవరోధాలుగా మారాయి. కొన్ని రాష్ట్రాలలో "మతమార్పిడి నిరోధక చట్టాలను" తెస్తూ రాజ్యాంగ హక్కులకు కొత్త భాష్యం చేపుతున్నాయి. "బలవంతపు మతమార్పిడులు" అని దుష్ప్రచారం చేస్తున్నాయి. ఇవి క్రైస్తవులు చేస్తున్న సేవకు ఆటంకాలుగా మారి నిరుత్సాహపరుస్తున్నాయి. ఈ చట్టాలు మైనార్టీల రాజ్యాంగ హక్కులను ప్రశ్నార్థకం చేస్తుంది. కొన్ని ప్రాంతాలలో క్రైస్తవులపై అసహనం, ద్వేషం, పెంచుతు హింసాత్మక దాడుల సంస్కృతికి ఊతమిస్తున్నాయి, భారతదేశంలోని క్రైస్తవులకు తీవ్ర ఆందోళన కలిగించుచున్నది, ప్రపంచ సమాజాన్ని నివ్వర పరుస్తున్నాయి. మన మాతృభూమి అయిన భారతదేశంలో శ్రీసభ మానవ ప్రేమకు, మాధవ

సేవకు సాక్షమిచ్చింది, ఇస్తుంది. ముందుకాలంలో కూడా సాక్ష్యం ఇచ్చేటందుకు వెనకాడదు!

తెలంగాణ–ఆంధ్ర శ్రీసభ మారుతున్న పరిస్థితులను, ఎదుర్కొనే సమస్యలను గుర్తించింది. కానీ యేసుగాథను చెప్పడం మానలేదు. కుటుంబాలలో యేసుగాథను కథలుగా చెప్పడం, జీవించటం జరుగుతుంది. శ్రీసభ పయనంలో యేసుగాథను కథనా విధానంలో చెప్పటంలో, జీవించటంలో అందరిని సృజనాత్మక భాగస్వములను చేస్తుంది. ప్రస్తుత పరిస్థితులలో యేసుగాథను, కథనారీతిలో మరింత ధైర్యముగా, సృజనాత్మకంగా, ప్రామాణికంగా చెప్పవలసిన అవసరం చాలా ఉంది. యేసుగాథను కథగా పంచుకోవడానికి అందరం కలిసి పయనించుదాం. 2000 సంవత్సరాలు దాటుతున్నా 2 శాతమే యేసుగాథను అంగీకరించారు? ఎన్నో ప్రకటనా విధాలున్నప్పటికి 140 కోట్ల భారతప్రజా సులభ అవగాహనకు “కథనా విధానాన్ని” వినియోగిస్తూ, తెలుగు ప్రజల భాష–యాస–మూసలో ఏసు చరితా గాథను ప్రకటిద్దాం! తథాస్తు!!

# 1. యేసుగాథ, క్రీస్తుచరితం, కొనసాగుతున్న కథనం

**తెలంగాణా–ఆంధ్రప్రదేశ్ సంస్కృతిలో, సమాలోచన విధానంలో యేసు కథనావిధానం**

***“యేసు వారికి అనేక విషయాలు ఉపమాన రీతిగా బోధించెను”* (మత్తయి 13;3,34)**

**– మహా పూజ్య ఉడుమల బాల**

## 1. తొలిపలుకు...

**“తాత్వికంగా ఆలోచించు, వేదాంతునిగా నమ్ము, ప్రజా భాషలో మాట్లాడు”**



అనగనగా.......అంటూ ప్రారంభిస్తూ, వెనకటి తరం పెద్దలు పిల్లలకు ఆసక్తికరమైన కథలు చెప్పేవారు. కథలతో పాటు ఇతిహాసాలు,నీతిగాథలు, వేమన సుమతీ శతకాలు చెప్పేవారు. క్రైస్తవులు అబ్రహాము, ఇస్సాకు, యాకోబు గాథలు, ఎర్ర సముద్రం దాటింపు, దశాజ్ఞల గాథలు, ఏసుప్రభు అద్భుతాలు కథలుగా చెప్పేవారు. పెద్దలు చెప్పే నీతిసూత్రాలు, క్రీస్తు ప్రేమ పసిబాలల మనసుల్లో ముద్ర వేసేవి, మంచి–చెడు, పాపం–పుణ్యం, అను విషయాల జ్ఞానాన్ని వారి హృదయాల్లో నాటేవి, నెమ్మది నెమ్మదిగా పిల్లలు పెరిగే కొలది సన్మార్గంలో నడిపించేవి. యవ్వనంలో ప్రవేశించిన వారికి తల్లిదండ్రుల పట్ల గౌరవం, సమాజంలో నీతి–న్యాయం, సమానత్వం–మానవత్వం, మానవసేవే మాధవసేవ అను విలువలతో సాక్షాత్తు దేవుడే నేర్పించిన విధంగా జీవించేవారు. లోతైన భావాలుగల జ్ఞానాన్ని, అక్కాలమున...... (once upon a time) అను కథల ద్వారా బాలబాలికలు నేర్చుకునేవారు. కౌమార, యవ్వన దశలో, వినయంతో అటు లోకజ్ఞానంతో, ఇటు దైవజ్ఞానంతో నడుచుకునేవారు! ప్రతిదేశంలో, ప్రతిసమాజంలో వేలకొలది కథలు ఓ ముఖ్య భాగం. ఆ కథలను కథనంగా

చెప్పుతూ కాలం ప్రవహిస్తుంది. అంతులేని కథ, అంతంలేని కథ, నడుస్తున్న కథ లాంటివి యేసుగాథకు మంచి నేపథ్యాన్ని అందిస్తాయి.

## 2. కథ అనగా.......

ఒక విషయాన్ని వివరించుట. ఆ విషయం కల్పితమైనదైతే, కల్పిత లేక కట్టుకథ అవుతుంది. పిట్టకథ అనగా చిన్న చిన్న కథల ద్వారా నీతిని చెప్పకుండానే చెప్పడం. సాంకేతికం పెరిగి సామాజిక మాధ్యమాలు ఎక్కువ అయి, పెద్దల కథనాలు వెనక్కి పోయాయి. చారిత్రాత్మకమైనదైతే, వాస్తవమైనదైతే చరితం అవుతుంది. ఊహించిన దానిని, పుక్కిట పురాణాలను కూడా కథలుగా చెబుతారు. ఆంగ్ల భాషలో story అను పదం Historia అను గ్రీకు పదం నుండి పుట్టింది. దాని మూలఅర్థం 'పరిశోధనా కథనం' ద్వారా నేర్చుకొనుట అని భావం. అందువలన 'నీకథ చెప్పమంటే నీ జీవిత గాధను చెప్పమన్నట్టు' అని అర్థం. ఏ ఇతిహాస, నీతి గాథనైనా వర్ణించువాడు కథకుడు. కథనం ఒక కళ. మానవ అనుభూతులను వాటిలో జోప్పించి వినసొంపుగా చెప్పడం. పొడి పాఠాలైన లెక్కలు, సాంఘికశాస్త్రం, సామాన్యశాస్త్రాలు కూడ దానికి మినహాయింపు కాదు. ప్రతికథలో నీతిబోధ ఉంటుంది. కథలు జీవితంలో ముఖ్యభాగం అయిపోయాయి. చివరికి చరిత్రను, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి కూడా కథలు అవసరం. జీవిత అనుభవాలను జోడించి చెప్పే కథలు వినువారిపై బలంగా పనిచేస్తాయి.

## 3. ఆసియా శ్రీసభ...

తెలుగు సంస్కృతిలో యేసుగాథను కథనం చేయుట, సమాలోచన విధానంలో కథ రూపంలో క్రీస్తు సువార్తను ప్రకటించుట" అనునది మన ముఖ్య అంశం. 2014లో థాయిలాండ్‌లో ఏర్పాటు చేసిన ఆసియా శ్రీసభ మిషన్ కాంగ్రెస్ ఉద్దేశం కూడా దాదాపు అదే. "సువార ప్రకటన, వేదవ్యాపకం, ప్రేషిత కార్యం" (Evangelization, Missionary, etc) లాంటి పదాల కంటే మేలైన పదం యేసుగాధను వివరించుట (story telling). సువార్తీకరణం, వేద వ్యాపకం లాంటి పదలు ఇతర మతస్తులను వేదనకు, ఆందోళనకు గురిచేస్తాయి. మత హింసలకు యుద్ధాలకు సహితం దారితీస్తాయి. కథ–సంభాషణ విధానం మతాలపై

దాడిచేసినట్లుగా కాక ఒకరి విశ్వాసాన్ని ఇతరులకు తెలియజేయు సంభాషణలై ఉండాలి. సంవిధానం (dialogue) దానిలో చాలా విశిష్ట భారత రాజ్యాంగం కూడా ఆమోదిస్తుంది.

ఆసియాలో శ్రీసభ (Ecclesia in Asia) భక్త జాన్‌పాల్ పాపుగారు ఆసియా మిషన్లో గల సవాళ్లను పేర్కొంటూ, కథా కథనరూపం ఆసియా సంస్కృతిలో శక్తివంతమైన సమాధానం అన్నారు. ఆసియాఖండ సంస్కృతిలో వివరించి వర్ణించే పద్ధతి అగు 'కథనానికే ప్రాధాన్యం' ఇవ్వాలి. నిస్సందేహంగా సువార్తల్లో వలె యేసుక్రీస్తు సువార్త ప్రకటనా యజ్ఞంలో కథనారూపంతో యేసుగాథను సమర్థవంతంగా చేయగలం. ఇది ఒక ఉద్వేగశపూరిత శక్తివంతమైన బోధనాశాస్త్రం. కథలను ఉపమానాలను, చిహ్నాలను వినియోగించుకునే పద్ధతి ఆసియా బోధన శాస్త్రం యొక్క ముఖ్య లక్షణం (EA 20pg).

కథలు మనసులను ఆకర్షిస్తాయి. హృదయాలను తెరుస్తాయి, మంచివిత్తనాలను స్వీకరిస్తాయి. అవి తగు సమయంలో మొలకెత్తుతాయి. అలా జరగాలంటే మనం "మంచి-కథకులు" కావాలి. ప్రతి మతం, ధర్మం, తత్వం వారివారి కథలు కలిగి ఉన్నాయి. వారి కథలు మన వినాలి, అలాగే వారు మన కథలు వినాలి. ఈ విధంగా మత సామరస్యముతో నేటి కాలంలో సువార్త చాటాలి. అప్పుడే వినువారికి "యేసుగాథ ఒక శుభవార్త, సువార్త' అవుతుంది.

## 4. నేటి మనిషికి......

శుభవార్త అంటే 50% ధర తగ్గింపు (Discount). కొన్నిసార్లు ఒకటి కొంటే మరొకటి ఉచితం అంటూ, 5000 రూపాయల వస్తువుకు 100 రూపాయలు చెల్లిస్తే చాలు. తర్వాతా నెలసరి చెల్లింపుల బాదుడే కదా! అనేట్టుగా శుభవార్త అయిపోయింది నేడు. క్రీస్తు సువార్త భయం లేనిది, భయపెట్టదు! అందరికీ ఆనందం, సంతోషం, శుభప్రదమైన, దైవ ప్రేమ, సోదర ప్రేమ అందిస్తుంది. లోక కళ్యాణంతో ప్రజలంతా దైవ రాజ్యంలో వసుదైక కుటుంబముగా జీవించు "సర్వేజన సుఖినోభవంతు!" అను అద్వితీయ శుభవార్త ఇది.

## 5. సమాలోచన విధానంలో......

సమాలోచన అంటే పండితులకు, దైవ శాస్త్రజ్ఞులకు, పీఠకాపరులకు మాత్రమే అర్థం అయ్యే కాదు. కారాదు. అందరితో కలిసి నడవడం, అందరి ఆలోచనలను గౌరవించడం. పవిత్రాత్మతో విచారించి కనుగొనాలి. పాత చింతకాయ పచ్చడిని పడేయడం బూజు పట్టిన మెదళ్ళుచెదలు పట్టిన మనసులను కడిగేసే సమాలోచన విధానం రావాలి. ఇంట-బయట-ఇదే విధానం రావాలి, ఇంట్లో అందరి బాప్తిస్మ సమానత్వం, బయట సువార్త బాధ్యత అందరిది. రక్షణ సువార్త కొందరికే కాకుండా అందరిది వెరసి కలిసికట్టుగా నడుస్తూ అన్యోన్య సంసర్గం-భాగస్వామ్యం-సువార్త యజ్ఞం, అను సాక్షి విధానంతో సాఫీగా సాగిపోదాం! మనకు IQ, EQ అంటే ఏంటో తెలుసు కానీ CQ, కథా విధానాని కొరకు ఎక్కువగా తెలుసుకోవాలి. CQ అంటే (కల్చరల్ కోషన్ట్) సాంస్కృతిక సూచి. సమాలోచన విధానాన్ని ఒక మాటలో చెప్పాలంటే ఇది నమూనా మార్పు (paradigm shift) అదే సువార్త విశ్వాసం అదే దైవ దైవశాస్త్రం కానీ జీవించే విధాన మార్పు!!

## 6. తెలుగు సంస్కృతిలో....

“దేశభాషలందు తెలుగు లెస్స” అను నానుడి ప్రకారం తెలుగు భాష,తెలుగు సంస్కృతి అద్వితీయం. ఈ సంస్కృతిలో కథలు కథ విధానం ప్రముఖ పాత్ర వహిస్తాయి. కథా ప్రక్రియలో ముఖ్యమైనవి: బుర్రకథ, జంగం కథ, ఒగ్గు కథ మొదలైనవి. ఇవి కథ సాంప్రదాయక కథనా విధానం. తెలుగు సంస్కృతిని పరిరక్షించుటకు వారి నమ్మకాలను, విలువలను, సాంప్రదాయాలను కాపాడుకుంటూ, వచ్చే తరం వారికి అందించుటకు కథ విధానాన్ని విరివిగా వాడుకొనేవారు. విద్యను సమాచారాన్ని అందిస్తూ హాస్యాన్ని నీతిని జోడించే కథ విధానం ఇది. కథ శక్తివంతమైన మాధ్యమం, చక్కటి కథ మనసులపై ముద్రవేస్తుంది. ఆ ప్రభావం జీనితాంతం ఉండిపోతుంది.

క్రైస్తవం పశ్చిమ దేశాల సంస్కృతితో ముడిపడి ఉంది. క్రైస్తవం పాశ్చాతదేశాల్లో ఎక్కువగా వ్యాపించి ఉన్నది. ఆసియా ఖండంలో 10 శాతం భారతదేశంలో 3.5 శాతం మాత్రమే క్రైస్తవం. అందువలన భారతదేశంలో క్రైస్తవం మైనారిటీ మాత్రమే!

అయినా ప్రపంచాన్ని ఏకంచేసే ధర్మరాజ్యం-దైవరాజ్యం స్థాపించే సుసందేశం క్రీస్తు సందేశం క్రీస్తు సువార్త!

ఆసియా సంస్కృతిలో మానవ అవతారమెత్తాడు. యేసు ఆలోచన ధోరణిలో బోదనా విధానంలో, తూర్పు దేశాల విధానమే! ఈ తూర్పు దేశాల్లో కథనా విధానం శక్తివంతమైనది, అందువలన భారతావణిలో, తెలుగు సంస్కృతుల్లో సువార్తీకరణకు కథావిధానం బలమైన సాధనం!

## 7. ఆసియా ఖండం.......

యేసుప్రభు పుట్టిన పవిత్ర ఖండం ఇది. ఆసియా అనుపదం "తూర్పు" అను మూలార్థం కలిగి ఉన్నది. "అప్పుడు జ్ఞానులు తూర్పు దిక్కు నుండి యేరుషలేముకు వచ్చి.... ఆయన నక్షత్రమును తూర్పు దిక్కున చూచి మేము ఆరాధింపవచ్చితిమి" (మత్తయి 2:1-2) అను పరిశుద్ధ గ్రంథం పలుకులు ఆసియా ఖండాన్ని పేర్కొన్నాయి. ప్రపంచఖండాల్లో కెల్లా అత్యంత విశాలమైనదిదే. భూవైశాల్యంలో మూడింట ఒక వంతు (1/3) భూవైశాల్యాన్ని కలిగి ఉన్నది. దాదాపు 500 కోట్ల జనాభాతో, ప్రపంచ జనాభాలో 60 శాతం జీవించే ఖండమిది. ప్రపంచంలోని ప్రముఖ మతాలన్నీ ఈ ఖండంలోనే ఉద్భవించాయి. వేదాంత తత్వశాస్త్రాజ్ఞులకు కొదవేలేదు మరి. 49 దేశాలలో 2300 భాషలతో ప్రకాశించే ఖండమిది. ఎన్నో ప్రాచీన సంస్కఅతులకు పుట్టినిల్లు ఇది. ఇవన్నీ ఒకఎత్తు అయితే, కథలు మరో ఎత్తు ఆసియాఖండ ప్రత్యేకత. కథల ద్వారా ఎంత ఎత్తైన, మరెంత లోతైన విషయాన్ని గూడా ప్రజలు గ్రహిస్తారు. వెరసి ఈ కథలే, కథల ద్వారా చెప్పే మతధర్మతత్వ విషయాలతో ఆసియా ఖంఢ ప్రజలు అనుబంధంతో మనుగలుగుతున్నారు. కథల ద్వారా ప్రజల జీవిత పరమార్ధాన్ని, మర్మాలను తెలుసుకోగలుగుతున్నారు.

## 8. కథల భారతదేశం.....

భారతదేశం నిండా కథలే కథలు. వెరసి కథలే భారతదేశం! కథల ద్వారా ముఖ్యంగా ధర్మ-మత-నీతి విలువలను, విశ్వాసాల విషయాలను సామాన్య మనిషి సులభంగా గ్రహించగలుగుతాడు. ప్రజల్లో మార్పుతెచ్చే శక్తిగల సాధనం

కథనం, కథావిధానమే! మొదటగా కథలు మౌలికం. ఆ తర్వాత చిత్రం, శిల్పం, గీతం, సంగీతం, నటన నాట్యం, అను కళలతో కథనం రూపాంతరం పపొందింది. జీవన పరమార్థం నీతి–న్యాయ విషయాలు, మత–ధార్మిక బోధలు, వినోద కాలక్షేపం కొరకు ప్రముఖ సాధనం కథలే. హిందూ పురాణ, రామాయణ, మహాభారత గాథలను, బుర్రకథ హరికథల ద్వారా కనులకు కట్టినట్లుగా వర్ణించేవారు. కథల కనుసారముగా సంగీతం, నాట్యం, హాస్యం జోడించి రమ్యంగా చెప్పేవారు. నవలా సాహిత్యం చివరికి నేటి సినిమాలు, యుట్యూబులు, ఒటిటీ వేదికలు డిజిటల్ సాధనాలన్నీ కథనాన్ని పునాదిగా చేసుకొని ప్రజలను ఆకర్షిస్తున్నాయి! కల్పిత కథలు, జానపద, పురాణ, ఇతిహాసం, తత్వం. నవ రసాలు వెరసి మూఢనమ్మకాల విషయాలను కూడా కథా రూపంలో సగటు మనిషికి వాటి పరమార్థాన్ని చేరవేస్తుంది. నేటి టివి, చరవాణిలలో సాంఘిక విషయాలను, ప్రజాభ్యుదయ విషయాలను కూడా కథల ద్వారా విశదపరుస్తున్నారు; ఉదా: ఎయిడ్సు, శుభ్రత, కుటుంబ సంక్షేమం మొదలగునవి. భారతదేశానికి వచ్చే విదేశియులకు కథలు బస్తాలు–బస్తాలుగా దొరుకుతున్నాయి. కథలే కాదు, కళాకారులు ఈ విషయంలో ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తారు. భావం–భాష–కథ నైపున్యత, రాగం, నటన విషయాల్లో వాటికి వారికి పట్టు ఉండాలి. నేటి బాలీవుడ్, టాలీవుడ్, మాస్ మిడియా, సోషల్ మీడియా, ప్రత్యేకంగా సిరియల్సుల్లో ఈ విషయాన్ని అట్టే చూడగలం!

## 9. కథా రూపంలో సువార్త ప్రకటనం....

యేసుక్రీస్తు మంచి కథకుడు. ఒక "రబ్బీగా", "బోధకుడిగా" (మార్కు 5:11, 21) అతనికి ప్రియమైన బోధనా విధానం కథారూపమైన ఉపమానాలు పదచిత్రాలు! ఇవి దైవరాజ్య లోలోతుల్ని సంహితం వర్ణించేవి. క్రైస్తవేతరులు సైతం అభిమానించే మంచి సమరియుడు, తప్పిపోయిన కుమారుడు, ధనవంతుడు–లాజరు లాంటి ఉపమానాలు మనకు బాగా తెలుసునుకదా! వాటిని నాటకాలుగా మంచి తెలుగు ప్రజలను మైమరిపింపజేసేనవి అవి. అలాంటి ఉపమానాలు ఎన్నో సగటు మనిషిని కూడా కొంగొత్త విధానాలల్లో అటు దేవునితో, ఇటు మానవునిలో నూత్న, వినూత్న సంబంధాల పట్ల సవాళ్లు చేస్తాయి. యేసు ఆసియాలో జన్మించాడు. కాబట్టి ఆ

సంస్కృతిని పునికి పుచ్చుకొని, ఆసియాలోనే ఇతర ప్రముఖ జ్ఞానబోధకులైన కన్ఫ్యుచియును, లావోంట్జావు, గాంధీ మహాత్ముని లాంటి వాడేనని భావించవచ్చు. కానీ అద్భుత విధంగా అతడు వారిలా మానవమాత్రుడే కాదు, దైవ సంబంధుడు. సాక్షాత్తు దైవ కుమారుడు. వెరసి దేవదేవుడే! అతనే మానవ అవతారంలో, శరీరధారియై మన మధ్య తన గుడారం వేసుకొన్న "దేవుని ప్రేమ కథ" (యోహను 1:14). కనులకు కట్టినట్టుగా, చెవులకు వినపడేలా, పంచేంద్రియాలు దాటి, జ్ఞానేంద్రియాలు మేలుకొలిపే 'కథావిధానం', ఆయన బోధానా నమూనా! ఆసియా వాసులకు ముఖ్యంగా తెలుగు ప్రజలకు దీటైన సువార్త సాధనం.

యేసుప్రభు గాధను, క్రైస్తవ కతోలిక విశ్వాసాన్ని ప్రకటించుటకు అద్వితీయ పద్ధతి అని గ్రహించుదాం. ఒకవైపు హిందూ, ముస్లిం, బౌద్ధ, జైన ధర్మాల ప్రజల మధ్యలో, మరోవైపు ప్రపంచీకరణం వినియోగవాదం, ప్రసార సామాజిక మీడియా, వలసవాదం, అంతర్యుద్ధాలు, అవినీతి, మతజాడ్యం–చాదస్తం, రాజకీయ దుష్టత్వం, పోట్లడటం, క్రైస్తవ సంఘ శాఖలు, సనాతనం, మనుధర్మం, లాంటి పెనుసవాల మధ్యలో, పోటీ మనస్తత్వంతోకాక, సంభాషణ–సంవాదం మనసుతో, యేసు చరితాన్ని–కథాకథనాల రూపంలో అందచేయటమే నేటి సువార్త ప్రకటన ఏకైక క్రైస్తవ మార్గం, క్రైస్తవుల సమాలోచనా పద్ధతి! యేసుగాథ ప్రజల విధానాలను, జీవన నమ్మకాలను మార్చుతుంది. వారి విలువల కోణాన్ని సరిదిద్దుతుంది. దైవ రాజ్య స్థాపనలో ముందుకు దూసుకెళ్తుంది. "మారు మనస్సు" అను పదాన్ని "కథ–సంభాషణ" విధానం నిజం చేయగలదు. పాఠశాల పుస్తకాలకన్నా, శాస్త్రీయ జ్ఞాన భాండాగారాల కన్నా వేగంగా వసుధైక కుటుంబాన్ని నిజం చేస్తుంది. ఈ కథావిధానం!

## 10. మలిపలుకు......

ప్రభు! నీ కార్యములు ఎంత ఘనమైనవి నీ ఆలోచనలు ఎంత లోతైనవి (కీర్తన 92:5) అనే వచనాన్ని మనది చేసుకుంటూ ఎంతో అసాధారణమైన యేసుగాధను క్రీస్తు చరితంగా మలచు వైభవోపేత సువార్త ప్రకటనను ఆసియా ఖండంలో, ప్రతి దేశంలో ముఖ్యంగా తెలుగు ప్రజలు భావించు అద్వితీయ సాధనం "సాధారణమైన" కథనం అని గ్రహించుదామా? 2000 సంవత్సరాలు

దాటుతున్నప్పటికి  రెండుశాతం ప్రజతో ప్రభుసువార్తాకై  శ్రమించాం. అయినా ఫలితం చాలా తక్కువ అంటూ ఆవేదనతో  పేతురువలె (లూకా 5:5) ప్రార్థిదాం. కాని అంతులేని విశ్వాసంలో సువార్త బోధన విధానమైన “కథ–ఉపమాన రూపాన్ని” ఈ డిజిటల్ యుగంలో కూడా మనకు శరణం అని ముందుకు సాగుదాం, ప్రభువిధానం మనకు శ్రీరస్తు! తథాస్తు!

**కథ కంచికి మనం ఇంటికి! శుభం..................**

❋ ❋ ❋ ❋

# ౨. భారత రాజ్యాంగంలో విశ్వసించు హక్కు ఆచరించు హక్కు, ప్రచార హక్కు

– శ్రీ కలపాల ప్రవీణ్ కుమార్

## పరిచయం



భారతదేశం ప్రజాస్వామికమైన నాటి నుండి నాడు భారత్‌ను పరిపాలిస్తున బ్రిటిష్ వారు స్వతంత్ర్యాన్ని ప్రకటించిన తదుపరి భారత దేశానికి దిశ నిర్ధేశం చేయడానికి మరియు పరిపాలన కొనసాగించడానికి ప్రమాణిక విలువలతో కూడిన రాజ్యాంగ ఆవశ్యాకతను గుర్తించిన నాటి పెద్దలు రాజ్యాంగం భారత దేశానికి దుక్సూచి కావాలనే మహోన్నతమైన ఆశయంతో ఏర్పాటు అయిందే రాజ్యాంగ పరిషత్. సదీర్ఘ సమాలోచనలతో వివిధ దేశాల రాజ్యాంగలను ఆవపోసన బట్టి భారత ప్రజలకు ప్రతి విషయంలో స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం తదితరా అంశలన్నింటిలో పరిపుష్టితో దేశం సర్వోన్నతంగా అభివృద్ధి చెంది ముందకు పావలన్న సదాశాయంతో నిర్మాణం అయినదే భారత రాజ్యాంగం. దాన్ని గురించిన కొన్ని ప్రత్యేక ఘట్టలు. క్రింది పేర్కొన్నాం. ఈ క్రమంలో భారత రాజ్యాంగం రూపొందిన విదివిధాన్ని దాన్ని యొక్క ప్రత్యేకతను గురించి తెలుసుకుందాం.

- 1934లో కమ్యూనిస్టు భావజాలం కలిగిన ఎమ్మెస్ రాయి గారు భారత రాజ్యాంగ పరిషత్ ఆలోచనను ప్రతిపాదించారు.
- 1935 నుండి కాంగ్రెస్ యొక్క అధికారిక డిమాండ్‌గా ఈ యొక్క భారత రాజ్యాంగం మారింది
- 5 సంవత్సరాల సుదీర్ఘ కాంగ్రెస్ డిమాండ్ ద్వారా 1940 ఆగస్టులో

రాజ్యాంగం తయారు చేసుకోవడానికి బ్రిటిష్ వారు ఒప్పుకున్నారు.

- వారు ఒప్పుకున్న ఆరు సంవత్సరాల తర్వాత 1946లో రాజ్యాంగ పరిషత్‌కు ప్రప్రదమంగా ఎన్నికలు జరిగాయి
- మొత్తం 389 మంది రాజ్యంగ పరిషత్ సభ్యులయ్యారు. 292 మంది రాష్రాల నుండి, 93 నుండి ప్రిన్స్‌లీ స్టేట్స్ నుండి ఇంకో నాలుగు రాష్ట్రాల చీఫ్ కమిషనర్లులతో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు జరిగింది
- రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడిగా డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ బి.ఆర్. అబేద్కర్, నియమించాబడ్డడు. ఆయనకు 7 ప్రధాన కమిటీలు, మరికొన్ని ఉప కమిటిలుగా ఏర్పడి సహకరించారు. ఇందులో 9 మంది మహిళలలు కూడా ఉండటం అభినందనియం.
- 1947 డిసెంబర్ 9న ప్రారంభమై రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు రాజ్యాంగ రచనకు సమయం పట్టింది, 1949 నవంబర్ 26న అందరి సంతకాలతో ఆమోదించారు. 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది
- దేశంలో రాజ్యాంగమే సర్వోన్నత శాసనం, దేశ ప్రజలు దీని చేతనే పరిపాలించబడుతున్నారు. ఇది మౌలిక రాజకీయ సూత్రాల రూపాన్ని, ప్రభుత్వ సంస్థల విధులు, విధానాలు, అధికారాలు, నిర్మాణాన్ని ఏర్పరుస్తుంది.
- ప్రపంచంలో ఏ దేశానికి ఇంత పెద్ద లిఖిత రాజ్యాంగం లేదు. చేతితో హిందీ ఇంగ్లీష్ భాషల్లో రాయడం జరిగింది, 64 లక్షల రూపాయలు నాడు ఖర్చు చేశారు, దీన్ని రాయడానికి 60 దేశాలకు పైన ఉన్న రాజ్యాంగాల నమూనాలను స్వీకరించారు, అమలులోకి వచ్చిన నాడు 395 ఆర్టికల్స్, 8 షెడ్యూలు 22 భాగాలుగా ఉంది. ప్రస్తుతం 462 ఆర్టికల్స్, 12 షెడ్యూల్‌లు, 25 బాగాలుగా ఉంది.
- స్వయంగా చేతులతో రాసిన ఈ ప్రతులను పార్లమెంట్ లైబ్రరీలో హీలియం గ్యాస్ నింపిన పెట్టెలో నేడు భద్రంగా ఉంచారు.

## రాజ్యాంగ పీఠిక

(రాసినవారు ప్రజలే, శసనీకరణం చేసిన వాళ్లు ప్రజలే, ఆమోదం తెలిపిన వాళ్లు ప్రజలే, ఇది ప్రజల కోసమే).

(భారతదేశ ప్రజలమైన మేము సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య, గణతంత్ర, స్వేచ్ఛ స్వాతంత్ర్య, న్యాయ సౌభ్రాతృత్వాలతో ముందుకెళ్లి మా దేశ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము).

(ఈ రాజ్యాంగ పీఠికను, ప్రవేశిక భూమిక, ప్రస్తావన, ముందుమాట, తొలిపలుకు, రాజ్యాంగ సారాంశం, ప్రియాంబుల్ తదితర పదములతో సంబోధిస్తారు).

## పీఠికను అమెరికా దేశం నుండి గ్రహించారు

భారత రాజ్యాంగ లక్ష్యానికి, నియమాలకు, మార్గదర్శనం చేసే సంక్షిప్త ప్రకటన ఇది. రాజ్యాంగం నుండి పొందే అధికారాన్ని ప్రజల ఆశలు ఆకాంక్షలు మన దేశం ఆదర్శాలను దీంట్లో అభివ్యక్త చేయడం జరిగింది, దీనినే రాజ్యాంగం యొక్క ఆత్మగా భావించవచ్చును. రాజ్యాంగ ఉపోద్ఘాతంగా కూడా చెప్పవచ్చును.

1950 జనవరి 26న అమలులో వచ్చినప్పుడు. (సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర అనే మూడు పదాలు మాత్రమే ఉండేవి కానీ 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక, సామ్యవాద అనే పదాలను చేర్చడం జరిగింది.

## భారత రాజ్యాంగంలో వివిధ దేశాల రాజ్యాంగాల నుంచి గ్రహించిన అంశాలు

| దేశం | | రాజ్యాంగం గ్రహించిన అంశాలు |
|---|---|---|
| 1) ఆస్ట్రేలియా | – | ఉమ్మడి జాబితా, పీఠికలో వాడిన భాష |
| 2) రష్యా | – | ప్రాథమిక విధులు |
| 3) అమెరికా | – | ప్రాథమిక హక్కులు, స్వతంత్ర న్యాయవ్యవస్థ, ఉపరాష్ట్రపతి ఎన్నిక, న్యాయ సమీక్ష, రాష్ట్రపతి తొలగింపు |

| | | |
|---|---|---|
| 4) దక్షిణాఫ్రికా | - | రాజ్యాంగ సవరణ, రాజ్యసభ ఎన్నిక |
| 5) ఫ్రాన్స్ | - | గణతంత్ర వ్యవస్థ |
| 6) కెనడా | - | బలమైన కేంద్ర ప్రభుత్వం, కేంద్రానికి అవశిష్టాధికారాలు, సమాఖ్య విధానం |
| 7) బ్రిటన్ | - | సమన్యాయ పాలన, ఏక పౌరసత్వయం, స్పీకర్ హెూదా, విధులు క్యాబినెట్ తరహా పార్లమెంటరీ విధానం |
| 8) జపాన్ | - | న్యాయసూత్రాలు, చట్టం నిర్ధారించిన విధానం |
| 9) జర్మనీ | - | అత్యవసర పరిస్థితికి సంబంధించిన అధికారాలు |
| 10) ఐర్లాండ్ | - | ఆదేశిక సూత్రాలు, రాజ్యసభకు విశిష్ట వ్యక్తులను నామినేట్ చేయడం, రాష్ట్రపతి ఎన్నిక |
| 11) భారత ప్రభుత్వ | - | రాష్ట్రపతికి, రాష్ట్ర గవర్నర్లకు విశిష్ట అధికారాలు, కేంద్ర |
| 12) చట్టం 1935 | - | రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన, ద్విసభా విధానం |

## రాజ్యాంగ రచనలో వివిధ కమిటీలు - అధ్యక్షులు

| **కమిటీలు** | **అధ్యక్షులు** |
|---|---|
| 1) ప్రాథమిక హక్కులు | - సర్దార్ వల్లభబాయ్ పటేల్ |
| 2) రాష్ట్రాలకు సంబంధించిన కమిటీ | - సర్దార్ వల్లభబాయ్ పటేల్ |
| 3) నిబంధనల కమిటీ | - డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ |
| 4) స్టీరింగ్ కమిటీ | - డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ |
| 5) ప్రాథమిక హక్కుల ఉప కమిటీ | - జె.బి. కృపలానీ |

6) డ్రాఫ్టింగ్ కమిటి – డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

7) ఈశాన్య రాష్ట్రాల (గిరిజన), అస్సాం ప్రాంతాల కమిటీ – గోపీనాథ్ బార్డోలి

8) మైనారిటీల కమిటీ – హెచ్.సి. ముఖర్జీ

9) సుప్రీంకోర్టు అడహాక్ కమిటీ – ఎస్. వరదాచారి

10) కేంద్ర అధికారాలు, కేంద్ర రాజ్యాంగ కమిటీ – జవహర్‌లాల్ నెహ్రూ

11) ఆర్థిక స్టాఫ్ కమిటీ – డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్

12) క్రెడెన్షియల్ కమిటీ – అల్లాడి కృష్ణస్వామి అయ్యర్

13) సభా కమిటీ – భోగరాజు పట్టాభి సీతారామయ్య

14) అస్సాం ప్రాంతాలను మినహాయించి ఇతర ప్రాంతాల సబ్‌కమిటీ – ఎ.వి. ఠక్కర్

15) ఆర్థిక అంశాలపై కమిటీ – నళినీ రంజన్ సర్కార్

16) రాజ్యాంగ పరిశీలనా కమిటీ – అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, జవహర్‌లాల్ నెహ్రూ

17) జాతీయ పతాక తాత్కలిక కమిటీ – డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్

18) చీఫ్ కమిషనర్‌ల ప్రాంతాల పై కమిటీ – డాక్టర్ పట్టాభి సీతారామయ్య

19) సలహా సంఘం – సర్దార్ వల్లభబాయ్ పటేల్

20) కమిషన్ ఆన్ లింగ్విస్టిక్ ప్రావిన్సెస్– ఎస్.కె. థార్

21) ఆర్డర్ ఆఫ్ బిజినెస్ కమిటీ – కె.ఎం. మున్షి

22) రాజ్యాంగ పరిషత్ విధుల పై కమిటీ – గణేశ్ వాసుదేవ మౌలంకర్

## ప్రాథమిక హక్కులు

ప్రాథమిక హక్కులు రాజ్యాంగంలోని మూడవ భాగంలో పొందుపరచబడ్డాయి. పౌరులు తమ వ్యక్తిత్వాన్ని డెవలప్ చేసుకుని, బాధ్యత కలిగిన పౌరులుగా, హుందాగా జీవించేందుకు ప్రభుత్వం ద్వారా చట్టరీత్యా

ఇవ్వబడిన స్వేచ్ఛ స్వాతంత్రములు ఈ ప్రాథమిక హక్కులు.

**1. సమానత్వపు హక్కు:** (14,15,16,17,18) ఆర్టికల్స్‌లో ఉంది.

14. చట్టం ముందు అందరూ సమానమే ప్రభుత్వం వ్యక్తుల పట్ల, కుల, మత, వర్గ, వర్ణ, లింగ పుట్టిన ప్రాంతం దృశ్య ఎలాంటి వివక్ష చూపించరాదు.

15. పబ్లిక్ స్థలములు, పార్కులు, మ్యూజియంలు, బావులు స్నాన ఘట్టాలు, దేవాలయాలు అంతట అందరూ సమానమే (కానీ తిరుపతి, పూరీలో?) మహిళలకు, పిల్లలకు ప్రత్యేక వసతులు కల్పించాలి.

16. అందరూ అన్ని ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందవచ్చు (2003లో ఇతర దేశాల్లో పౌరసత్వం తీసుకున్న భారత పౌరులకు మాత్రం ఇది వర్తించదు ఉదా: వేములవాడ ఎమ్మెల్యే జర్మనీ పౌరుడు)

17. అంటరానితనం నిషేధం : అంటరానితనం ఆనాధి నుండి భారత వనిలో అంతర్ధగామై ఉంది కాబట్టి దాన్ని రూపుమపాడానికి దిన్ని నిషేదించారు.

18. బిరుదులు నిషేదం : స్వదేశంలో గానీ, ఇతర దేశాల్లో గాని ఇచ్చిన బిరుదులను గౌరవంగా స్వీకరించాలి తప్ప పేరుతో జతచేసుకొని ఊరేగుకూడదు, భారత రత్న, పద్మ విభూషణ్ లాంటివి బిరుదులుగా కాదు గౌరవంగా స్వీకరించాలి.

**2. స్వాతంత్రపు హక్కు:** (19,20,21,22) ఇది వ్యక్తిగత హక్కు ప్రతి పౌరుడు దీన్ని కలిగి ఉండాలనేది రాజ్యాంగ రచయితల అభిలాష.

### ఆర్టికల్ 19 ఈ ఆర్టికల్ పౌరులకు ఆరు స్వేచ్ఛలను ఇస్తుంది

1. వాక్ స్వాతంత్రపు హక్కు భావవ్యక్తీకరణ స్వాతంత్రం.
2. సమావేశాలు నిర్వహించుకేందుకు స్వేచ్ఛ (శాంతియుతమైనవిగా నిరాయుధ సమావేశాలు నిర్వహించుకోవడం) దేశం ప్రజల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని వీటిపై ప్రభుత్వం నియంత్రణ నిషేధం కూడా కొనసాగించే అవకాశం ఉంది).
3. సంస్థలు సొసైటీలు స్థాపించుకునే హక్కు (దేశం ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వీటిపై ప్రభుత్వ నియంత్రణ ఉండవచ్చు).

4. భారత పౌరుడు దేశంలోని అంతర్భాగాల్లో ఎక్కడికైనా పర్యటించవచ్చును (అంటు రోగాలు సంభవించినప్పుడు అరికట్టే క్రమంలో ప్రయాణాలను ప్రభుత్వం నిషేధించవచ్చును).

5. భారత అంతర్భాగలో ఏ ప్రదేశంలోనైనా పౌరులు నివాసాన్ని ఏర్పరచుకొనవచ్చును (ఎస్సీ, ఎస్టీల పరిరక్షణకై ప్రభుత్వము ఈ హక్కును నియంత్రణ చేయవచ్చు).

**3. దోపిడీని నివారించే హక్కు : (23,24) :** కట్టు బానిసత్వం బాల కార్మిక విధానాలు నిషేధం. 14 సంవత్సరాల లోబడి బాలబాలికలు కర్మాగారాలు ఘనులలో పనిచేయుట నిషేధం, భూస్వాములు పెత్తందారులు మానవ హక్కులకు విగాథం కలిగించుట కట్టు బానిసలుగా ఉంచుకొని తరతరాల స్వాతంత్రాన్ని హరించి వేయడం బానిస వర్తకులు, వ్యభిచారం లాంటి అశ్లీల వృత్తుల ముందు బలవంతంగా ప్రవేశించేలా చేయడం నిషేధం (కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ప్రభుత్వాలు జీతభత్యాలు లేని పనులకు పురమాయించడం సైనికులను భర్తీ చేయడం లాంటివి ప్రత్యేక పరిస్థితుల్లో రాజ్యాంగం ద్వారా అనుమతించబడ్డాయి.

**4. మత స్వాతంత్రపు హక్కు :** (25,26,27,28) రాజ్యాంగం ప్రకారం అన్నీ మతాలు సమానమే రాజ్యాంగం మతం అంటూ ఏదీ లేదు ఏ మతం ఇతర మతంపూ ప్రాధాన్యతను కలిగి లేదు ప్రతి పౌరుడు తనకి ఇష్టం వచ్చిన మతాన్ని అవలంబించే స్వేచ్ఛ కలదు. తను మతాల గురించి ఉపన్యసించవచ్చును, అవలంబించవచ్చును, మతవ్యాప్తి కోసం పాటుపడవచ్చును మతానుసారమైన సాంప్రదాయాలను గౌరవిస్తూ తమ ఉద్యోగ స్థలాల్లో వారి వారి సాంప్రదాయక వస్త్రంలను ధరించవచ్చును (ఉదా. ముస్లిం స్త్రీలు హిజాబ్, సిక్కులు తమతో పాటు తీసుకెళ్లే వారి సాంప్రదాయక వస్తువులను ధరించవచ్చు).

ధార్మిక సంస్థలు ప్రబోపయోగ స్వచ్ఛంద సంస్థలను స్థాపించవచ్చును, కార్యకలాపాలకును ప్రభుత్వం నిర్దేశించిన చట్టాల ప్రకారం చేపట్టవచ్చును చారిటబుల్ సంస్థలను కూడా ప్రబోపయోగం, సుహృద్భావన నియమాలను

పురస్కరించుకొని తమ కార్యకలాపాలను చేయునట్లుగా ప్రభుత్వం నిర్దేశించవచ్చును.

మత కార్యకలాపాల కొరకు ఎలాంటి పన్నులు విధించకూడదు.

ప్రభుత్వాలు నడిపే విద్యాసంస్థల్లో ప్రత్యేక మతాన్ని రుద్దే బోధనలు చేపట్టకూడదు.

పరిమితి : ప్రభుత్వ కార్యక్రమాలకు విగాథం కలిగించకూడదు, ప్రభుత్వాలు చేపట్టే ఆర్థిక సామాజిక రాజకీయ కార్యకలాపాలకు మతం చేపట్టే కార్యకలాపాలు అడ్డంకులుగా ఉండరాదు.

5. **విద్యా సాంస్కృతికి విషపు హక్కు : (29,30)** మతాలు, భాషలు, లిపులు, ఆయా మతాల వ్యక్తులు వారు వాటిని సంరక్షించుకోవచ్చు.

కులం, మతం, వర్గాలను ఆధారం చేసుకుని ప్రవేశాలు ఇవ్వవద్దు. (ఇవి రిజర్వేషన్లను ఉల్లఘించినట్లు కాదు, ఎందుకంటే రిజర్వేషన్లు రాజ్యాంగ సవరణల ద్వారా చేర్చబడ్డాయి).

మైనార్టిలను రాజ్యాంగం రెండు రకాలుగా గుర్తించింది. (1) మత పరమైన మైనారిటీలు, (2) భాషాపరమైన మైనారిటీలు: అల్ప సంఖ్యాక వర్గాల వారు విద్యాసంస్థలను స్థాపించవచ్చు, వారే నిర్వహించుకోవచ్చు. మత పరంగా తుక్కువ సంఖ్యలో ఉన్నావారు వారి సంస్కృతి అంతరించి పొకుండా వారి మతాచారులకు భంగంకలగకుండా ఉండానికి రాజ్యాంగలో ప్రత్యే స్థానాన్ని కల్పించడం జరిగింది. కాబట్టి తక్కువ సంఖ్యలో ఉన్న మతావలంభికులు భయంతో కాని న్యూన్యాతో గాని బ్రతకకుండా స్వేచ్ఛగా దైర్యంగా వారు నమ్ముకున్న దేవుని కొలుచుకొనుటకు మరియు వారి ఆచార వ్యవహారాలకు భంగం వాటిల్లకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈ మైనార్టీల రక్షణకై ఈ ఆర్టికల్‌ను రూపొందిచారు.

వేరే రాష్ట్రాల వారు మన రాష్ట్రంలోనికి వచ్చి బ్రతుకుతున్నాప్పుడు వారి భాషను వారు పరిరక్షించుకొనే హక్కు రాజ్యాంగం కల్పించింది. వారి బాషలోనే విద్యాలయాలను ఏర్పాటు చేసుకొని వారి బాష వికాసానికై కృషి చేసుకొవచ్చు వారి బాషలోనే విద్యాలయాలను నడిపించుకునే హక్కును భారత రాజ్యాంగా కల్పించింది.

ఒకవేళ ప్రభుత్వం ఈ మైనారిటీ విద్యాసంస్థల్ని వెనక్కి తీసుకుంటే నిర్వాహకులకు ప్రభుత్వామే నష్టపరిహారాన్ని చెల్లించాలి. ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేసేటప్పుడు మైనారిటీలకు మెజారిటీలో ఉన్న వాళ్లకు సమానంగా విడుదల చేయాలి.

వారు స్థాపించుకున్న విద్యాసంస్థల్లో ఉద్యోగుల నియమించేటప్పుడు ప్రభుత్వ నియామాలకు అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వాలి, నియామకాలు మాత్రం మైనారిటీలను చేసుకోవచ్చు.

6. **రజ్యాంగ పరిహార హక్కు :** ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు, వాటిని రాజ్యాంగ పరిహారపు హక్కును కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు (హెబీఎస్ కార్పస్, మాండమస్, ప్రోహిబిషన్, కోవారెంటో, సెర్టీ మురారి) ఒకవేళ అత్యవసర పరిస్థితులలో ఇవి ఏవి ఉండవు.

## భారత రాజ్యాంగం ప్రకారం మత స్వేచ్ఛ హక్కు అంటే ఏమిటి?

1. **మనస్సాక్షి స్వేచ్ఛ :** ప్రతి వ్యక్తికి రాజ్యం లేదా ఇతరుల జోక్యం లేకుండా మత విశ్వాసం లేదా అవిశాసాన్ని కలిగి ఉండే లేదా స్వీకరించే స్వేచ్ఛలో సహా తమకు నచ్చిన ఏదైనా మతాన్ని స్వేచ్ఛగా ప్రకటించడానికి, ఆచరించడానికి మరియు ప్రచారం చేయానికి హక్కు ఉంది.

2. **అన్ని మతాల సమానత్వం :** భారత రాజ్యాంగం లౌకికవాదాన్ని ప్రోత్సాహిస్తుంది మరియు మతపరమైన వివక్షను నిషేధిస్తుంది. అన్ని మతాలు సమానంగా పరిగణించబడతాయి మరియు రాష్ట్రం ఏదైనా నిర్దిష్ట మతానికి అనుకూలంగా లేదా వివక్ష చూపదు.

3. **ఆరాధనా స్వేచ్ఛ :** దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా లేదా మరే ఇతర మతపరమైన సంస్థ అయినా, ఏ ప్రార్ధనా స్థలంలోనైనా పూజించే లేదా ప్రార్ధనలు చేసే హక్కు ప్రతి వ్యక్తికి ఉంది. ఒక రాష్ట్రం ఈ మతపరమైన ఆచారాలను పబ్లిక్ అర్డర్‌కు వ్యతిరేకంగా పరిగణించనంత వరకు నియంత్రించదు లేదా పరిమితం చేయదు.

4. **మతపరమైన వ్యవహారాల నియంత్రణ :** దేవాలయాలు, మసీదులు మరియు చర్చిలు వంటి మతపరమైన సంస్థలను నియంత్రించే మరియు నిర్వహించే అధికారం రాష్ట్రానికి ఉంది, సరైన పరిపాలనను నిర్ధారించడానికి – దుర్వినియోగాన్ని నిరోధించడానికి కానీ చట్టం ప్రకారం మరియు మతపరమైన ఆచారాలలో జోక్యం చేసుకోకూడదు.
5. **బలవంతపు మార్పిడుల నుండి విముక్తి :** వ్యక్తులు తమ మతాన్ని ప్రచారం చేయగలిగినప్పటికీ, బలవంతపు మార్పిడులు అనుమతించబడవు. ఒకరి మతాన్ని మార్చడానికి బలవంతం, ప్రేరేపించడం లేదా మోసం చేయడం మతం హక్కును ఉల్లంఘించినట్లు పరిగణించబడుతుంది.
6. **సాంస్కృతిక మరియు విద్యా హక్కులు :** భారతదేశంలోని మతపరమైన మరియు భాషాపరమైన మైనారిటీలు తమ ప్రత్యేక భాష, లిపి మరియు సంస్కృతిని కాపాడుకునే హక్కును కలిగి ఉన్నారు. తమకు నచ్చిన విద్యాసంస్థలను స్థాపించి నిర్వహించుకునే హక్కు కూడా వారికి ఉంటుంది.

ఏది ఏమైనప్పటికీ, మతం పట్ల హక్కు సంపూర్ణమైనది కాదని మరియు పబ్లిక్ ఆర్డర్, నైతికత మరియు ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా కొన్ని సహేతుకమైన పరిమితులకు లోబడి ఉంటుందని గమనించడం ముఖ్యం.

## రాజ్యాంగం కింద మత స్వేచ్ఛపై ఆర్టికల్స్

### 1. ఆర్టికల్ 25 (మనస్సాక్షి, స్వేచ్ఛ మరియు స్వేచ్ఛా వృత్తి, అభ్యాసం మరియు మత ప్రచారం)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 పౌరులందరికీ మనస్సాక్షి స్వేచ్ఛ, మతాన్ని ప్రకటించే, ఆచరించే మరియు ప్రచారం చేసే స్వేచ్ఛను హామీ ఇస్తుంది.

- ఆర్టికల్ 25 ప్రకారం ఈ స్వేచ్ఛలు పబ్లిక్ ఆర్డర్, ఆరోగ్యం మరియు నైతికతకు లోబడి ఉంటాయి.
- ఈ కథనం రాష్ట్రం చట్టాలను రూపొందించగల నిబంధనను కూడా అందిస్తుంది:

1) ఇది ఏదైనా మతపరమైన ఆచారంతో అనుసంధానించబడిన ఏదైనా ఆర్థిక, ఆర్థిక, రాజకీయ లేదా ఇతర లౌకిక కార్యకలాపాలను నియంత్రిస్తుంది మరియు పరిమితం చేస్తుంది.

2) ఇది సాంఘిక సంక్షేమం - సంస్కరణలు లేదా హిందువులలోని అన్ని వర్గాలకు ప్రజా స్వభావం కలిగిన హిందూ మత సంస్థలను తెరవడం కోసం అందిస్తుంది. దీని కింద, హిందువులు సిక్కు, జైన్ లేదా భౌద్ధ మతాలను ప్రకటించే వ్యక్తులను చేర్చారు మరియు హిందూ సంస్థలు కూడా తదనుగుణ:గా భావించబడతాయి. సిక్కు మతం యొక్క ప్రజలు కూడా కిర్పాన్ ధరించడం మరియు ధరించడం సిక్కు మతం యొక్క వృత్తిలో చేర్చబడినట్లు పరిఘణించబడుతుంది.

ఉదాహరణకు, పండుగలు జరుపుకునే హక్కు - ఆర్టికల్ 25 వ్యక్తులు మతపరమైన పండుగలను జరుపుకోవచ్చని మరియు మతపరమైన ఆచారాలను అడ్డంకులు లేకుండా నిర్వహించవచ్చని నిర్ధారిస్తుంది. భారతదేశంలో విస్తృతంగా జరుపుకునే అటువంటి పండుగ దీపావళి, దీపాల పండుగ.

## 2. ఆర్టికల్ 26 (మత వ్యవహారాలను నిర్వహించే స్వేచ్ఛ)

నైతికత, ఆరోగ్యం మరియు ప్రజా క్రమానికి లోబడి ప్రతి మత వర్గానికి ఈ క్రింది హక్కులు ఉన్నాయని ఈ ఆర్టికల్ అందిస్తుంది.

- మతపరమైన మరియు ధార్మిక ఉద్దేశాల కోసం సంస్థలను ఏర్పాటు చేయడానికి మరియు నిర్వహించడానికి హక్కు.
- మతం విషయంలో తన స్వంత వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు.
- స్థిర మరియు కదిలే ఆస్తిని పొందే హక్కు.
- చట్టం ప్రకారం అటువంటి ఆస్తిని నిర్వహించే హక్కు.

**ఉదాహరణ:** సిక్కు గురుద్వారా చట్టం

1925 నాటి సిక్కు గురుద్వారా చట్టం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 26కి సంబంధించినది, ఇది భారతదేశంలోని గురుద్వారాల యొక్క మెరుగైన పరిపాలన మరియు పాలన కోసం రూపొందించబడింది.

సిక్కు గురుద్వారా చట్టం ప్రకారం, అనేక గురుద్వారాలు మరియు సిక్కు మత సంసత్థలను నిర్వహించడానికి మరియు నిర్వహించడానికి శిరోమణి గురుద్వారా పర్టంధక్ కమిటీ అని పిలువబడే చట్టబద్ధమైన సంస్థ స్థాపించబడింది. ఈ చట్టం సిక్కు సమాజాన్ని ఒక మతపరమైన తెగగా గుర్తిస్తుంది మరియు వారి మతపరమైన వ్యవహారాలను స్వతంత్రంగా నిర్వహించుకునే హక్కునే వినియోగించుకునేందుకు వీలు కల్పిస్తుంది.

## 3. ఆర్టికల్ 27 (ఏదైనా నిర్దిష్ట మతాన్ని ప్రోత్సహించడానికి పన్నులు చెల్లించే స్వేచ్ఛ)

పన్నులు ఉండకూడదని ఈ కథనం పేర్కొంది, దీని ద్వారా వచ్చే ఆదాయం ఏదైనా నిర్దిష్ట మతం లేదా మతపరమైన తెగల ప్రచారం మరియు/లేదా నిర్వహణ కోసం నేరుగా ఉపయోగించబడుతుంది.

## 4. ఆర్టికల్ 28 (కొన్ని విద్యాసంస్థల్లో మతపరమైన బోధన లేదా మతపరమైన ఆరాధనకు హాజరయ్యే స్వేచ్ఛ)

ఈ కథనం మతపరమైన బోధనలను వ్యాప్తి చేయడానికి మత సమూహాలను నిర్వహించే విద్యా సంస్థలను అనుమతిస్తుంది.

- ప్రభుత్వ ఆధ్వర్యంలోనడిచే విద్యాసంస్థల్లో ఎలాంటి మతపరమైన బోధన అందించరాదని ఇది పేర్కొంది.
- రాష్ట్రంచే నిర్వహించబడే విద్యాసంస్థలు కానీ ఏదైనా ఎండోమెంట్ లేదా ట్రస్ట్ కింద స్థాపించబడి, అటువంటి సంస్థలలో మతపరమైన బోధనను అందించాల్సిన అవసరం ఉంది, పై నిబంధన నుండి మినహాయించబడతాయి (మతపరమైన బోధన అందించబడదు).
- రాష్ట్రంచే గుర్తించబడిన ఏదైనా విద్యాసంస్థకు హాజరయ్యే లేదా రాష్ట్ర సహాయాన్ని పొందుతున్న ఏ వ్యక్తి అయినా, అతను/ఆమె సమ్మతి ఇస్తే తప్ప, అటువంటి సంస్థలలో అందించబడే ఏదైనా మతపరమైన బోధనలో పాల్గొనాల్సిన అవసరం లేదు లేదా అలాంటి సంస్థలలో ఏదైనా మతపరమైన ఆరాధనకు హాజరు కానవసరం లేదు. మైనర్ల విషయంలో, సంరక్షకులు దానికి సమ్మతి ఇచ్చి ఉండాలి.

- ఈ నిబంధనల ఆధారంగా (వరుసగా) ఉదాహరణలు :

**ఉదాహరణలు**

1) భారతదేశంలోని ప్రభుత్వ - నిధుల ప్రాథమిక పాఠశాల పాఠ్యాంశాల్లో భాగంగా మతపరమైన ప్రార్థనలు లేదా మతపరమైన బోధనలను కలిగి ఉండకూడదు. పాఠశాల తప్పనిసరిగా లౌకిక వాతావరణాన్ని నిర్వహించాలి మరియు ఏదైనా నిర్దిష్ట మతాన్ని ప్రచారం చేయకుండా ఉండాలి.

2) భారతేశంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి పాఠశాల వేళల వెలుపల దేవాయం, మసీదు, చర్చి లేదా గురుద్వారా వంటి ప్రార్థనా స్థలంలో మతపరమైన బోధనను స్వీకరించడానికి ఎంచుకోవచ్చు. పాఠశాల ఈ ఎంపికలో జోక్యం చేసుకోదు లేదా మతపరమైన బోధనను బలవంతం చేయదు.

3) భారతదేశంలోని ఒక ప్రైవేట్ పాఠశాల, ప్రభుత్వం నుండి పాక్షిక నిధులను పొందుతుంది లేదా పూర్తిగా స్వయం - ఆర్థికమైనది, మతపరమైన బోధనను ఐచ్ఛిక అంశంగా అందించవచ్చు. అయితే, ఈ తరగతులకు హాజరుకావాలా వద్దా అని నిర్ణయించుకునే స్వేచ్ఛ విద్యార్థులకు లేదా వారి తల్లిదండ్రులకు ఉండేలా చూసుకోవాలి మరియు ఏ విద్యార్థి తమ ఇష్టానికి విరుద్ధంగా దానిని స్వీకరించమని ఒత్తిడి చేయకూడదు. ఇప్పుడు మీరు వ్యాసాలు చదివిని తర్వాత సెక్యులరిజం యొక్క అర్థం వైపు వెళ్దాం.

## ప్రస్తుత అఖండ భారత పనిలో రాజ్యాంగ ఉల్లంఘన - మతోన్మాదుల విషకౌగిలిలో రాజ్యాంగం

ఆర్టికల్ 29 ప్రకారం మైనారిటీ మతానికి చెందిన పౌరులు తమ మతానికి చెందిన ఆరాధన పద్ధతులు, సంస్కృతులు, సాంప్రదాయాలు స్వేచ్ఛగా ఆచరించే హక్కు రాజ్యాంగం ఇచ్చింది. ఈ హక్కు అమలు అనేది నేడు పెద్ద సవాలుగా మారింది. మన రాజ్యాంగంలో పౌరులకు మత స్వేచ్ఛ ఉంది. కానీ రాజ్యానికి (ప్రభుత్వానికి) మతం లేదు. ఉండదు కూడా. ఎంతుకంటే ఇది లౌకిక రాజ్యం. “మతం పేరుతో రాజకీయాలు చేయడం రాజ్యాంగ విరుద్ధం”. అయితే ప్రస్తుతం మతమే రాజకీయం అయింది. ప్రతి విషయాన్ని మత కోణంలో చూడడం పెరిగిపోయింది.

దేశంలో లౌకిక, ప్రజాస్వామిక విలువలకు మతోన్మాదం ప్రమాద తీవ్రంగా పరిణమించింది. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులపై దాడి తీవ్రమైంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 దేశ పౌరులందరు సమానులే అని ఉద్ఘాటిస్తుంటే, ఆర్టికల్ 15 మతం, కులం, జాతి, లింగం, పుట్టిన ప్రాంతం ఆధారంగా ఏ పౌరుని పట్ల వివక్ష చూపరాదని, అలా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టరీత్యా నేరం అని స్పష్టం చేసింది. కానీ బీ.జే.పీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రిక్షా తొక్కి కుటుంబాన్ని పోషించుకుంటున్న తస్లీమ్ బేగ్‌ను బజరంగ్ దళ్ మూకలు చుట్టు ముట్టి 'జై శ్రీరామ్' అనాలని, తన మైనర్ కూతురు సమక్షంలోని తీవ్రంగా కొట్టారు. పోలీసు స్టేషన్‌లో కేసు పెడితే నిందితులను మూడు రోజులలో వదిలేశారు. వారు బయటికి వచ్చి హిందూ ఏరియాలోకి వస్తే చంపెస్తామని బహిరంగంగా హెచ్చరించారు. మధ్యప్రదేశ్ దివాస్ జిల్లాలో సైకిల్‌పై తిరిగి బిస్కెట్లు అమ్ముకునే జాయెద్ ఖాన్ అనే వ్యక్తిని ఆధార్ కార్డు చూపించమని కొట్టారు. గ్రామలలో తిరిగి బిస్కెట్లు అమ్మితే చంపేస్తామని బెదిరించారు. అలాగే చిత్తు కాగితాలు, పాత ఇనుప సామానులను కొనుగోలు చేసే మరో వీధి వ్యాపారిని ఇదే రకంగా కట్టేసి కొట్టారు. ఇప్పుడు వీరు బయటికి రావాలంటే భయంతో వణికి పోతున్నారు. దాడి చేసినవారిపై పోలీస్ కేసులు లేవు, కేవలం మందలించి వదిలేస్తున్నారు. మధ్యప్రదేశ్ బోర్లి ప్రాంతంలో గర్బాహ అనే గ్రామంలోకి హిందూయేతరులు రావడాన్ని నిషేధిస్తూ వి.హెచ్.పి బోర్డులు ఏర్పాటు చేసింది. ద్వారకా ప్రాంతంలో హజ్ భవన్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ విశ్వహిందూ పరిషత్ ధర్నా నిర్వహించి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ ఘటనలన్ని స్పష్టం చేస్తున్నదేమిటంటే చట్టం అందరికీ సమానం కాదని, మతం పేరుతో విచక్షణ చూపించినా, దాడులు చేసినా చట్టం ఏమీ అనదు అనే సందేశాన్ని ఇస్తున్నాయి.

ఆర్టికల్ 21 ప్రతి మనిషికి స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించింది. హర్యానా – జిల్లా కేర్ ఖలీల్ గ్రామంలో ఆసిఫ్ ఖాన్ అనే 27 సంవత్సరాల యువకుడిని అకారణంగా మతోన్మాదుల గుంపు దారుణంగా హత్య చేయడంతో పాటు, గ్రామంలో ముల్లాలనందరిని వదిలిపెట్టం అని హెచ్చరించింది. గతంలో కూడా గో రక్షణ దళాల పేరుతో పెహ్లూ ఖాన్, అఖ్లాక్ లాంటి అనేక మందిని

అందరూ చూస్తుండగానే దారుణంగా హత్య చేసారు. ఉపాధి అవకాశాలను కూడా దెబ్బ తీశారు. ఇవన్నీ రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కును హరించేవే. ఆర్టికల్ 23 సెక్షన్ (2) ప్రకారం రాజ్యం (ప్రభుత్వం) మతం, కులం, జాతి, లింగం, పుట్టిన ప్రాంతం ఆధారంగా ఏ మనిషి పట్ల వివక్ష చూపరాదు. కానీ అఖ్లాక్ హత్య కేసులో నిందితులకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించింది. (విద్వేష ప్రకటనలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, బీ.జే.పీ, ఆర్.ఎస్.ఎస్‌కు చెందిన నాయకులపై ఎలాంటి కేసులు పెట్టడం లేదు). త్రిపురలో మైనారిటీలపై వి.హెచ్.పి దాడులకు పాల్పడి ఆస్తులను, ఇళ్ళను, ప్రార్థనా స్థలాలను ధ్వంసవ చేసి నిప్పంటించినా వారిపై కేసులు పెట్టలేదు. కానీ మైనారిటీలపై జరిగిన మత హింసను విచారించడానికి వెళ్లిన నిజనిర్ధారణ బృందంపై దేశ ద్రోహం కింద కేసులు పెట్టారు. హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిని వదిలేసి, బాధితులను పరామర్శించిన వారిపై కేసులు పెట్టడం అంటే మతోన్మాద దాడులను ప్రోత్సహించడమే కదా! నేడు మణిపూర్, బాధితులను పరామర్శించిన వారిపై కేసులు పెట్టడం అంటే మతోన్మాద దాడులను ప్రోత్సహించడమే కదా! నేడు మణిపూర్ ఉదంతం కూడ. ఆర్టికల్ 25 సెక్షన్ (1) ప్రకారం దేశ పౌరులందరికీ మత స్వేచ్ఛ ఇవ్వబడింది. పౌరులు తమకు నచ్చిన మతాన్ని, ఆరాదన పద్ధతులను స్వేచ్ఛగా ఆచరించవచ్చు. ప్రచారం చేసుకోవచ్చు. ఏ మతంపై విశ్వాసం ప్రకటించకుండా స్వతంత్రంగా ఉండే హక్కు కూడా పౌరులకు ఇవ్వబడింది. ఎవరిపైనా బలవంతంగా విశ్వాసాలను, నమ్మకాలను రుద్దరాదని రాసుకున్నాం. అయితే మానవ హక్కు కూడా పౌరులకు ఇవ్వబడింది. ఎవరిపైనా బలవంతంగా విశ్వాసాలను, నమ్మకాలను రుద్దరాదని రాసుకున్నాం. అయితే మానవ హక్కుల సంఘాల నివేదిక ప్రకారం 2021లో సెప్టెంబర్ నెలాఖరి నాటికి అంటే 9 నేలల కాలంలోనే క్రైస్తవ ప్రార్థనా సమావేశాలపై 300 దాడులు జరిగాయి. ప్రార్థనల్లో పాల్గొన్న వారిని తీవ్రంగా కొట్టారు. దాడులకు గురైన వారంతా దళితులు, గిరిజనులు. బలవంతపు మత మార్పిడులు అనే పేరుతో దళితులకు, గిరిజనులకు రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛ హక్కును హరిస్తున్నారు. కులం పేరుతో, అంటరానితనం పేరుతో అణిచివేసినప్పటికీ వాళ్ళ కాళ్ళ కింద

పడి ఉండాలనేది వారి ఉద్దేశ్యం. అందుకే దాడులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శుక్రవారం రోజున ముస్లింలు ప్రార్థనలు చేయకుండా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో... హర్యానా రాష్ట్రం గుర్గావ్‌లోని ఎనిమిది ప్రాంతాలలో అడ్డుకున్నారు. ఈ రకంగా దేశంలో మైనార్టీలకు ఉన్న మత స్వేచ్ఛను, ఆరాధన స్వేచ్ఛను కాలరాశారు. చట్టాలను ఉల్లంఘిస్తూ, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, దాడులకు దిగుతున్నారు. ఈ దాడులపై ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా వ్యవహరించిన పరిస్థితి లేదు. ఆర్టికల్ 29 ప్రకారం మైనారిటీ మతానికి చెందిన పౌరులు తమ మతానికి చెందిన ఆరాధన పద్ధతులు, సంస్కృతులు, సాంప్రదాయాలు స్వేచ్ఛగా ఆచరించే హక్కు రాజ్యాంగం ఇచ్చింది. ఈ హక్కు అమలు అనేది నేడి పెద్ద సవాలుగా మారింది.

టి 20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఓడితే దానికి ముస్లిం కాబట్టి బౌలర్ షమీని బాధ్యుడిని చేసి మతం పేరుతో దుర్మార్గంగా ట్రోల్ చేశారు. బౌలర్ షమీపై మతం పేరుతో దాడి చేయడాన్ని కెప్టెన్ విరాట్ కోహ్లీ వ్యతిరేకించినందుకు ఆయన ఏడాది వయసున్న కూతురిపై అత్యాచారం చేస్తామని బెదిరింపులకు దిగారు. అలా బెదిరింపులకు దిగింది తెలంగాణకు చెందిన ఉన్నత విద్యావంతుడు కావడం మనం రాష్ట్రానికే అవమానం. అంతేకాదు, తెలంగాణలో విస్తరిస్తున్న మతోన్మాద విష సంస్కృతికి ఇది నిదర్శనం. అసోం రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా భూములో సాగు చేసుకుని జీవిస్తున్న రెండు గ్రామాల ప్రజలు కేవలం ముస్లింలు అయినందువలన వారిపైన పారామిలటరీ దళాలను ప్రయోగించి, కాల్పులు జరిపి భూముల నుండి బలవంతంగా తొలగించారు. ఆ కాల్పుల్లో ఇద్దరు పౌరులు చనిపోయారు. పోయిన వ్యక్తి శవంపై మీడియా ఫొటోగ్రాఫర్ ఎగిరి గంతులు వేయడం కొంతమందిలో పెరుగుతున్న విద్వేష మానసిక స్థాయికి పరాకాష్ట. ఈ దారుణాన్ని చూసి ప్రపంచమే నివ్వెరపోయింది. అంతర్జాతీయ మీడియా 'డాన్సింగ్ ఆన్ డెడ్ బాడీ' పేరుతో సంపాదకీయం రాసి దేశంలో పెరుగుతున్న మత ఉన్మాదపు సంస్కృతిని నిరసించింది. గుజరాత్‌లో రోడ్డు పక్కన మాంసాహార పదార్థాల అమ్మకాలను నిషేధించారు. వీధి వ్యాపారం చేస్తూ జీవించేవారిలో మైనారిటీలు, దళితులు ఎక్కువ మంది ఉన్నారు. ఈ నిషేదం మతోన్మాద కుట్ర

తప్ప మరొకటి కాదు. కేరళలో హలాల్ పేరుతో రెస్టారెంట్లో వ్యాపారాన్ని దెబ్బతీయడం కోసం బిజెపి పెద్ద ఎత్తున కుట్రకు తెరలేపింది. చివరికి అయ్యప్ప స్వామి ప్రసాదం తయారు చేయడానికి వాడే బెల్లంపై కూడా హలాల్ పేరుతో వివాదం సృష్టించి అభాసుపాలైంది.

ఇలా రోజూ ఏదో పేరుతో మత విద్వేషాలు, వివాదాలు సృష్టించడం, ప్రచారం చేయడం తప్ప మనుషుల గురించి, వారి విద్య, ఉద్యోగాలు, ఆరోగ్యం, వైద్యం, ఉపాధి, జీవన సౌకర్యాల మెరుగుదల గురించి ఏ రోజు కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. ఒకవైపు అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులు పాలకుల అండతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం కొల్లగొట్టి ప్రపంచ కుబేరుల జాబితాలో చేరిపోతుంటే, మరోవైపు దేశంలో నిష్ట దరిద్రుల సంఖ్య 6 కోట్ల నుండి 13.5 కోట్లకు పెరిగింది.

ప్రజా సమస్యలు చర్చలోకి రాకుండా పక్కా ప్రణాళిక ప్రకారం విద్వేష రాజాకీయాలు, విద్వేష ప్రకటనలు చేస్తూ సంఘ పరివార్ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ప్రజల వాస్తవ సమస్యలు చర్చలోకి రావాలి. అలా జరగాలంటే దేవంలో శాంతియుత, సామరస్యపూర్వక ఏర్పడాలి. లౌకిక, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ జరగాలి. రాజకీయాల నుండి మతాన్ని విడదీయాలి.

## ఆర్టికల్ 25,26,27,28లపై మత చాందస వాదుల విమర్శ

(ప్రజా భద్రత, నైతికత ఆరోగ్య విషయాలకు లోబడి మన స్వాతంత్ర్యమూ, మతాన్ని స్వేచ్ఛగా ప్రకటించే, ఆచరించే, ప్రచారం చేసే హకు అందరు వ్యక్తులకూ సమానంగా ఉండును) అని 25వ అధికారణంలో మొదటి క్లాజు పేర్కొంటుంది.

ఈ సందర్భంలో ఒక చారిత్రక వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి.

రాజ్యాంగాన్ని తమ కోసం రాసుకుంటున్నది భారత ప్రజలు. వారిలో నూటికి 80 మందికి పైగా హిందువులు. వారు మతాన్ని ఆచరిస్తారు. ప్రకటిస్తారు కాని ప్రచారం చేయరు. గట్టిగా మత ప్రచారం చేయాలన్న ధ్యాసగాని, ఇతరులను తమ మతంలోకి చేర్పించాలన్న ఆలోచన గాని హిందూ సమాజానికి ఎన్నడూ

లేదు. విదేశీ పీడపోయి, స్వాతంత్ర్యం వచ్చాక, కొత్తగా రాసుకుంటున్న రాజ్యాంగంలో మత ప్రచార హక్కును పొందుపరచాలన్న ఊహే ఏ హిందువుకూ – అంటే జనాభాలో 80 శాతానికి పైగా ప్రజలకు లేదు. ఆ కోర్కైతే లేదు గాని అన్యమత ప్రచారాల భయం మాత్రం వారికి జాస్తి. ఎందుకంటే ఐదు శతాబ్దాలకు పైగా సాగిన ముస్లిం పాలనలో ఇస్లాంలోకి బలవంతపు మతమార్పిళ్ల బెడద వల్ల. దాదాపు రెండు శతాబ్దాలుగా బ్రిటిష్ హయాంలో క్రైస్తవ మిషనరీల ముమ్మర మతాంతరీకరణల వల్ల వారు నానా అగచాట్లు పడ్డారు. భయానక చిత్తక్షోభను అనుభవించారు. కనీసం స్వరాజ్యం వచ్చాకైనా విచ్చలవిడి మతాంతరీకరణల పీడ లేకుండా, తమ మానాన తాము నిశ్చితంగా బతికి, తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరించే సావకాశం ఉంటే చాలు, అదే పదివేలు అన్న భావనతో 80 శాతానికి పైగా ప్రజలు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో మెజారిటీ అభీష్టమే శిరోధార్యం. నూటికి 80 శాతంకి పైగా ప్రజలు మత ప్రచారం మక్కును కోరునప్పుడు ప్రత్యేకంగా ఏరికోరి దాన్ని దేశ రాజ్యాంగంలో పొందుపరచవలసిన అవసరం లేదు. అన్ని మతాలనూ ఆదరిస్తూ, ఎవరు ఏ మతాన్ని వ్యాప్తిచేసినా, ఎవరు ఏ మతంలోకి ఇష్టపడి చేరినా ఏనాడూ అభ్యంతరం తెలపని హిందూదేశంలో తమ మతం మనుగడ గురించి ఏ మతానికి చెందిన వారికీ అనుమానం గాని, భయం గాని ఉండటానికి ఆస్కారమే లేదు. మైనారిటీ మతాల వారికి పనిగట్టుకుని హామీలు, గ్యారంటీలు రాజ్యాంగంలో చేర్చవలసిన అవసరం ఎంతమాత్రం లేదు.

అందుకే, బాబాసాహెబ్ అంబేడ్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీ రూపొందించిన రాజ్యాంగం తొలి ముసాయిదాలో మత ప్రచారం హక్కు ఊసే లేదు. (మత స్వాతంత్రానికీ, మతాన్ని స్వేచ్ఛగా ప్రకటించి, ఆచరించడానికీ పౌరులందరికీ సమాన మక్కు ఉండును...) అదే తొలి ముసాయిదాలో ఉన్నది. Propagate religion (మతాన్ని వ్యాప్తి చేసుకొనే హక్కు) ఆ అధికరణంలో తరవాత వచ్చి చేరింది. All citizens (పౌరులందరికీ) అని ముసాయిదాలో ఉన్న మాట కాస్త తుది ప్రతిలో All persons (అందరు వ్యక్తులకూ)గా మరిపోయింది. దీనికి కారణమేమిటి.

భారత రాజ్యాంగంలో విస్తృత అధ్యయనం చేసిన విఖ్యాత అమెరికన్ మేధావి Donald E.Smith తన India as a Secular State గ్రంథంలో చెప్పిందేమిటంటే?

(ఈ హక్కును ప్రత్యేకంగా చేర్చడానికి క్రిష్టియన్ మైనారిటీ పట్టుదల విశేష ప్రభావం చూపింది. కాథలిక్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్స్ సంస్థల జాయింట్ కమిటీ 1945లో చేసిన తీర్మానం మత ప్రచారం హక్కుకు గ్యారంటీ ఉండాలని, మతమార్పిడి మూలంగా సివిల్ లేక రాజకీయ పరమైన అనర్హత కలగరాదని డిమాండు చేసింది.)

మత ప్రచారాన్ని హక్కుగా ఆమోదిస్తే అది పెద్ద ఎత్తున మతమార్పళ్లకు దారి తీయవచ్చని రాజ్యాంగ సభలో కొందరు సభ్యులు అభిప్రాయపడ్డారు. మోసం చేసో, బలవంతానో, ఒత్తిడి పెట్టో ఎవరిని మతం మార్పించినా, అది చట్టరీత్యా చెల్లకూడదంటూ కె.ఎం.మున్షీ ఒక సవరణ ప్రతిపాదించారు. క్రైస్తవ సభ్యులు దాన్ని వ్యతిరేకించారు. అంబేద్కర్ కూడా ప్రతిఘటించడంతో మున్షీ సవరణ వీగిపోయింది.

భారతదేశం మొదటి నుంచీ బహుళత్వానికి వేదిక. ఒక మతం మాత్రమే గొప్పదిబీ మిగిలినవన్ని చెడ్డవి అన్న సంకుచితత్వం భారతీయులకు ఏనాడూ లేదు. తమ మతంలోని మంచి అంశాలను, దాని ప్రత్యేకతలను ఎవరైనా ప్రచారం చేసుకోవచ్చు. వాటికి ఆకర్షితులై ఎవరైనా వారి మతంలోకి ఐచ్ఛికంగా చేరితే అభ్యంతరం అక్కర్లేదు. ఇతర మతాల ప్రభావం గాని, ప్రచారంగాని ఏ మాత్రం సోకుండా హిందూ సమాజం చుట్టూ దడి కట్టాలని ఎవరూ కోరరు. అదే సమయంలో డబ్బో, మరొకటో ఎరవేసి, తగని ఒత్తిడి తెచ్చి, బలవంత పెట్టి అమాయకులను మతం మార్పించటం దుర్మార్గం. మిషనరీ స్కూళ్లు, కాలేజీలలో విద్యాబోధన నెపంతో... మిషనరీ ఆస్పత్రులలో ఉచిత వైద్యం ఎరతో క్రైస్తవంలోకి మతమార్పిళ్లు చేయటం లాంటి ఆగడాలు ఈస్టిండియా కంపెనీ కాలం నుంచీ, అసంఖ్యాకంగా జరిగాయి. అన్నన్ని చేదు అనుభవాలు ఉన్నాయి కాబట్టే మత ప్రచారాన్ని హక్కుగా స్థిరపరిస్తే అది విశ్వంఖల మతాంతరీకరణలకు ఎక్కడ దారితీస్తుందోనని హిందువులు భయపడ్డారు.

మత ప్రచారం చేసుకునే స్వేచ్ఛ కల్పించినంత మాత్రాన విశృంఖల మతాంతరీకరణలకు లైసెన్సు ఇచ్చినట్టు కాదు. రాజ్యాంగం రాసిన వారికి, దానిని ఆమోదించిన వారికి ఆ విషయంలో స్పష్టత ఉంది. న్యాయ స్థానాలకూ స్పష్టత ఉంది.

(25(1) అధికరణం ప్రసాదించింది తన మత సూత్రాలను వివరించి, తమ మతాన్ని వ్యాప్తి చేసుకొనే హక్కును మాత్రమే. వేరొక వ్యక్తిని తన మతంలోకి మార్పించే హక్కును కాదు.... ఒకరికి ఉన్న స్వేచ్ఛ వేరొకరికి కూడా సమానంగా ఉంటుంది. ఏ వ్యక్తినీ తన మతంలోకి మార్పిడి చేసే ప్రాథమిక హక్కు అంటూ ఏదీ లేదు.)

అని Rev. Stainslaus Vs. State of Madhya Pradesh కేసులో సుప్రీంకోర్టు తేటతెల్లం చేసింది. చిత్రమేమిటంటే, ఈ చిన్న కామన్‌సెన్స్ పాయింటే 'సెక్యులరిజం' ప్రవక్త జవహర్లాల్ నెహ్రూగారి పెద్ద బుర్రకు ఎక్కలేదు.

(కేవలం మత స్వాతంత్ర్యాన్నే కాదు; మత మార్పిడిని కూడా మనం మన రాజ్యాంగం ద్వారా అనుమతిస్తాం) అని 1952 అక్టోబరు 17న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ రాసిన గొప్ప లేఖలో తొలి భారత ప్రధాని నెహ్రూగారు పచ్చి అబద్ధమాడారు.

విదేశీ మిషనరీలు, స్వదేశీ మిషనరీలు యథేచ్ఛగా క్రైస్తవమతం వ్యాప్తి చేస్తూ, క్రైస్తవంలోకి మత మార్పిళ్లు చేసుకుపోవడానికి అన్ని విధాలు సహకరించమంటూ అందులో ముఖ్యమంత్రులను ఆదేశించారు.

బ్రిటిషు పరిపాలన సాగినతం కాలమూ క్రైస్తవ మత వ్యాప్తి మీద, మిషనరీల మత మార్పిడి కార్యకలాపాల మీద తగు మాత్రం ఆంక్షలు ఉండేవి. విదేశాల నుంచి మిషనరీలు వచ్చిపడి, విదేశీ ధారాళంగా విరజిమ్మి, జనాలను టోకున క్రైస్తవంలోకి అడ్డగోలుగా మార్పించడానికి బ్రిటిష్ ఇండియాలో అంతగా వీలు ఉండేది కాదు. తెల్లవాళ్లు పోయి, స్వదేశీ మారాజులు వచ్చి కూచున్నాక ఆపాటి అదుపూ మృగ్యమైంది. మత స్వాతంత్ర్యం "పౌరులకు" మాత్రమే కాక దేశంలోని 'అందరు వ్యక్తులకూ' ఉంటుందని రాజ్యాంగం 25(1) అధికరణం చేత చెప్పించడంతో దేశంలోకి వచ్చిపడ్డ విదేశీ మిషనరీలకు ఆడింది ఆట అయింది. మత మార్పిడి రాజ్యాంగ హక్కు అని ఏకంగా దేశ ప్రధానమంత్రే డబాయించి,

ఫారిన్ మిషనరీల కొమ్ము కాయడం కంటే క్రైస్తవ పెద్దలకు జాక్‌పాట్ ఏమి కావాలి? రాజ్యాంగ రక్షణ పుణ్యమా అని మన పంట భలే పండింది అని మిషనరీలు మురిసిపోయారంటే ఆశ్చర్యం ఏముంది?

"ఇండియాలో చర్చ్ సంతోషంగా ఉన్నది. ఎందుకంటే దానికంటే ఎంతో బలమైన మత సముదాయాలతో సమానతనూ, స్వేచ్ఛాయుత వాతావరణాన్నీ భారత రాజ్యాంగం దానికి గ్యారంటీ చేసింది. ఈ రాజ్యాంగ రక్షణ మూలంగా, స్వాతంత్ర్యం తరువాత తన కార్యకలాపాలను పెంచుకుంటూ. గట్టి ఆటంకం గానీ, ఆందోళన గానీ లేకుండా, గతంలో ఎన్నడూ లేనంత చక్కగా, చర్చ్ అభివృద్ధి చెందగలుగుతున్నది".

'ఇండియాలో కాథలిక్ చర్చ్ : నిన్న, నేడు' అనే గ్రంథం 6వ పేజీలో స్వయానా క్రైస్తవ మిషనరీ అయిన ఫెలిక్స్ ఆల్‌ఫ్రెడ్ ప్లాట్‌నర్ 1964లో వెలిబుచ్చిన పరమానందమిది!

ఇది వింటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. 1947లో స్వతంత్ర్యం అనబడేది వచ్చేంతవరకూ దేశాన్ని ఏలింది తెల్లవాళ్లు. వారు స్వతహాగా క్రైస్తవులు. క్రైస్తవ మత ప్రచారానికి వీలైన మేరకు తోడ్పడ్డ క్రైస్తవ పక్షపాతులు. ఇండియాలో చర్చ్‌కి స్వర్ణయుగం అనేది ఏదైనా ఉంటే అది బ్రిటిష్ పరిపాలన నిరాఘాటంగా సాగిన సుమారు రెండు శతాబ్దాల కాలమే అని సాధారణంగా మనం అనుకుంటాం కదా? మరి ఈ జెస్యూట్ మిషనరీ ఇలా అంటున్నాడేమిటి? వెనకటికంటే – అనగా తెల్లవాళ్లు ఏలిన సుదీర్ఘకాలంలో కంటే – స్వాతంత్ర్యం వచ్చిన తరవాతే అడ్డూ, బెంగా లేకుండా చర్చ్ బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిందని తెగ సంతోషపడుతున్నాడేమిటి? మునుపెన్నడూ లేనంతటి స్వేచ్ఛకు భారత రాజ్యాంగం తమకు గ్యారంటి ఇచ్చిందన్న అమందానందం అతడికి కలగజేసిన రాజ్యాంగ రక్షణ ఇంతకూ ఏమిటి?

విదేశీ మతాలకు అపరిమిత స్వేచ్ఛను, అపూర్వ అవకాశాలను భారత రాజ్యాంగంలో ఒకటీ రెండూ కాదు ఏకంగా ఆరు అధికరణాలు ప్రసాదించాయి. రాజ్యాంగం 3వ విభాగంలో ప్రాథమిక హక్కుల పరిచ్ఛేదంలో 25వ అధికరణం నుంచి 30వ అధికరణం వరకూ మత స్వాతంత్ర్యానికీ, మైనారిటీల హక్కులకూ సంబంధించినవి. రాజ్యం దృష్టిలో పౌరులందరూ సమానమని, చట్టాల రక్షణ

అందరికీ సమానంగా వర్తిస్తుందనీ 14వ రాజ్యాంగ అధికరణం ఇచ్చిన వరం మతాల విషయంలో మసకబారింది. మనలను ఏలేవారి దృష్టిలో మతాలన్నీ సమానమే కాని విదేశీయ మైనారిటీ మతాలు ఎక్కువ సమానులు! అది కేవలం వారి దృష్టి దోషమే కాదు. మెజారిటీ (హిందూ) మతస్థులను రెండో తరగతి వారిలా, మైనారిటీలనేమో ప్రత్యేక హక్కులు గల ప్రత్యేక తరగతి వారిలా తగని వివక్ష చూపేందుకు భారత రాజ్యాంగమే కావలసినంత వెసులుబాటు కల్పించింది.

ఈ సంగతి తేటపడాలంటే మతస్వేచ్ఛ గురించిన రాజ్యాంగ అధికరణాలను ఒకటి తరువాత ఒకటి కాస్త నిశితంగా చూడాలి.

## సెక్యులరిజం అంటే ఏమిటి? (లౌకిక)

భారతదేశం రాష్ట్ర మతం లేని లౌకిక దేశం. 'సెక్యులరిజం' అనే పదానికి మతం నుండి వేరు అని అర్థం. ఈ భావన మతం పూర్తిగా వ్యక్తిగత విషయం కాబట్టి జీవితంలోని సామాజిక, ఆర్థిక మరియు సాంస్కృతిక అంశాలతో పాటు ప్రభుత్వం నుండి మతాన్ని వేరు చేయడంపై దృష్టి పెతుతుంది. 42వ రాజ్యాంగ సవరణను మీని భారత రాజ్యాంగం అంటారు. ఈ పదం "రాజ్యాంగం యొక్క ప్రాథమిక నిర్మాణం"లో కూడా ఒక భాగం.

మన రాజ్యాంగంలో పౌరులకు మత స్వేచ్ఛ ఉంది. కానీ రాజ్యానికి (ప్రభుత్వానికి) మతం లేదు ఉండదు కూడా. ఎందుకంటే అని లౌకిక రాజ్యాం. మతం పేరుతో రాజకీయాలు చేయడం రాజ్యాంగ విరుద్ధం. అయితే ప్రస్తుతం మతమే రాజకీయం అయింది. ప్రతి విషయాన్ని మత కోణంలో చూడడం పెరిగిపోయింది.

## భారతదేశంలో సెక్యూలరిజం

భారతదేశంలో సెక్యులరిజం గురించి తెలుసుకునే ముందు, సెక్యూలరిజం గురించి తెలుసుకోవడం ముఖ్యం.

సెక్యులరిజం అనేది ఒక 'స్వేచ్ఛాయుత ఆలోచన', దీని ప్రకారం, కొన్ని కార్యాచరణాలు లేదా సంస్థలు, మతము లేదా మతముల విశ్వాసాల నుండి వేరుగా యుంచుట. అనగా ప్రజల లేదా వ్యక్తిగత మతపరమైన మార్గాలనుండి లేదా మతపరమైన భావనలకు ప్రత్యామ్నాయంగా సేక్యులర్ భావాలను పెంపొందించుట.

ఒక విధంగా చెప్పాలంటే, సెక్యులరిజం ప్రకారం, మతపరమైన చట్టాలు, ప్రబోధనలనుండి స్వేచ్ఛపొందడం. ఇది రాజ్యాలకు మాత్రమే పరిమితం. అనగా ప్రజలు వ్యక్తిగతంగా మతపరమైన విషయాలు పాటించిననూ, రాజ్యమునకు మతపరమైన విషయాలనుండి దూరంగా వుండేటట్లు చేయగలిగే స్థితి. ఒక రాజ్యంలో వుండే అనేక మతస్థులు, దేశ, రాజ్య, పరిపాలనా విషయాల పట్ల అందరికీ ఆమోదియోగ్యమైన సూత్రాలను తయారు చేసి శాంతి సౌఖ్యాలను స్థాపించుట. రాజ్యము విషయంలోనూ, రాజ్య పరిపాలనా విషయంలోనూ మతానికి అతీతంగా, సామాజిక సత్యాల పట్ల అవగాహన పొంది, రాజ్య, ప్రజా హితము కొరకు పాటుపడుట.

వెరసి, ఒక మతరహిత ప్రభుత్వం గల దేశంలో అనేక మతముల వారు, మతపరమైన స్వేచ్ఛతో జీవనం సాగించే సిద్ధాంతం. భారత్ ఇదేకోవకు చెందుతుంది. ఈ విధానాన్నే భారతదేశంలో సెక్యులరిజం అని నిర్వచించవచ్చు.

## భారతదేశంలో ప్రతి పౌరునికి గల ప్రాథమిక విధులు (51)

1) భారత రాజ్యాంగాన్ని గౌరవించవలెను. రాజ్యాంగపు ఆదర్శాలను, సభలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించవలెను.

2) భారత స్వతంత్ర సంగ్రామంలో, ప్రోత్సహింపబడ్డ ఆదర్శాలను గౌరవించాలి.

3) భారతదేశపు సార్వభౌమత్వాన్ని, అఖండత్వాన్ని, ఏకత్వాన్ని గౌరవించి, పెంపొందింపవలెను.

4) అవసరం లేదా అవకాశం గలిగితే భారతదేశానికి సేవచేయుటకు ఎల్లవేళలా సిద్ధంగా వుండవలెను.

5) భారతదేశంలో, కుల, మత, వర్గ, లింగ, వర్ణ విభేదాలు లేకుండా ప్రజలందరినీ గౌరవించవలెను. సోదరభావాన్ని, సౌభ్రాతృత్వాన్నీ పెంపొందించవలెను. స్త్రీల యొక్క గౌరవమర్యాదలను భంగపరిచే అమర్యాదకరమైన ఆచారాలను పద్ధతులను విడనాడాలి.

6) మన భారతదేశంలో గల మిశ్రమ సంస్కృతినీ, మిశ్రమ, అద్భుత వారసత్వాన్ని కాపాడుకొన వలెను.

7) ప్రకృతీ పరిసరాలైన అడవులను, సరస్సులను, నదులను, వన్యప్రాణులను, ఇతర జీవులను సంరక్షించుకొనవలెను.

8) శాస్త్రీయ దృక్పథాన్ని, వైజ్ఞానిక విషయాలను పెంపొందించి జ్ఞానాభివృద్ధి కొరకు ఎల్లవేళలా పాటుపడవలెను.

9) ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను కాపాడవలెను. హింసను విడనాడవలెను.

10) భారతదేశం అభివృద్ధి చెందునట్లు, వ్యక్తిగతంగాను, సామాజికంగాను లేదా మిశ్రమంగానూ పాటుపడుతూ, దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ, దానిని సాధించుటకు కృషిచేయవలెను.

## ముగింపు

భారత రాజ్యాంగం ద్వార పౌరుల స్వేచ్ఛగా సౌభ్రాతృత్వాలతో విలసిల్లడానికి అనేక విధాల పరిశీలనల అనంతరం సువిశాల భారత దేశంలో ఉన్నత స్థితి నుండి అట్టడుగు స్థాయి వరకు పౌరులు జీవించుటకు అనుగుణాంగా భారత రాజ్యాంగ నిర్మణం జరిగింది. మరి ఈ రాజ్యాంగం పౌరులందరికీ మత స్వేచ్ఛను మత స్వేచ్ఛ హక్కు రూపంలో ప్రసాదించింది. మరి మన భారత దేశ విలువల అనుగుణంగా ప్రతి భారతీయుడు సాటి మతల పాట్ల సహనం కలిగి ఒకరి మతలను ఒకరు దూషించుకొకుండా అవమానపర్చకుండా, కించపర్చకుండా, ఎక్కువచేసి తుక్కువ మాట్లాడకుండా మన విశ్వాసాలను అవళంబించుకొవచ్చు. హక్కులు కావలనే ప్రతి భారతీయుడు రాజ్యాంగం ప్రసాదించే హక్కులను అనుభవించాలనుకుంటే తప్పకుండా ప్రాథమిక విధులను పాటించాలి. ప్రాథమిక విధులను పాటించగలిగినవారే హక్కులను పరిపూర్ణంగా పొందవచ్చు. మత స్వేచ్ఛ విషయంలో రాజ్యాంగం ప్రసాదించిన సూచనలకు అనుగుణంగా మత స్వేచ్ఛను అనుభవిస్తూ ఉత్తమ భారతీయులుగా వెలుగొందవచ్చు.

❋ ❋ ❋ ❋

# 3. మతమార్పిడిని నిరోధక చట్టం నేపథ్యంలో యేసుగాథను కథనవిధానంగా బోధించటం

**- ఫాదర్ డాక్టర్ దర్శి డాన్ బోస్కో**



అనేక దేశాల్లో బైబిల్ బోధనలు, క్రైస్తవ్యంపై ఆంక్షలు, నిర్బంధాలు కొనసాగుతున్నాయి. మరీ ముఖ్యంగా భారత దేశంలో క్రైస్తవులపై దుర్మార్గాలు పెచ్చరిల్లి పరిస్థితులు దుర్భరంగా తయారైయ్యాయి. 2019 ఎన్నికల ముందే ఆర్.ఎస్.ఎస్; వీ.హెచ్.పీ; భజరంగ్ దళ్ వంటి మతోన్మాద సంస్థల దౌర్జన్యాలు భరించలేక కొత్తవారికి బాప్తిస్మము ఇవ్వబోమని, క్రైస్తవ కుటుంబాల పిల్లలకు మాత్రమే బాప్తిస్మము ఇస్తామని ఆయా సంస్థలతో ఢిల్లీ బిషప్ ఒప్పందం చేసుకోవాల్సి వచ్చింది. మరోపక్క బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మతమార్పిడి నిరోధ బిల్లును అమలులోకి తెచ్చారు. మణిపూర్‌లో గిరిజనులు క్రైస్తవ్యాన్ని స్వీకరించడంతో వారిపై మతత్వవాదులు ఎంతటి అఘాయిత్యాలకు, అమానవీయ చర్యలకు పాల్పడ్డారో ప్రపంచం అంతా చూసింది. ఈ పరిస్థితుల్లో కేథలిక్ చర్చి సినడ్ (క్రైస్తవ ధర్మసభ) మరింత శక్తివంతంగా వాక్యాన్ని అందించాలన్న నిర్ణయానికి వచ్చింది.

భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన మత స్వేచ్ఛను మతోన్మాదులు అడ్డుకోవడాన్ని, అందులో భాగమైన చట్టపరమైన, సామాజిక సవాళ్లను ఎలా ఎదుర్కోవలనే విషయాలపై CCBI 34వ ప్లీనరీ అసెంబ్లీ చర్చించింది. మత స్వేచ్ఛ ప్రాముఖ్యతను, విభిన్న విశ్వాసాలపై పరస్పర గౌరవాన్ని, వివిధ మత వర్గాల మధ్య శాంతి, సుహృద్భావం పెంపొందించడంలో క్రీస్తు సైనికులుగా తెలుగు రాష్ట్రాల కేథలిక్ చర్చి ముందుంటోంది.

మత మార్పిడి నిరోధక చట్టాల అమలయ్యే రాష్ట్రాల్లో, యేసు క్రీస్తు ప్రేమామయ బోధనలను Kiss అనగా keep it short and sharp పద్ధతిలో ప్రజల మనస్సుల్లోకి చొచ్చుకు వెళ్లేలా ప్రభోదించాలని సినడ్ సూచించింది. కాథలిక్ చర్చి సిద్ధాంతం, ఆరాధన, క్రమశిక్షణ విషయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడంలో సినడల్ గణనీయమైన పురోగతిని సాధించింది. పరస్పర సహకారం, సమగ్ర ప్రక్రియలను కూడా సినాడ్ చేపడుతోంది. ఇందుకోసం 7 దశల ప్రక్రియ ఉపయుక్తంగా ఉంటుంది. ఇది పవిత్రాత్మ ఏడు బహుమతులు అనగా, జ్ఞానం, అవగాహన, సలహా, ధైర్యం, జ్ఞానం, దైవభక్తి, దేవుని భయం ఉండగా, మరో ఏడు ధర్మాలైన పవిత్రత, నిగ్రహం దాతృత్వం, శ్రద్ధ, దయ, సహనం, వినయాలతో నిండి ఉన్నాయి. ఇది గ్రెగొరీ పాపుగారి ద్వారా ప్రాచుర్యం పొందిన థామస్ అక్వినాస్ క్రమాన్ని ఏకీకృతం చేస్తుంది. విశ్వాసంతో కూడిన సువార్త ప్రకటన ప్రజలను ఆనందంగా ఉంచుతుంది.

## 1. ది ఇన్క్లూసివ్ గేదరింగ

ది ఇన్క్లూసివ్ గేదరింగ అనగా కుల మత, ప్రాంతాలకు అతీతంగా అందరినీ కలుపుకుపోవడం, దీనిని క్రైస్తవ ప్రాథమిక ధర్మంగా బోధిస్తారు. మత మార్పిడి నిరోధక చట్టాలకు ఊతం ఇస్తున్న భారత దేశంలో, ఉద్రిక్తత, విభేదాలు, అసహనం, కలిగిన సమాజంలో జీవిస్తున్నాము. దీనిపై సినడల్ తీవ్రంగా చర్చించి, ఈ పరిస్థితులను అధికమించేందుకు మార్గనిర్దేశం చేస్తూ, కరుణామయుని ప్రేమ గురించి భోధించాలని నిర్ణయించింది.

యేసునాథుడు ఎలాంటి బేధ భావం లేకుండా స్త్రీ, పురుషులను, అక్రమార్జితులు (అధిక పన్ను వసూలు చేసేవారిని), మత్స్యకారులు, సమాజంలో అత్యధికులిగా గుర్తింపు పొందిన యూదులను, తక్కువ వర్గానికి చెందిన సమరయులను బహిరంగంగా స్వీకరించి, ప్రేమించారు. మత నమ్మకాలను విధించి అమలు జరపడం కాకుండా అందరినీ ఆహ్వానించే బోధనల ద్వారా తన పరిచర్యను ప్రారంభించారు. యేసు నాధుని ప్రేమ, అంగీకారం, కరుణ, ద్వారా మన బోధకులు మనుష్యులలో మానసిక పరివర్తనా శక్తిని వెలికి తీస్తున్నారు. అంతేకాకుండా ఆధ్యాత్మిక పరివర్తన సందేశాన్ని అందిస్తూ అన్ని

వర్గాల ప్రజలకు చేరువయ్యారు. మతమార్పిడి వ్యతిరేక చట్టాల సందర్భంలో, ఇతరుల నమ్మకాలను గౌరవిస్తూ సమగ్ర చర్చను క్యాథలిక్ సినడల్ ప్రారంభించింది. ప్రజలు అనవసరమైన భయాందోళనలకు గురికాకుండా, పొరుగువారిని, శత్రువులను కూడా ప్రేమించే యేసు బోధనలలోని పవిత్రతను, పరస్పర ప్రేమను అందరికీ అర్థమయ్యేలా తెలియ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించింది.

## 2. అవగాహన కోసం ఉపమానాలు

ప్రజల్లోని సంశయవాదం – అనుమానాలను ఎదుర్కొనేందుకు యేసు ఉపమానాలతో ప్రసంగించారు. అవి లోతైన సత్యాలను తెలియజేసే సాధారణ కథలు. యేసు మంచి సమరయుని ఉపమానం ద్వారా వివిధ వర్గాల ప్రజల మధ్య అనుమాన అడ్డంకులను విచ్ఛిన్నం చేసి వారి మధ్య అవగాహనను పెంచిన విధానాన్ని సినాడ్ చర్చించింది. ఈ ఉపమానాలు అందరికి అర్థమైతే పరస్పర గౌరవ మర్యాదలకు పునాదిగా మారతాయి. యేసు తరచూ వివిధ నేపథ్యాలు కలిగిన ప్రజలతో మాట్లాడేవారు. ఈ ప్రక్రియనే సినాడ్ ఆమోదించింది, ఆచరిస్తే సర్వమతాల మధ్య సుహృద్భావాన్ని పెంచి మతమార్పిడి నిరోధక చట్టాల నుంచి ఊరట పొందవచ్చు. విభిన్న వర్గాల మధ్య శాంతియుత సహజీవనం, ఐక్యతను ప్రోత్సహించడాన్ని సినడల్ ప్రతిపాదించింది. చర్చలతో మత మార్పిడి నిరోధక చట్టాలకు సంబంధించిన ఆంక్షలను తొలగించవచ్చు. ఉపమానాల ద్వారా ప్రజల్లో సానుకూల చైతన్యం కలిగించవచ్చు. సందర్భోచిత వివరణతో బోధించడం ద్వారా సమకాలీన నిబంధనలు, చట్టపరమైన ఆంక్షలను అధిగమించవచ్చు. పరిశుద్ధాత్మ గ్రహింపు వరముతో ప్రజలందరికీ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విలువలు కలిగిన క్రైస్తవ జీవితాన్ని గడపగలం.

## 3. ప్రభుత్వ అధికారులతో చర్చలు

యేసు బోధనలు బలంగా వ్యాప్తి చెందుతున్నప్పుడు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, మతోన్మాదుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటాం. వారు మత మార్పిడి నిరోధక చట్టాల ద్వారా క్రైస్తవ సంఘాలకు, సినాడ్‌కు సవాలు విసురుతారు. కరుణ, న్యాయం, భాగస్వామ్య విలువలను నొక్కి చెబుతూ

క్రైస్తవ సంఘాలు, సినడల్ సమయ స్ఫూర్తితో వ్యవహరించి అధికారులతో చర్చలు జరపాలి. ఇది మత స్వేచ్ఛ – చట్టాల రూపకల్పనల మధ్య ఏర్పడే ఉద్రిక్తతలను తగ్గించడానికి సహాయపడుతుంది. మన ఆందోళనలోని సహేతుకతను వివరించడం వల్ల న్యాయమైన చట్టాల రూపకల్పనకు దోహదం చేస్తుంది. క్రైస్తవ్యంలోని శాంతియుత స్వభావం అధికారులకు తెలియచేయడం ద్వారా సమస్యల పరిష్కార దిశగా సినాడ్ ముందుకెళుతోంది.

దేశంలోని అనేక రాష్ట్రాలు మత మార్పిడులను నియంత్రించేలా లేదా పరిమితం చేసేలా చట్టాలను రూపొందించాయి. దీంతో మత మార్పిడికి ముందు ఆయా వ్యక్తులు అధికారిక అనుమతిని పొందవలసి ఉంటుంది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో కూడా ఈ పరిస్థితులు లేదా ప్రారంభ క్రైస్తవ సమాజాల్లోని సమస్యలు ఉత్పన్నమయితే, వాటిని నివారించేందుకు అధికారులు, చట్టసభల రూపకర్తలు, ఇతర మతస్తులతో కలసి బహిరంగ, నిర్మాణాత్మక చర్చల్లో యేసు అనుచరులు పాల్గొనాలి. క్రైస్తవ మూల ధర్మం ప్రకారం స్వచ్ఛంద సంస్థ (కారిటాస్) శ్రమలు, హింసల మధ్య కూడా క్రీస్తు యేసునిపై విశ్వాసం బలంగా ఉండాలి. ఈ తరహా విశ్వాసాన్ని మనం మణిపూర్ క్రైస్తవుల్లో చూశాం.

## 4. సిలువ – పునరుత్థానం

బైబిల్లో చెప్పబడిన యేసు పరిచర్య, బోధనలు – అద్భుతాలతోపాటు సిలువ మరణం – పునరుత్థానం చుట్టూ కేంద్రీకృతమై ఉంది. మత మార్పిడి వ్యతిరేక చట్టాలు రూపొందించే వ్యక్తులకు యేసు బోధించిన నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించు్మ వ్యాక్యాన్ని వివరించవచ్చు. యేసుని ప్రేమ సందేశం కఠిన పరిణామాలను ఎదుర్కొన్నప్పుడు విషాదకరమైన మలుపు తీసుకుంటుంది. అయినప్పటికీ, ఆయన శిలువ – పునరుత్థానంలో, శక్తివంతమైన పూర్ణ పరివర్తనను కనుగొంటాము. ప్రారంభ క్రైస్తవులు తమ విశ్వాసాల కోసం హింసను ఎదుర్కొన్నట్లే, మణిపూర్ వంటి కొన్ని ప్రాంతాల్లోని క్రైస్తవులు అనేక నెలలుగా హింసను సహిస్తున్నారు. అయితే ఇది ఖచ్చితంగా మత మార్పిడి వ్యతిరేక చట్టాలకు సంబంధించిన ప్రతిబంధకాలకు మార్గం సుగమం చేస్తుందన్న

నిరీక్షణతో  క్రైస్తవులు ఉన్నారు. ప్రభుత్వ, రాజకీయ ప్రతికూల అంశాలను ఎదుర్కొనటానికి క్రైస్తవ ఐక్యత బలంగా ఉండాలి. యేసు పునరుత్థానం మరణంపై శాశ్వత విజయం. ఇది పరలోక జీవితాన్ని సూచిస్తోంది.  ఆయనపై మనకున్న నిరీక్షణ మనలను శాంతి తీరాలకు నడిపిస్తుంది. భారత దేశంలోని క్రైస్తవులు త్వరలోనే అంధకార శక్తుల నుంచి విముక్తి పొందుతారని విశ్వసిద్ధాం.

## 5. ది గ్రేట్ కమిషన్ ఇన్ ఎ సినడల్ లైట్ (క్రైస్తవ ధర్మసభ వెలుగు)

యేసు తన అనుచరులను అన్ని దేశాలు తిరిగి శిష్యులను తయారు చేయమని ఆదేశించారు. ఈ పిలుపును విశ్వాసాల విధింపుగా కాకుండా ప్రేమ, కరుణ, అవగాహన, చేరిక, పరివర్తనతో కూడిన ఆహ్వానంగా క్రైస్తవ ధర్మసభ తీసుకుంది. యేసునాథుని సందేశం భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, మతపరమైన సరిహద్దులను అధిగమించింది. క్రైస్తవ నిరోధక చట్టాల సంక్లిష్టతలలో యేసు నాథుని వారసత్వాన్ని కొనసాగించేందుకు గౌరవప్రదమైన చర్చల్లో పాల్గొనడం, ఇతరులకు ఆయనపై అవగాహనను పెంపొందించడం, ప్రేమ కలుపుగోలుతనాలను సినడ్ మనకు బోధిస్తుంది. ఈ ప్రయాణంలో, సమకాలీన సవాళ్లను దయ, జ్ఞానంతో సరిదిద్దాడానికి యేసు ద్వారా ప్రేరణను పొందుదాం. సమాజానికి  ప్రయోజనం చేకూర్చే సామాజిక అభివద్ధి (కమ్యూనిటీ డెవలప్మెంట్) కార్యక్రమాలను నిర్వహించడం  క్రైస్తవులపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. దేశంలోని మతమార్పిడి వ్యతిరేక చట్టాలపై ప్రతిస్పందన, అవగాహనను పెంపొందించే వ్యూహాలను చర్చి (ప్రార్థనా మందిరం) కలిగి ఉండాలి.  క్రీస్తు బోధనలపై అపోహలను పరిష్కరించాలి. విస్తృత సమాజంలోని చర్చల్లో చురుకుగా పాల్గొంటూ మతపరమైన మైనారిటీల హక్కులు, స్వేచ్ఛ, రక్షణ కోసం కూడా చర్చి పనిచేయాలి. అందుకు అనుగుణమైన ఏ చిన్న దయాకార్యమైనా (హ్యూమనిటాస్) మన చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరికి ఓదార్పునిస్తుంది.

## 6. కొత్త అవకాశంగా గుణదల మాత శతాబ్ది ఉత్సవాలు

ప్రేమ ప్రాముఖ్యతను తల్లిమరియు తన జీవన విధానం ద్వారా తెలియచెప్పారు. ప్రతికూల పరిస్థితులలో ఆమె సినాడాలిటీకి రోల్ మోడల్గా

ఉన్నారు. తెలుగు ప్రాంతాల్లోని మరియతల్లి పుణ్యక్షేత్రాలు ముఖ్యంగా గుణదల పుణ్యక్షేత్రం వివిధ వర్గాల ప్రజలను, కుల–మత భేధాబావం లేకుండా ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తుంది. మరీ ముఖ్యంగా చెదిరిన మనస్సుగలవారికి, దుర్బలురకు మరియతల్లి అత్యంత సమీపంగా ఉండి నిరీక్షణతో కూడిన విశ్వాసం ద్వార వారికి శాంతిని అనుగ్రహిస్తారు. వాస్తవానికి, ఆమె ఆధ్యాత్మికతలో ప్రేమపూర్వక సంభాషణ ఉంది. ఈ విశ్వాసమే కేథలిక్ ప్రయాణానికి మూలస్తంభం. పరస్పర అవగాహనను పెంపొందించడం ద్వార అనుమానాల గోడలను విచ్ఛిన్నం చేయడం అన్నమాట. అన్ని మతాల ప్రజలకు మేలు చేసే సర్వమత సమ్మేళనాలు, పరస్పర సహకారం, విద్య, ఆరోగ్య సంరక్షణా కార్యక్రమాలు, పర్యావరణ ప్రాజెక్టులను ప్రారంభించాలి. విభిన్న నేపథ్యాలకు చెందిన వ్యక్తులతో జరిపే మతాంతర సంభాషణలు విభిన్న విశ్వాసాలపై గౌరవ వాతావరణాన్ని పెంపొందిస్తాయి. ఈ ఐక్యత పరస్పర శ్రద్ధను పెంచడంతోపాటు, అంతర్గత బంధాలను బలపరుస్తుంది. మత మార్పిడి వ్యతిరేక చట్టాలకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించడానికి చట్టసభ ప్రతినిధులతో నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనవచ్చు. పవిత్రాత్మ బహుమతి మూలధన ధర్మం వినయం (హుమిలిటాస్) అనేది తలితకుమి ఉన్నతి ద్వారా ప్రోత్సహించబడిన ధర్మం.

## 7. తెలుగు రాష్ట్రాల్లో సినడల్ ఆశాజ్యోతిగా తలితాకుమి ఉన్నతి

తలితాకుమి ఉన్నతి యువతకు ఉన్నత విద్య అందించి సాధికారత కల్పిస్తోంది. ఈ సంస్థ విజయవాడ కేంద్రంగా పనిచేస్తోంది. యువత హక్కులు, చట్ట సమస్యలను పరిష్కరించే మార్గాల గురించి అవగాహన పెంచడం ద్వారా క్రైస్తవ సంఘాలను బలోపేతం చేస్తోంది. ఇందులో మత స్వేచ్ఛను బోధించడం, సువార్త ప్రచారంలో బాధ్యతాయుత భావాన్ని పెంపొందించడం, సామాజిక న్యాయం,సేవ ద్వారా సానుకూల క్రైస్తవత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఉన్నత విద్య, పరిపాలన, న్యాయవ్యవస్థలలో క్రైస్తవ విలువలకున్న సానుకూల ప్రభావాన్ని గుర్తించింది. పరస్పర మద్దతు కోసం ప్రసిద్ధి చెందిన ప్రారంభ క్రైస్తవ సంఘాల మాదిరిగానే, తలితకుమి ఉన్నతి యువతకు శక్తి నిచ్చి బలపరుస్తోంది. కేవలం తమలోతాముగా మాత్రమే కాకుండా, విభిన్న మతాల మధ్య ఐక్యత అవగాహనను పెంపొందించే కార్య క్రమాలు చేపడుతోంది.

మణిపూర్‌తో పాటు భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న వేధింపుల సందర్భంలో మతపరమైన మైనారిటీల రక్షణ కోసం పాటుపడుతూ, వివక్షతకు గురైన అత్యంత దుర్బలులను, అట్టడుగు స్థాయి వారిని రక్షించడానికి సమిష్టి క్రుషి అవసరం. స్వాతంత్ర్యం, ప్రత్యేకించి ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాన్ని యేసు సమర్థించారు. అదే క్రమంలో దేశ ప్రజలందరికి రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కు ప్రాముఖ్యతను క్రైస్తవ సంఘాలు, సినడ్ ప్రజలకు వివరించడంతోపాటు మరిన్ని శాంతియుత మార్గాలను అన్వేషిస్తోంది. మత మార్పిడి వ్యతిరేక చట్టాలకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించడానికి చట్టసభ సభ్యులతో నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొంటుంది. (తలితకుమి ఉన్నతి ద్వారా పవిత్రాత్మ, వినయం ప్రధానంగా ప్రోత్సహించబడిన కతోలిక ధర్మాలు.)

## ముగింపు

## సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవడం

దేశంలోని ఇతర ప్రాంతాల్లోని మతమార్పిడి నిరోధక చట్టాలు తెలుగు ప్రాంతాలలోని క్రైస్తవ సమాజానికి సవాళ్లను విసురుతున్నాయి. ఈ లోకంలో జేసునాథుడు అనుసరించిన ప్రేమ, గౌరవాల ప్రధాన విలువలను నొక్కి చెబుతూ, క్రైస్తవులు మత స్వేచ్ఛను ప్రోత్సహించే చర్చలను, సామరస్య పరిష్కారాలను ధర్మసభ స్వాగతిస్తోంది. విభిన్న మతాల మధ్య అవగాహనా సదస్సులు నిర్వహించడం ద్వారా క్రైస్తవులు పరిష్కారాలను అందిపుచ్చుకోవాలి. క్రైస్తవ ధర్మసభ అటువంటి చర్చలకు వేదికగా మారుతోంది. చట్టాల ద్వారా ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి ఇతర విశ్వాసాల వ్యక్తులతో బహిరంగ చర్చలో పాల్గొని వారిలో మానసిక పరివర్తనను తేవాలి. ఇందుకు ప్రేమ, ఓర్పు, శాంతి చాలా అవసరం. పవిత్ర గ్రంథంలోని సువార్తలలో ఇదే చెప్పబడింది. రాజ్యాంగ, చట్టసభల ప్రతినిధులతో చర్చించి క్రైస్తవులపై దురభిప్రాయాలను, సందేహాలను పటాపంచలు చేయడం వల్లనే భిన్నత్వంలో ఏకత్వం సిద్ధిస్తుంది. దీంతో ఉన్నత సమాజం ఏర్పడుతుంది.

బహిరంగ చర్చలలో పాల్గొనడం వల్ల అవగాహన పెరిగి, సమాజం శక్తివంతం అవుతుంది. తద్వారా అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుంది. యేసును అనుసరించడం అనేది వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయం. బలవంతంగా కాకుండా ఇష్ట పూర్వకంగా మాత్రమే ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని ఎంచుకోవడం రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కు. చట్టసమ్మతమైన మత స్వేచ్ఛను అడ్డుకుని, మతమార్పిడి నిరోధక చట్టాలను రూపొందించడంపై నిబద్ధత గల యేసు అనుచరులు తమ ప్రేమ, సహనం, సహజీవనం తో ఒక ధర్మ ప్రయాణాన్ని తప్పనిసరిగా ప్రారంభించాలి. మన చుట్టూ ఉన్న అపోహలను పార ద్రోలడం ద్వారా, ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకు రావచ్చు. అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, సినడ్ చేపట్టిన కార్యక్రమాలు ఫలించడం ప్రారంభించాయి. నిజానికి సినాడ్ ఒక ఆశాదీపం, మతపరమైన భౌగోళిక, సాంస్కృతిక, రాజకీయ సరిహద్దులను అధిగమించేందుకు నిరంతరం ప్రయత్నిస్తోంది. వివిధ తెగలు, సమూహాలు, జాతుల మధ్య పరస్పర గౌరవం, వివిధ విశ్వాసాల మధ్య వంతెనలను నిర్మించే మార్గాలను సినాడ్ సుగమం చేస్తోంది.

1. దేశ పౌరులంతా శాంతి సౌభాగ్యాలతో నివశించడానికి మీరు ఇచ్చే సూచన ఏమిటి ?
2. యేసు ప్రేమికుడిగా మీరు మత మార్పిడి హక్కుని కాపాడుకోవడానికి ఏమి చేస్తున్నారు ?

❋ ❋ ❋ ❋

# 4. నేటి తెలంగాణా, ఆంధ్ర నేపధ్యంలో క్రీస్తు సువార్త ప్రబోధం, పరివర్తన, మతమార్పిడి

- రెవ. సిస్టర్ నాగోతు సుందరి, MSI

## ఉపోద్ఘాతము



పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు పిలుపు మేరకు అక్టోబర్ 17, 2021న యావత్ శ్రీసభ ఒక కొంగ్రొత్త ప్రయాణానికి నాంది పలికింది. ఈ ప్రత్యేక ప్రయాణము ఆశయం, గమ్యం, దైవరాజ్య నిర్మాణానికి దైవాంకితులు, దైవ ప్రజల సమ్మిళిత సమిష్టి ప్రయాణం. విశ్వ శ్రీసభ నాయకునిగా, నావికునిగా 2013లో తాను బాధ్యత చేపట్టినప్పటినుండి పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు సినడాలిటి, కలసి ప్రయాణము చేయుటను వివిధ దశలలో ఆలోచిస్తూ, ధ్యానిస్తూ, సృజనాత్మకమైన, విప్లవాత్మకమైన కీలక ప్రతిపాదనలు చేస్తూ వచ్చారు. వీనిలో 5 ముఖ్యమైన మైలురాళ్ళు: సువార్తానందం (Evangelii Gaudium 2013), దేవా మీకే స్తోత్రం! (Laudato Si 2015) కుటుంబములో ప్రేమానందము (Amoris Laetitia 2015), క్రీస్తు సజీవుడు (Christus Vivit 2019), అందరు సోదరులే (Fratelli Tutti 2020). సువార్తా ప్రబోధము, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ జీవితము, యువత, మానవులందరూ సోదరులే అను అంశాలపై కొత్త కోణాలు, ఒరవడులు ప్రపంచశీ మరియు శ్రీసభ నూత్నీకరణకై అనేక విలువైన సూచనలు ఈ అధికార పత్రాల్లో పొందుపరచబడి సినడ్ ప్రయాణానికి పునాదులుగా వున్నాయి. ప్రపంచ కతోలిక పీఠధిపతుల సమాఖ్య సమావేశంలో అందరు భాగస్తులు కావాలనే ఫ్రాన్సిస్ పాపుగారి ఆశయసాధనను గుర్తించి స్పందించిన అఖిల భారత కతోలిక పీఠధిపతుల సమాఖ్య కలసి పయనించుదాం అనే

నినాదముతో శ్రీసభ తన జీవన వాహినిలో, ప్రేషిత కార్యములో ఏ విధముగా అంతర్భాగం అయి ఉన్నది అనే విషయము పై తమ 34వ సర్వసభ్య సమావేశంలో (2023 జనవరి 24–30)ని సినడల్ పద్ధతిలో యేసుక్రీస్తు గాధను పంచుకొనుట అనే అంశాన్ని లక్ష్యంగా ఎంచుకొని పైన పేర్కొనిన అధికార పత్రాల ఆధారముగా చర్చలు, ప్రార్ధన సమావేశాలు, నిర్వహించి, ఒక సమగ్రమైన నివేదికను ప్రతిపాదించుట భారత శ్రీసభలో ఒక విశేషమైన మైలు రాయి. అఖిల భారత కతోలిక పీఠధిపతుల సమాఖ్య దార్సనికతను, కృషిని దేవుడు దీవింతురుగాక!

గడిచిన రెండు సహస్రాబ్దాలలో యేసుక్రీస్తు రక్షణగాధ ప్రపంచంలో ఐదు ఖండాలలో వినిపించబడి, లోతైన ఆధ్యాత్మిక అనుభూతితో విశ్వ శ్రీసభ, స్థానిక శ్రీసభలు, దైవవాక్కు, దివ్యసంస్కారములతో నూత్నీకరించబడ్డాయని చెప్పుటలో సందేహం లేదు. అయినప్పటికీ ప్రపంచంలో అనేక చోట్ల, ప్రత్యేకించి మన భారతదేశములో శ్రీసభ స్వేచ్ఛగా తన సువార్తా ప్రభోధ ధర్మాన్ని నేరవేర్చుటలో విఫలమగుటయే గాక మతవిద్రోహ శక్తులు, వివిధ ప్రభుత్వాల, నాయకులు అధికార దుర్వినియోగ ధోరణి శ్రీసభ సువార్త ప్రభోదానికి గొడ్డలి పెట్టు అయిన సందర్భాలు ఎన్నో, ఎన్నెన్నో! పైన ఉదహరించిన ప్రాన్సిస్ పాపుగారి అధికారపత్రాలు సువార్త ప్రబోధానికి కొత్త అర్ధాలు, కోణాలను సూచిశీచుటయే గాక, కరుణ, దయ, శాంతి, న్యాయం, ధర్మం అనే దైవరాజ్య విలువలు సువార్తా ప్రబోదంలో ప్రధాన భాగమని తేటతెల్లము చేశారు. ఈ నేపధ్యంలో సినడల్ విధానము ద్వారా శ్రీసభ ధర్మమైన సువార్తా ప్రబోధం, దైవవాక్కు ప్రకటించుట ద్వారా క్రీస్తు రక్షణానుభవాన్ని క్రీస్తునెరుగని వారికి ఏ విధంగా అందించాలి, సువార్తా ప్రబోధాన్ని మత మార్పిడిగా భావించిడం వలన ఎదురయ్యే సవాళ్ళను ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయాలపై నేను పంచుకోబోయే విషయాలు ప్రేషిత సేవను మరింత పటిష్టముగా నిండైన తపనతో చేయడానికి దోహదపడతాయని ఈ నా చిరు ప్రయత్నం.

## పరిశోధన పత్రము యొక్క ప్రణాళిక

సువార్త ప్రభోధం, దైవవాక్కు ప్రకటన, పరివర్తన మరియు మతమార్పిడి అనే అంశాలతో కూడిన ఈ పత్రములో మూడు భాగాలున్నాయి. మొదటి భాగము: తెలుగు కతోలిక శ్రీసభ సువార్తాప్రభోధ నేపధ్యం, బైబిల్ మరియు శ్రీసభ బోధలు ఆధారముగా ప్రేషిత సేవ మూలాలు, అర్థాలు, వివిధ కోణాలు. రెండవ భాగము: దైవ వాక్కు ప్రకటనలో సవాళ్లు, ఆవశ్యకత, అనుభూతి. మూడవ భాగము: పరివర్తన, మతమార్పిడి, ప్రేషిత కార్యం, దైవ వాక్కు ప్రకటన ఫలితముగా ఏమి కలుగుతుంది? పరివర్తనా లేక మతమార్పిడా?

## మొదటి భాగము

### 1. ఆంధ్ర తెలంగాణా శ్రీసభల సువార్త ప్రబోధం చారిత్రాత్మక నేపధ్యం

సువార్తా ప్రబోధం, దైవవాక్కు ప్రకటన 2000 సవత్సరాల పైగా కొనసాగుతూ ప్రపంచంలోని ఐదు ఖండాలలో క్రీస్తును తమ రక్షకునిగా అంగీకరించి విశ్వసించిన వారు కోకొల్లలు. శ్రీసభ చరిత్రను పరిశీలించినట్లయితే ఆరంభ శ్రీసభలో క్రీస్తును అంగీకరించిన వారు, నాటి క్రైస్తవుల పుణ్యజీవితము, ఆద్యాత్మిక సంపత్తి, సువిశేష విలువల పరిపూర్ణ ఆచరణ, నిరాడంబరమైన, త్యాగపూరితమైన జీవితాలకు ప్రేరేపితులై, ఆకర్షించబడి క్రీస్తును తమ వ్యక్తిగత రక్షకునిగా స్వీకరించి విశ్వాసానికి సాక్షులుగా నిలిచారు. దాదాపు మధ్య యుగం వరకు ఇటువంటి పరంపర కొనసాగింది. దీనిని బట్టి మొదటి సహస్రాబ్దిలో సువార్తాప్రబోధం వ్యక్తులు, కుటుంబాల సంఘాల, జాతీయ, ప్రాంతీయ పరివర్తన అని తెలుస్తుంది. అయితే రెండవ సహస్రాబ్దిలో మధ్యయుగము నుండి సువార్తాప్రబోధ విధానంలో కొంత భిన్న ధోరణి చోటు చేసుకుంది. విదేశి మిషనరీలు, సువార్తప్రబోధంతో పాటు విదేశి సంస్కృతి, వ్యాపారం, పాలనా విధానం, సువార్తా ప్రకటన విధానాలు ఒకవైపు విశ్వాసం పంచినప్పటికి, మరో వైపు కొంత శూన్యం ఏర్పడింది. ఆయా దేశాలను వశ పరుచుకొని వలస రాజ్యాలను ఏర్పరుచుకొనుట జరిగింది. ఆధిక్య భావం, దౌర్జన్య ధోరణి వలన ఇతర మతాలతో సత్సంబందాలు కలిగి యుండలేక సువార్త ప్రబోధంలో కొన్ని అడ్డంకులు ఎదుర్కోవలసి వచ్చింది.

క్రీ.శ.1500 నుండి 1950 మధ్యకాలంలో ఎంతో మంది విదేశీ మిషనరీలు ఐరోపా ఖండము నుండి ప్రపంచంలో అన్ని ఖండాలలో సువార్త ప్రభోదానికై దశలవారిగా పెద్ద యెత్తులో ఒక వైపు సువార్తాప్రబోధం గావిస్తూ మరొక వైపు సామాజికి, ఆర్థిక పురోగతికి ఎంతో దోహద పడ్డారు. దాదాపు 300 సవత్సరాలు పైచిలుకు విశ్వాస చరిత్ర కలిగిన తెలుగు కతోలిక శ్రీసభ ఐరోపా ఖండానికి చెందిన ఫ్రాన్స్, ఇటలీ, ఇంగ్లాండ్ మున్నగు దేశాలు నుండి వచ్చిన వివిధ మఠవాస సభలకు చెందిన సువార్తాబోధకుల ఎనలేని త్యాగనిరతి, అకుంఠితదీక్ష, సువార్తాప్రచార తపన, సాధారణ జీవితముతో భిన్న సంస్కృతి, సాంప్రదాయాలు, భాష, ఆహారపుటలవాట్లకు తమను తాము అనువర్తనచేసికొని తెలుగునాట కతోలిక విశ్వాస జ్యోతిని వెలిగించి ఆధ్యాత్మిక, సామాజిక, ఆర్థిక అభివృద్ధికై అహర్నిశలు శ్రమించారు. కాని ఈ మూడవ సహస్రాబ్దిలో క్రైస్తవ మతము పట్ల గల వివక్ష వలన ప్రపంచములోని వివిధ దేశాలలో మరి ముఖ్యంగా మన భారతదేశములో ఇతర మతాలు, సంస్కృతులు, ఉద్యమాలు, కుల, మత వర్గ విభేదాల వలన చోటు చేసుకునే ఆధిక్య భావం, సంకుచితత్వము వలన క్రైస్తవ మతవ్యాప్తిని ప్రతికూలముగా చిత్రీకరించి, క్రైస్తవులను హింసాకాండకు గురిచేసి అణగద్రొక్కుట శోచనీయం.

## 2. సువార్తా ప్రబోదంలో బాహ్య సవాళ్ళు

పెరుగుచున్న మత పరమైన అవాంతరాలు, క్రైస్తవమతం దాని మార్పిడి కార్య కలాపలపై ఆరోపణ నేపద్యంలో కతోలికులు, ఇతర శాఖల క్రైస్తవులు మత చాంధసవాదుల సవాళ్ళను ఎదుర్కొనుటలో అవమానాలకు, అణిచివేతకు గురి అవుతునప్పటికి ప్రభుత్వఅధికారులు, భద్రతాయంత్రాంగం యొక్క మౌనం ప్రశ్నార్థకం. కొన్ని రాష్ట్రాల్లో మత అసహనము ఛాందసవాద భావజాలము, మతఘర్షణలకు, హింసకాండకు దారి తీస్తున్నాయి. సంకుచితత్వముతో కూడిన మూసుకునియుండే మనస్తత్వం, ఉదాసీన వైఖరి సువార్తా ప్రబోధాన్ని నిబలవంత మత మార్పిడిగా చిత్రీకరించి, నేరారోపణ గావించి, వ్యక్తిగత స్వేచ్ఛను హరించి, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన మత, వాక్ స్వాతంత్ర్య హక్కుల ఉల్లంఘనకు దారి తీసే వైఖరులు మత, మతాంతర,

సామరస్యాన్ని రూపు మాపుటయే గాక భారత క్రైస్తవులును విదేశీ పౌరులుగా పరిగణించి భారతీయ సంస్కృతిని అవలంభించుటను తప్పు పట్టుట అభద్రతా భావాన్ని కలుగ చేస్తుంది. కొన్ని పౌర చట్టాలు, విధానాలు తరచు భారతదేశ శ్రీసభలో మతసంబంధమైన మరియు అపోస్తోలిక సేవా కార్యక్రమాల నిర్వహణను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో క్రైస్తవులపై నానాటికి పెరుగుతున్న అసహనం, ద్వేషం, హింసాత్మక దాడులు సంస్కృతి, భారత క్రైస్తవులును తీవ్ర ఆందోళనకు గురిచెస్తుంది. అంతేగాక దళిత క్రైస్తవులకు/మైనారిటీలకు ప్రభుత్వమునుండి ఎదురయ్యే కొన్ని ఆటంకముల వలన విద్య, ఉపాధి అవకాశములు లేకుండా చేస్తున్నాయి.

### 3. ప్రేషిత సేవలోని అంతర్గత సవాళ్ళు

తెలుగు ప్రాంతీయ కతోలిక శ్రీసభలోని మేత్రాసన లేదా గురుమండల స్థాయిలో దైవ ప్రజల ఆధ్యాత్మిక ఎదుగుదలకు, విశ్వాస వికాసానికి దైవార్చన కార్యక్రమాలు, దివ్యసంస్కారములు, ప్రత్యేక ప్రార్ధన కూటములు, జ్ఞానవడకము, మొదలగు కార్యక్రమాలు ఏర్పాటు చేయటం ద్వారా కుటుంబాల నూత్నీకరణకు తోడ్పడుట శుభపరిణామం. కతోలిక కుటుంబాలు ఎదుర్కొనే సవాళ్లలో శ్రీసభ కుటుంబాలకు అండదండగా ఉండి, మనోధైర్యాన్ని నింపుతూ, ఆధ్యాత్మికపథంలో నడిపించాలి. బాల బాలికలకు యువతకు పెద్దలకు, వృద్ధులకు, వారి వారి అంతస్తుకు, వయస్సుకు తగిన విధంగా ప్రార్ధనా సమావేశాలు, నూత్నీకరణ సదస్సులు ఏర్పాటు చేసి అందరూ పాల్గోనేటట్లు ప్రోత్సహించాలి.

**తెలుగు కతోలిక శ్రీసభలో కొన్ని ముఖ్యమైన సవాళ్లు :** విచ్ఛిన్నం అవుతున్న వివాహ బంధాలు, విడాకులు, కులభేదాలు, వర్గ తత్వాలు, ఇతర క్రైస్తవశాఖలకు వలస, దైవప్రజలకు శ్రీసభ బోధలు, అధికారపత్రాలపై అవగాహన లేక పోవడం, దైవాంకితులు అయిన గురువులు,మఠకన్యలు, సాక్షిభూతమైన జీవితం జీవించక పోవడం. వివిధస్థాయిలలో శ్రీసభ నాయకత్వము ఒక పెను సవాలుగా మారింది. అధికారదాహం, ధనాపేక్ష, బంధుప్రీతి, విలాసవంతమయిన జీవనశైలి, కుల/వర్గ తత్వంతో నానాటికి పెరుగుతున్న విభజనలు, ద్వేషం వలన విశ్వాసుల ఆధ్యాత్మిక శ్రేయస్సు కుంటుబడుట, మొదలగునవి మన తెలుగు కతోలిక

శ్రీసభ ప్రత్యక్షముగా ఎదుర్కొనే ముఖ్యమైన సవాళ్లు. శ్రీసభలో పురోహితవర్గం/ మత అధికారులు (clericalism) గృహస్థ క్రైస్తవుల మధ్య నెలకొని ఉన్న అంతరం/ విభజన, గృహస్థ క్రైస్తవులను చిన్న చూపు చూడటం, సువార్తాప్రచారంలో గృహస్థ క్రైస్తవులు పాత్రను గుర్తించి ప్రోత్సహించక పోవడం సువార్తాసేవలో క్రైస్తవ స్త్రీల, మఠవాసినుల సేవలను గుర్తించక పోవడం, శ్రీసభ అభివృద్ధిలో యువతపాత్రకు సరియైన స్థానం లేక పోవడం, దళితులు, ఆదివాసీలు (కొండప్రాంతాల ప్రజలు), సమాజపు అంచుల్లో మురికివాడల్లో నివసిస్తున్న దీనజనావలి పట్ల అశ్రద్ధ, మొదలగు సవాళ్ళు చాల కీలకమైనవి.

పైన ప్రస్తావించిన సవాళ్ళదృష్ట్యా ఒక క్రొత్త పంథాలోసువార్తీకరణము చెయ్యాలంటే ముందుగా సువార్తా సందేశానికి పరివర్తనాశక్తి వుందని, అది సర్వస్వాన్ని తనకు అనువుగా మలుచుకుంటుందని నమ్మాలి. శ్రీసభలోని ఆచార వ్యవహారాలు, కార్య నిర్వహణ, విధానాలు, సమయాలు, సమయపాలన పద్ధతులు, వివిధ భాషలు, విభిన్నవ్యవస్థలు, మొదలైన అన్నింటిని సువార్తా ప్రభోదానికి అనువుగా మార్చుకోవడం సాధ్యమవుతుంది. శ్రీసభలోని ప్రతి వ్యవస్థ, ప్రతి సంస్థ సువార్తా ప్రబోధం కోసం, సువార్తా ప్రబోధమే లక్ష్యముగా పనిచేయాలి తప్ప కేవలం తన ఉనికిని కాపాడుకోవడం కోసం పనిచేయకూడదు. (సువార్తానందం 27).

## 4. క్రీస్తుగాధ-కథనం ఆవశ్యకత

### సువార్త ప్రబోధం-సమకాలీన శ్రీసభ కొన్ని ముఖ్యమైన సవాళ్ళు

అఖిల భారత కతోలిక పీఠధిపతుల 34వ సమావేశంలో (2023 జనవరి 24-30) చర్చించి, వెల్లడించినట్లు భారత శ్రీసభ కొన్ని కీలకమైన మారుతున్న పరిస్థితులను, పెరుగుతున్న సవాళ్ళను గుర్తించింది. కానీ ఇటువంటి సవాళ్ళు నడుమ క్రీస్తు కథనాన్ని తెలుపుట అనివార్యము అనే విషయాన్నీ సుస్పష్టం చేసింది.

- మారుతున్న సామాజిక పరిస్థితులు, సామజిక మాధ్యమాలు అయిన చరవాణి, అంతర్జాలం యొక్క మితి మీరిన వినియోగం కుటుంబాల సామరస్య జీవితం పై అపారమైన వత్తిడిని కలుగచేస్తున్నాయి.

- మాదకద్రవ్యాలు, మద్యపానం, అసభ్యచిత్రాలు మొదలగు వ్యసనాలు చాల మంది యువత జీవితాలును నాశనం చేస్తున్నాయి. కుటుంబాలలో, సమాజంలో అంతులేని ఆవేదన కలిగిస్తున్నాయి.
- పేదరికం, అమానవీయ జీవన పరిస్థితులు మన జనాభాలో గణనీయమైన భాగాన్ని, సమాన అవకాశాలు, జీవిత గౌరవాన్ని కోల్పోయిటట్లు చేసి వారి భవిష్యత్తులో అనిశ్చితిని సృష్టిస్తున్నాయి.
- పారిశ్రామిక, పెట్టుబడుదారులు అభివృద్ధి పేరుతో ప్రజల భారిస్థానభ్రంశం, భూమి మరియు చేపల వేట హక్కులను కోల్పోవుట వలన బలవంతపు వలసలు, జీవనోపాధి కోల్పోవడం వల్ల మరింత అట్టడుగున పడిపోవడం జరుగుతుంది.
- దురాశ, వినిమయ సంస్కృతితో కూడిన జీవన శైలి–విశ్వాసము, ప్రార్థన జీవితాన్ని నాశనం చేస్తున్నాయి.
- కొన్ని రాష్ట్రాలలో క్రైస్తవులపై పెరుగుతున్న అసహనం, ద్వేషం, హింసాత్మక దాడులు క్రైస్తవ భద్రతకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

యేసుక్రీస్తు జయంతి 2000 సంవత్సరంలో ఆసియా ఖండములో శ్రీసభ అనే అపోస్తోలిక లేఖలో మూడవ సహస్రాబ్దిలోఆసియ ఖండములో సువార్త ప్రభోదం గురించి ఈ విధంగా ప్రస్తావించారు. మొదటి సహస్రాబ్దిలో ఐరోపా గడ్డపై, రెండవ సహస్రాబ్దిలో అమెరికా మరియు ఆఫ్రికా గడ్డపై సిలువ నాటబడినట్లుగా, మూడవ సహస్రాబ్దిలో ఈ విశాలమైన ఆసియా ఖండములో గొప్పగా ఉన్నతమైన రీతిలో విశ్వాస పంట పండించడాలని ప్రార్థించుదాం! (Ecclesia in Asia # 1). ఆసియా ప్రజలకు ఏసుక్రీస్తు మరియు అతని సువార్త అవసరము. యేసు మాత్రమే ఇవ్వగల సజీవ జలము కొరకు ఆసియా ఖండము ఎదురు చూస్తుంది (యోహాను 4:10–15) అను మాటలతో ఈ అపోస్తోలిక లేఖ ముగుస్తుంది. పైన పేర్కొన్న సవాళ్ళు కుటుంబ వ్యవస్థను, కుటుంబ జీవితాన్ని వ్యక్తులమధ్య బంధాలను బలహీనం చేసి, బాధ్యతరాహిత్యంగా, వ్యక్తి వాద ధోరణితో స్వార్థం, అధిక్య భావాలతో మనిషి, మనిషికి మధ్య దూరం, మనస్పర్ధలు పెరుగుతున్నాయి. ఇటువంటి సంక్లిష్టమైన

సవాళ్ళతో సతమతమవుతున్న ఆసియా శ్రీసభలో సువార్తీకరణ పరిధి ఎక్కువగా వుంది.

సువార్తా ప్రబోధం యొక్క ఉద్దేశ్యం ఆత్మానందం. పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు సువార్తానందం అపోస్తోలిక లేఖలో ప్రస్తావించినట్లు క్రీస్తును తెలుసుకొని కలుసుకున్న వారి హృదయాలు పాపం, దుఃఖభారం, అంతరంగిక శూన్యం, ఏకాకితనం, మనోవ్యధన నుండి విముక్తులవుతారు. ప్రభువు తోడుగా వుంటే ఆత్మానందానికి కొదువ వుండదు. ప్రభువు సహచర్యంలో మనకు నిరంతరం ఆనందానుభవం కలుగుతుంది (సువార్తానందం 1).

## 5. సువార్తా ప్రబోధ సమకాలీన పరిస్థితులు కలసి ప్రయాణించుట

క్రీస్తు ప్రభువుతాను ఉత్థానమైన తరువాత మోక్షానికి ఆరోహణమై వెళ్ళే ముందు పదకొండు మంది శిష్యులకు మీరు ప్రపంచమందంతట తిరిగి సకల జాతిజనులకు సువార్తను భోధింపుడు (మార్కు 16:15), అని ఇచ్చిన ఆదేశంలో ప్రేషిత సేవ మూలాలు కలిగి ఉన్నాయి. ఇటువంటి క్రీస్తు ఆదేశాన్ని శ్రీసభ మాటలు, చేతల ద్వారా కొనసాగిస్తుంది. ఈ శుభవార్త స్వయంగా ఏసుప్రభువే. క్రీస్తు నందు తండ్రిదేవుని ప్రేమ సంపూర్ణంగా మానవాళికి వ్యక్తం చేయ బడింది. శ్రీసభ త్రియేక దేవుని ప్రతీక. త్రీత్వంలోని ముగ్గురు వ్యక్తులు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల మధ్య ఉన్న ఐక్యతను పోలి ప్రతి క్రైస్తవుడు సువార్తాప్రబోధంలో, దైవరాజ్యస్థాపనలో పాలు పంచుకొనుటకు పిలువబడి ఉన్నాడు. అపోస్తులుడు అయిన యోహాను వ్యక్తం చేసినట్లునిసృష్టి ఆరంభం నుండి గల జీవ వాక్కును గూర్చి నేను మీకు తెలుపుచున్నాను. మేము దానిని చెవులారా విని, కన్నులారా గాంచితిని. కన్నులార గాంచుటయే మా చేతులు దానిని స్పృశించినవి. ఈ జీవం ప్రదర్శించబడినప్పుడు మేము దానిని చూచితిమి,సాక్ష్యం ఇచ్చితిమ్ని (1 యోహాను 1:1–2). ఈ రీతిలోనే జ్ఞానస్నానం పొందిన ప్రతి క్రైస్తవుడు వ్యక్తి గతంగా క్రీస్తు రక్షణ అనుభవాన్ని తన తోటివారితో పంచు కోవాలి. ఇదే అసలైన సువార్త ప్రబోధం.

రెండవ వాటికన్ మహా సభ ముగిసి 50 సంవత్సరములు పైబడి, దానికి సంబంధించిన అన్ని పత్రాలు ప్రచురింపబడిన శ్రీసభ సుదూర ప్రయాణము

చేసింది. అనేక సంస్కరణలు, మార్పులు జీవనశైలిలో సంభవించినను, శ్రీసభ సువార్తా ప్రబోధంలో చెప్పుకోదగిన పురోగతి లేదు. శీఘ్రముగా మార్పు చెందుచున్న సమాజము, అనుదిన జీవితములో ఆధునిక ప్రపంచములో రాజకీయ, ఆర్ధిక, సాంకేతిక రంగాలలో ఆకస్మికముగా సంభవించే మార్పులు, అసఖ్యామే గాక ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ప్రస్తుతము మనము చూస్తున్న ప్రపంచ ముఖ చిత్రము, ప్రపంచ వ్యాప్తముగా ఏకరూపములో లేదు. ఈ సవాళ్ళతో పాటు పైన పేర్కొనిన తెలుగు కతోలిక శ్రీసభ సవాళ్ళను ఏకము చేసి, వాటిని అధిగమించి, త్రియేక దేవునిలో విశ్వాసముంచి, విశ్వాసపాత్రముగా నేటి ప్రపంచములో తన పరిచర్య కొనసాగించాలి. ప్రేషిత సేవకార్యము అనగా పంపబడుట లేదా ముందుకు వెళ్ళుట. అనగా మన నుండి మనం బయటకు వెళ్ళాలి. శ్రీసభ ప్రహరి గోడలు నుండి, ఆచారాలు, కట్టుబాట్లు, విభజన, వివక్ష వైఖరి, అహంకారం, ద్వేషం, దూకుడు స్వభావం, దౌర్జన్యం, కక్షలు, కార్పణ్యాలు అనే అడ్డుగోడలను ఉత్తానక్రీస్తు సమాధి రాయిని పటాపంచలు చేసినట్లు, విధ్వంసం గావించి నిరతము ముందుకు సాగాలి. మొదటి అడుగు మనదే కావాలి, ప్రజలతో కలవాలి, వారికి అండగా వుండాలి, ఫలించాలి, ఆనందించాలి. నిరంతరం ముందుకు కదలివెళ్తూ వుండే శ్రీసభ ఓక సువార్తా భోదకుల సంఘం. యేసు ప్రభువు వలే చొరవ చూపి మనమూ మన సాటివారి వైపు చొరవుగా ముందడుగు వేయాలి. సువార్తా బోధకులు బాధిత ప్రజలను ఆదరించి సేవించుట ద్వారా – వారిలో ప్రత్యక్షమయ్యే బాధామయ సేవకుని ఆలింగనము చేసుకుంటారు, వారు మానవ జీవితాన్ని ప్రేమతో అక్కున చేర్చుకుంటారు. సువార్తా బోధకులు గొర్రెల వాసనను ఎరిగే కాపరులవలే ప్రజలతో సన్నిహితంగా మెలగుతూ ప్రజలను ప్రభు మార్గానికి ఆకర్షించ గలుగుతారు. (సువార్తానందం చ24).

సినడ్ 2021–2024 యొక్క కరదీపికలో (vademecum) ప్రస్తావించినట్లు, ఎక్కువ పత్రాలను ఉత్పన్నము చేయుట సినడ్ లక్ష్యము కాదు. దానికి బదులు, శ్రీసభ గురించి కలలు కనేటట్లు దైవ ప్రజలను ప్రేరేపించుట సినడ్ ముఖ్య ఉద్దేశ్యము. ప్రజల ఆశలు వృద్ధి చెందుటకు వేదనలో నున్న వారిని ఉత్తేజ పరచుటకు, గాయాలు నయం చేయుటకు,

లోతైయిన క్రొత్త బంధాలు నేయుటకు, ఒకరినుండి మరొకరు నేర్చుకొనుటకు, గోడలకు బదులు వంతెనలు నిర్మించుటకు, చెదరిపోయిన జీవితాలను తిరిగి నిర్మించుటకు, అశాంతి అందకారములోనున్న ప్రజలకు శాంతి సమాదానములతో నింపుటయే సువార్తా ప్రబోధము యొక్క ధ్యేయం. శ్రీసభ ప్రేషిత సేవల్లో కలసి పయనించడము అనే ప్రక్రియలో సమకాలీన సంక్లిష్ట పరిస్థితులు, చారిత్రాత్మక నేపధ్యం దిక్సూచిగా వుండాలి. కాలానుగుణముగా చోటుచేసుకునే కీలకమయిన మార్పుల వలన సంక్లిష్టమయిన సమస్యలు, ఉద్రిక్తత, వైరుద్యముతో కూడిన పరిస్థితులను ఎదుర్కొని సరియైన రీతిలో స్పందించుటకు ఆత్మస్వరమును ఆలకించి, దేవుని వాక్కును వినడం ద్వారా శ్రీసభ తనను తాను పునరుద్ధరించుకోవాలి. తాను పొందిన పిలుపుకు అనుగుణముగా భిన్నమైన భవిష్యత్తును ఊహించే సామర్ధ్యం, ఆలకించుట, సంబాషణ, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో వివేచనతో కూడిన ఉమ్మడి నిర్ణయాలు వంటి నూతన పోకడలు అవలంబించినపుడు కలసి ప్రయాణించుట మానవ కుటుంబానికి ఒక ప్రవచానాత్మక సంకేతం. (సినడ్ కరదీపిక 9)

శ్రీసభ యొక్క సువార్తా పరిచర్య ప్రతి క్రైస్తవుని సహకారం పైనే ఆధారపడి యుంది. ప్రతి స్ధాయిలో సువార్తీకులు అంకిత భావంతో, సువార్త ప్రచార తపన కలిగి, ఒక నిర్దిష్ట ప్రణాళికతో, సువార్తాసేవను పటిష్టం చేయాలి. నికలిసి పయనించుదాం! అనే సినడల్ ప్రయాణములోని కీలక పదత్రయము నిసహవాసము-భాగస్వామ్యం-ప్రేషిత కార్యం యొక్క లక్ష్యం, గమ్యం, దైవప్రజల సంఘనిర్మాణం. మానవాళిని పాపపు బంధాలనుండి విముక్తులను చేయడానికి క్రీస్తు తండ్రి దేవునిచే పంపబడిన ప్రథమ అపోస్తులుడు, ఉత్తమమైన సువార్తీకుడు Jesus, the first apostle of the Father, evangelizer par excellence (హెబ్రీ 3:1). యేసు గలిలయ ప్రాంతం అంతటా పర్యటిస్తూ ప్రార్ధనా మందిరంలో బోధించుచూ పరలోక రాజ్యపు సువార్తను ప్రకటించుచూ ప్రజల వ్యాధి బాధలనెల్లా పోగొట్టుచుండెను (మత్తయి 4:23). రెండవ వాటికన్ మహాసభ అధికార పత్రం లోకానికి వెలుగు శ్రీసభ (Lumen Gentium) యందు ప్రస్తావించినట్లు యావత్ మానవ జాతిని చీకటి చెర నుండి విముక్తం చేసి, కాంతి పథంలోను, క్రాంతి పథంలోను నడపాలన్నదే అసలైన, సిసలైన సువార్తా

ప్రభోధం (లోకానికి వెలుగు శ్రీసభ చ4).

కరోనా మహమ్మరి యావత్ ప్రపంచాన్ని అల్లకల్లోలం చేసి మరణ భయముతో వణికిపోయిన మానవాళి పట్ల ఉదాసిన వైఖరి నుండి మేల్కొలపాలని నాయకులకు పిలుపునిచ్చే సంయుక్త విజ్ఞప్తి మరియు మనుగడ మాత్రమే కాకుండా మానవ గౌరవం అవసరం. కరోనా మహమ్మారి ప్రజల జీవితాలను విపరీతముగా మార్చి వేసింది. ఈ నేపథ్యములో ఏర్పడిన క్రొత్త సమస్యలు, జీవనోపాధిని కోల్పోయిన చిరు వ్యాపారులు, వలసదారులు, అతి వేగముగా ఆర్ధిక పరిస్థితి తలక్రిందులైన పేద, మధ్య తరగతి కుటుంబాలు, ఉహించని కొత్త వ్యాధులతో భయాందోళనలో మునిగియున్న కుటుంబాలు, విద్యకు అంతరాయము కలగడమువలన సరియైన విద్యా ప్రమాణాలు లేక ఉద్యోగాల వేటలోనున్న విద్యార్ధులు, మానసిక రుగ్మతలతో, నిరాశ నిస్పృహలకు గురియగుట, మొదలగు సంక్లిష్ట సమస్యలు జీవనోపాధి, స్తితి గతులను కడు దుర్భరముగా మార్చివేశాయి. ఈ నేపథ్యములో కుటుంబ జీవితాన్ని పునరుద్దరించి చేయూతనిచ్చే ఆధ్యాత్మిక, మానసిక వికాసం కలిగించే కార్యక్రమాలు, కుటుంబాలకు చేరువవుతు, బాల బాలికలు, యువత, పెద్దలు, వృద్దులకు కౌన్సెలింగ్ ద్వారా నిస్సహాయత మరియు నిరాశనుండి లేవనెత్తుటకు అనుగుణముగా సువార్త ప్రబోధాన్ని సృజనాత్మకంగా, నిర్మాణాత్మకంగా, నూతనముగా చేయాలి.

## రెండవ భాగము

### 1. దైవ వాక్కు ప్రకటన, (Proclamation) తొలి ప్రకటను (First Proclamation) ఆవశ్యకత

"కనుక వినుట వలన విశ్వాసం కలుగును, వినుట క్రీస్తును గూర్చిన వాక్కు వలన కలుగును" (రోమీ 10:17). "బోధకులు పంపబడనిచో సందేశం ఎట్లు భోదింపబడును. లేఖనం చెప్పుచున్నట్లుగా నిసువార్తను ప్రకటించు వారి పాదములు ఎంత సుందరములైనవి" (రోమీ 10:15). ఏసు ప్రభువు గురించి, అయన రక్షణ సందేశం గురించి తెలియని అన్య జనులకు సువార్త ప్రబోధం చేయడమే శ్రీసభ ప్రధాన ధర్మం (ఆధునిక ప్రపంచంలో సువార్తా ప్రచారోద్యమం,

వేద ప్రబోధం, ఆరవ పౌలు పాపుగారి అపోస్తోలిక లేఖ చ51).

ప్రేషితకార్యములో తొలి సువార్తా ప్రబోధని కీలకమైనది. అపోస్తులుల ప్రాథమిక ప్రభోధం (kerygma) త్రీత్వేక దేవుని తత్వ మహాత్వాలను వెల్లడిస్తుంది. ప్రభు క్రీస్తు తన మరణ, పునరుత్థానాల ద్వారా మనకు తండ్రి దేవుని అపారమైన కారుణ్యాన్ని, వాత్స్యల్యాన్ని వెల్లడించారు. మనకు తండ్రి ప్రేమ అనుభవాన్ని కలిగించారు. యేసు ప్రభువు ఒసగిన రక్షణ భాగ్యాన్ని సాటి మానవులకు ప్రకటించటం కంటే అత్యున్నతమైన ఆద్యాత్మిక శిక్షణ మరియొకటి లేదు. అపోస్తులులు చేసిన ప్రాథమిక ప్రభోదాన్ని (తొలి ప్రభోదాన్ని) అర్ధం చేసుకోవడం లోనే క్రైస్తవ విశ్వాసుల ఆద్యాత్మిక విశ్వాసం ఆధార పడి ఉంటుంది. ఈ ప్రాథమిక ప్రబోధమే మన సత్యోపదేశ పరిచర్యలో ప్రధాన భాగం అవుతుంది, సత్యోపదేశానికి దిశా నిర్దేశం చేస్తుంది (సువార్తానందం 164,165). వాక్యంతో జ్ఞానోదయమై, శ్రీసభ సాంప్రదాయములో పునాదులు కలిగిన సినడల్ మార్గము/కలసి ప్రయాణించుట దైవ ప్రజల జీవితాలలో భాగమై, ఆలకించే శ్రీసభగా, మనశ్శాంతి, ఆంతరంగిక ఆనందము, జీవితానికి అర్ధము అన్వేషిస్తున్న దారి, గాడి తప్పిన మానవాళికి క్రీస్తుగాథను వినిపించుటయే సువార్త ప్రభోధం అని గ్రహించాలి.

## 2. మత విద్రోహ శక్తులు, హింసాకాండ నేపధ్యంలో సువార్తా ప్రకటన

ఎందుకన అనూకూల, ప్రతికూల పరిస్థితుల్లో కూడా సువార్తను ప్రకటించాలి (రెండవ తిమోతి 4:2). ఒకప్పుడు కొన్ని చోట్ల మాత్రమే సువార్త ప్రబోధం సంక్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటే (mission in trouble), ఇప్పుడు సువార్తా ప్రబోధం అమాంతం (mission itself) సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. సువార్త ప్రబోధానికి నాలుగు విషయాలు అవసరం 1 . విషయపరిజ్ఞానం (content), 2. నేపథ్యం (context), 3. సామర్థ్యం (competence), 4.సమ్మోహన శక్తి/తేజస్సు (charisma). శ్రీసభ ప్రధాన ధర్మాలలో కాల సంకేతాలను చదవడం, వాటికీ సువార్త విలువల ప్రకారం భాష్యం చెప్పడం, ఎప్పటికప్పుడు లోకపు పోకడలను పసికడుతూ ప్రభుక్రీస్తు సందేశాలు ప్రకారం వాటి మంచి చెడులను వడగట్టి ప్రపంచానికి వివిరించడంచ శ్రీసభ విధి.

(ఆధునిక ప్రపంచంలో శ్రీసభ 4). విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాల నిలయమైన భారతదేశంలో సువార్తా ప్రభోధం చేయటం మునుపటికన్నా ప్రస్తుత పరిస్థితులలో పెనుసవాలుగా మారింది. అనేక రంగాలలో భారతదేశం కూడలి చెంత సందిగ్ధ అవస్థలో ఉన్నది. రాజ్యాంగ బద్ధంగా భారతదేశం స్వచ్ఛంధంగా లౌకిక, ప్రజాస్వామ్యం దేశం అయినప్పటికి స్వాతంత్ర్యనంతరం లౌకిక వాదం, ప్రజాస్వామ్యం మరుగున పడిపోయినవి.

గత కొన్ని నెలలు మణిపూర్ రాష్ట్రములో జరిగిన హింసా కాండ నేపధ్యములో క్రీస్తునందు మణిపూర్ క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం, విశ్వసనీయత వీరోచితం, సువార్తప్రకటనకు ఎంతో ప్రేరేపణదాయకము. సర్వం కోల్పోయి దిక్కు మొక్కులేని ప్రతికూల పరిస్థితులలో కూడా 40 కిలొమీటర్లు పొడవున ఒక ప్రార్ధనా గొలుసుగా ఏర్పడి బహిరంగముగా విశ్వాసాన్ని ప్రకటించుట గొప్ప జీవిత సాక్ష్యము.

మతచాంధసవాదులు నుండి కొన్ని రాష్ట్రాల్లో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సవాళ్ళలో శత్రుత్వమే కాకుండా కొన్ని సందర్భాల్లో హింసాత్మక దాడులకు దారి తీస్తుంది. అయినప్పటికీ సువార్తా ప్రకటనను అనగా ఏసుక్రీస్తు గాథను మరింత దైర్యంగా, సృజనాత్మకంగా, శాంతియుతంగా, సత్య మార్గంలో చెప్పాలి. ఇట్లు చేయుట దేవుడు ప్రతి ఒక్కరిని అవధులు లేని ప్రేమతో ప్రేమిస్తూన్నడనుటకు సాక్ష్యము. సువార్తప్రకటనలో రక్షణదాయకమైన దేవుని ప్రేమ కేంద్ర బిందువుగా వుండాలి. నైతిక నియమాలు, మతపరమయిన నిబంధనలకన్నా మానవాళిపట్ల దేవునికిగల అపారమైన ప్రేము గురించి స్పష్టముగా బోధించాలి. మనం బోధించేది సత్యమే అయినప్పటికీ, దానిని ప్రజలు తకున్న అంతరంగిక స్వేచ్ఛతో స్వీకరించి అనుసరించుమని ప్రోత్సహించాలేగాని, ఎవరిని బలవంత పెట్టకూడదు. (సువార్తానందం చ165)

విభిన్న సంస్కృతులు, భాషలు, మతాలూ, వర్గాలు, కులాలు, ఆచారాలు, సాంప్రదాయాలు కలిగి భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్న భారతదేశం, అన్ని మతాలను, సంస్కృతులను, సామాజికవర్గాలను, సమభావముతో, శాంతిసామరస్య సంస్కృతిని సృష్టించి ప్రోత్సహించడానికి సినడల్ ప్రక్రియ

కేంద్రంగా ఉంది. భిన్న ధ్రువాల మధ్య దూరంగా పెరిగే పరిస్థితులలో మన రాజ్యంగ విలువల ఆధారంగా, మన దేశాన్ని, ఆద్యాత్మిక, సామజిక, నైతిక, సాంస్కృతిక విలువలతో నిర్మించడానికి కులం, మతం మరియు భాషతో సంబంధం లేకుండా న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే రాజ్యంగ విలువలకు ఈ ప్రవచనాలు ద్వారా దేవుని సువార్త/దైవ రాజ్య విలువలను ప్రకటించిన వారమవుతాము.

## 3. దైవవాక్కుతో ప్రజ్వలితమైన ఏమ్మావు శిష్యుల అనుభవం-నేటి శ్రీసభ సువార్తీకరణ పునరుద్ధరణకు ఆదర్శం

సువార్తా ప్రబోధానికి అంకితం చేయబడిన ఈ అక్టోబర్ మాసంలో, సువార్తా ప్రబోధం యొక్క ఆవశ్యకత గురించి, ధ్యానించి, ఆచరించాలని శ్రీసభ ప్రతి సంవత్సరం మనలను ఆహ్వానిస్తుంది. 2023 సంవత్సరపు ప్రపంచ వేదవ్యాపక ఆదివారపు అంశమైన "రగిలే హృదయాలు కదిలే పాదాలు" అనే సందేశం నేటి పరిస్థితులలో ఏ విధంగా సువార్త ప్రబోధం చేయాలనే దిశగా కొన్ని సూచనలు ఇస్తుంది. దిక్కు తోచక, నిరాశకు గురైన శోకతప్త మానవాళి యొక్క వైఫల్యాలు, సందేహాలు, బలహీనతలు, నిరాశ, నిరాశావాదం అనే సంక్లిష్ట పరిస్థితిలో పునరుత్థాన క్రీస్తు ఏమ్మవు శిష్యులను మేల్కొలిపినట్లు వివిధ రీతులుగా దిగ్భ్రాంతికి గురైన మనలను తన కరుణ, ప్రేమలతో నింపి మనతో ఉండడానికి ఆయన ఎప్పుడు అలసిపోడు. నిరాశ, నిస్పృహలతో ఏమ్మావు తిరిగి ప్రయాణం అయి పోవుచున్న శిష్యులకు ఉత్తాన క్రీస్తు వాక్య భోధ ద్వారా భయాందోళనతో సతమతమవుతున్న వారి చీకటి జీవితములను తేజోమయం చేసాడు. ఈ ప్రక్రీయలో మూడు ముఖ్యమైన అంశాలు గమనించవచ్చు 1. ఏసు వారిని సమీపించుట, 2. వారి కన్నీటి గాథను ఆలకించుట, 3. దివ్యవాక్కుతో స్పందించి దిశా నిర్దేశం చేయుట.

సమకాలీన ప్రపంచంలో సమాజం, శ్రీసభ నిరాశా నిస్పృహలతో, వ్యాధి భాధలు అంతరించి పోతున్న మానవ సంభంధాలు, ఒంటరితనం, నియంతృత్వపాలన,అవినీతి, మానభంగాలు, మతపరమైన హింసాకాండ, వేశ్యావ్యాపారం, మాదకద్రవ్యాల వ్యాపారం, బాలలపై లైంగిక దాడులు, శ్రమ

దోపిడి, వృద్ధులు, వికలాంగులు పట్ల నిరాధారణ, ఘోరాలకు తెగబడే నేర ప్రవృత్తి మొదలగు భీకర చర్యలతో అతలాకుతలమై మానవజీవన ప్రమాణాలు, మానవతా విలువలు, నైతిక, సామాజిక, ఆధ్యాత్మిక విలువలు నానాటికి అంతరించి పోతున్న మానవాళి ఏమ్మవు శిష్యులు వలే వాక్య భోదతో మేల్కొలపబడాలి. ఉత్తానక్రీస్తు వలే సువార్తీకులు అడుగులు ముందుకు వేసి బాధిత, పీడిత జనావలిని వెన్నంటి వుండాలి. విచ్ఛిన్నమైన కుటుంబాలు, యువత, వృద్ధుల, కన్నీటి గాథలను ఆలకించి కరుణామయుడైన క్రీస్తు ముఖవర్చస్సును అనుభూతి పొందునట్లు చేసి చైతన్యవంతుల్ని చేయాలి.

నాడు వలే నేడు కూడా ఉత్తానక్రీస్తు తన సువార్తా భోధక శిష్యులు చెంతనే నడుస్తున్నాడు. ప్రత్యేకించి భయభ్రాంతులై, దిక్కులేని వారై, చేతనత్వం లేక గమ్యంలేని మన జీవితాల్లో అర్థం లేని దుస్తుతి మనలను చుట్టిముట్టినప్పుడు ఉత్తాన క్రీస్తు ఏమ్మావు శిష్యులతో కలిసి ప్రయాణం చేసినట్టు మనతో కూడా ప్రయాణం చేస్తున్నారు. మన హృదయాలలో నెలకొన్ని ఉన్న విచారం, అశాంతి, అలజడి, ఆందోళనలను ఆలకించ సిద్ధంగా ఉన్నాడు క్రీస్తుప్రభు. ఏమ్మావు శిష్యుల వలే మన హృదయాలను తెరిచి మన వ్యధలను, బాధలను, ఉత్తాన క్రీస్తుకు వెలిబుచ్చిన్నప్పుడే జీవవాక్కు అయిన క్రీస్తు మన హృదయాలను ప్రజ్వలింప చేసి పరివర్తన చేయగలడు.

## మూడవ భాగము-పరివర్తన, మతమార్పిడి

### 1. బైబిల్ భావాలు

“కాలము సంపూర్ణమైనద్ని, దేవుని రాజ్యము సమీపించినది. హృదయ పరివర్తన చెంది సువార్తను విశ్వసింపుడు అని దేవుని సువార్తను ప్రకటించెను”. (మార్కు 1:15) మార్పిడి అనే పదం వేరువేరు కోణాలు నుండి చూస్తె వేరు వేరు అర్థాలు కలవు. ఒక మతం నుండి వేరొక మతానికి మారడం, ఒక వ్యక్తి జీవితంలో దైవిక చర్య, మానసిక అనుభవం, వ్యక్తిగత ప్రవర్తనలో సమూలమైన మార్పు, సమాజంలో సాంస్కృతిక మార్పు, వ్యక్తి యొక్క సామాజిక, రాజకీయ, ఆర్థిక ఉత్పరివర్తన మొదలగు అర్థాలుగా చెప్పుకోవచ్చు, విలియం బార్క్లే అనే బైబిల్ పండితుడు ఈ క్రింది అర్థాలును వివరించారు. తిరిగి రావడం (ఆదికాండం

18:33), వెనక్కి తిరగడం (న్యాయదిపతులు 3:19). విదేశీ భూమి నుండి తిరిగి రావడం (రూతు 1:6), దేవుని వైపు తిరగడం (హెూషయ్).

కనుక బైబిల్‌లో పరివర్తన అనగా వెనుతిరుగుటు. పాపము, పాపపు ఆలోచనలు, చేష్టలకు పశ్చాతాపం పడి విశ్వాసంతో క్రీస్తు వైపుకు వెనుతిరుగుట (అపోస్తుల చర్యలు 15:3), దేవుని ప్రత్యేక అనుగ్రహంతో పాపమునుండి వైదొలిగి పవిత్ర జీవితం జీవించుట. హీబ్రు పదం షుబ్ (shub) గ్రీకు ఎపిస్ట్రీపో అను పదాలకు అర్థం వెనుతిరుగుటు పరివర్తనకు పశ్చాతాపం ముఖ్యము. పశ్చాతాపపడిన వ్యక్తియొక్క ప్రవర్తనలో వైఖరిలో, నిర్ణయాలలో, బంధాలలో, ప్రార్ధన జీవితంలో, విశ్వాసంలో, మార్పు బాహాటంగా కనిపిస్తుంది. (లూకా 6:15,9;35). పరివర్తన చెందటం అంటే నిరుపయోగమైన వాటిని వైదొలిగి దేవుని వైపు తిరుగుట (అ.చర్యలు 15:19), చీకటి నుండి వెలుగునకు తిరుగుట (అ.చర్యలు 26:18), విగ్రహ ఆరాధన నుండి దేవుని వైపు తిరుగుట (1 తెస్సలోనిక 1:9–10). క్రొత్త నిబంధనలో మార్పిడి అనే భావన దేవుని రాజ్యానికి సంబంధించి చిత్రీకరించ బడింది. ప్రతి బోధన/ఉపదేశం చివర మారుమనస్సు లేదా పరివర్తన అనే పదాలు నొక్కి చెప్పబడ్డాయి. యేసు తన పరిచర్యను దేవుని వైపు త్రిప్పడానికి మరియు దేవుని రాజ్య ఉనికిని అంగీకరించడానికి ఆహ్వానంతో ప్రారంభిస్తారు (మార్కు 1:15; మత్తయి 4:17; లూకా 3:2–9). మార్పు/పరివర్తన అనేది సువార్త ప్రకటన/బోధనపై ఆధారపడి ఉంటుంది.

## 2. పరివర్తన/మతమార్పిడి పట్ల అపోహలు

కొన్ని హిందూ శాఖల వారు సువార్త ప్రకటనను మతమార్పిడిగా చిత్రీకరించి అపోహలతో, అసంధర్భ, అసత్య ప్రకటనలతో కొందరు మత చాందస వాదులు రాజకీయ ప్రయోజనాలు కోసం, దైవ వాక్కుకు స్పందించి పశ్చాతాప పడి స్వచ్ఛందంగా పరివర్తన చెంది దేవుని వైపు తిరగాడాన్ని వక్రీకరించి అసత్య వాదములు చేయుట దురదృష్టకరం. కొందరు భారత క్రైస్తవ వేద పండితులు పరివర్తన గురించి సమతుల్యమైన, యదార్ధమైన భావాలను ప్రతిపాదనలను వ్యక్తపరిచారు. ఏ.జే.అప్పస్వామి గారి అభిప్రాయం ప్రకారం "మార్పిడి ఒక వ్యక్తి అపరాధ భావం నుండి కాకుండా, దేవుని కోసం అనే

కోరిక నుండి దారి తీస్తుంది". శ్రీ చెంచయ్యగారి ఆలోచన ప్రకారం మార్పిడి అంటే క్రీస్తు అనుభవం లోకి రావడం మరియు ఆయనలో కొత్త శక్తి యొక్క బహుమతి అంగీకరించడం. మార్పిడి అనేది వేదాంత శాస్త్ర ప్రకారం భౌతిక మత మార్పిడి పై ఆధార పడి ఉండదు. అది అంతరంగికమును, ఆధ్యాత్మికమును, ఆత్మశక్తి వలన జరుగు ప్రక్రియ. విశ్వాసం ఒక వ్యక్తిగత నిర్ణయం. మార్పు అంటే క్రీస్తు అనుభవం లోనికి వచ్చుట. మార్పుకు పరివర్తనకు ఒక వ్యవస్థ, సంస్థ లేదా కొన్ని ప్రత్యేక మత సిద్ధాంతాలతో ప్రమేయం లేదు. ఎం.ఎం. థామస్ గారి అభిప్రాయం ప్రకారం విశ్వాసం ఎల్లప్పుడూ స్వంత నిర్ణయం, క్రీస్తుతో సాన్నిహిత్య సంబంధం వ్యక్తిగత అనుభూతికి సంబంధించిన విషయం. భారతదేశంలోని వివిధ మత సాంప్రదాయాల ఉనికిని గుర్తించి అన్ని మతాలూ సామరస్యంతో జీవించడానికి, సంకుచితత్వం అణిచివేత ధోరణిని అధిగమించి ప్రతి వ్యక్తి తాను నమ్ముకున్న ఇష్టదైవాన్ని కొలిచే స్వేచ్ఛా స్వాతంత్ర్యం కల్పించినప్పుడే నిజమైన దైవానుభూతిని పొందిన వారమవుతాము.

## 3. సువార్తాప్రబోధం సామరస్యముగా సాగాడానికి కొన్ని మార్గాలు

1. శ్రీసభ విచారణ కార్యవర్గము, భక్త సంఘాలు, విద్యాసంస్థలు, మన సమీపములో వుండే పోరుగువారి ద్వారా క్రైస్తవులకు, క్రైస్తవేతరులకు శాంతి, సామరస్యం ఆవశ్యకత పట్ల అవగాహన కల్పించాలి. ఉదా: పండుగలు, ప్రార్థనా సమావేశాలు, సామాజిక చైతన్యము కలుగజేసే కార్యక్రమాలలో పాల్గొనడము, పేదరికం, వ్యాధిభాధలు, కుటుంబ సమస్యలు, ఒంటరితనములో నున్న వారికి చేయూత నిచ్చుట.
2. కులం, మతం లేదా సమాజముతో సంభందం లేకుండా ఇతరుల పట్ల సమాన సంరక్షణ, గౌరవభావముతో వ్యవహరించాలి. హింసాత్మక ధోరణి, అణచివేత వున్నచోట మానవతావిలువలు, నైతిక భాధ్యత, శాంతి, ఐక్యమత్యం, అను విలువలను ప్రోత్సహించాలి.
3. శాంతి, ఐక్యతను ప్రోత్సహించే ఇతర మతాలకు, సంస్కృతులకు, సంస్థలకు చెందిన వ్యక్తులతో చేతులు కలుపుతూ సామాజిక, సాంస్కృతిక, మత ఉత్సవాలలో పాల్గొని, మతాలకు, సంస్కృతులకు అతీతంగా మంచి విలువల ఆచరణను ప్రోత్సహించాలి.

4. ఇతర సంఘాలు, సంస్థలతో రోజువారి సంభాషణ, క్రియాశీలమైన, ప్రయోగాత్మకమైన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చెయ్యాలి.
5. ఆయా రంగాలలో అనుభవజ్ఞులైన, సారూప్య భావాలు, ఆలోచనలుగల వారిని గుర్తించి వారి అభిప్రాయాలను, అనుభవజ్ఞానాన్ని సేకరించి, పరస్పర సంభాషణ, చర్చా గోష్టులు నిర్వహించి సమాజములోని రుగ్మతలు, మూఢ నమ్మకాలు, అర్ధములేని ఆచారాలు, సాంప్రదాయాలను సవాలు చేసి పరివర్తన తేవాలి.
6. విశాల ధృక్పదముతో ఇతర క్రైస్తవ సంఘాలతో ఐక్యసంభాషణలు, ప్రణాళికల ద్వారా పరస్పర సహకారము, వనరులు పంచుకునే ప్రయత్నాలు చెయ్యాలి.
7. సువార్తాప్రభోధం సాంప్రదాయ పద్ధతులను సమీక్షించి, కాలసంకేతాలు, మారుచున్న స్థితిగతులకు అనుగుణముగా ఆధునికతను జోడించి సృజనాత్మకతతో, విశ్వసనీయతతో వివిధ స్థాయిల్లో నూత్నీకరణ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు పరచాలి.

## ముగింపు

ప్రస్తుత కాలంలో ఏసు క్రీస్తుగాథ–కథనం, మరింత ధైర్యంగా సృజనాత్మకంగా, ప్రయోగాత్మకంగా, ప్రామాణికంగా వివరించాల్సిన అవసరం ఉంది. సువార్తానందం అపోస్తులిక లేఖలో పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు పిలుపు ఇచ్చినట్లు సువార్తా ప్రబోధం అనగా:

ప్రజల మద్య (ప్రజా హృదయంలో) ఉండాలన్నది నా ప్రధాన సేవాధర్మం (my mission)... ఈ లోకంలో నేనొక సేవాధర్మాన్ని, మూర్తీభవించిన సేవధర్మాన్ని (I am mission) ఆ సేవాధర్మ నిర్వహణ కోసమే నేను ఈ ప్రపంచంలో ఉన్నాను.... మనమందరం ఈ సేవాధర్మం చేత ముద్రు వేయబడిన వాళ్ళం ఈ సేవాధర్మమే మన ప్రత్యేక గుర్తిపుగా కలిగన వాళ్ళం. ఈ ధర్మం ప్రకారం మనం మన సాటి మా నవులకు వెలుగును పంచాలి, వారిని దీవించాలి,

వారిలో జీవచేతన నింపాలి, (పతనమైన వారిని) లేవనేత్తాలి, (వ్యాధిభాదితులను), స్వస్తపరచాలి, (బంధితులను) విముక్తులను చెయ్యాలి. (సువార్తానందం 273).

"రగిలే హృదయాలు కదిలే పాదాలు" అనే తమ అక్టోబర్ 23, 2023 విశ్వ వేద వ్యాపక ఆదివారపు సందేశము ద్వారా మరొక సారి ఫ్రాన్సిస్ పాప్‌గారు శ్రీసభకు ఈ విధంగా పిలుపును ఇస్తున్నారు. ఉత్థాన క్రీస్తు కలయికతో తేజోమయమై, ఆత్మచే ప్రేరేపితులమై మరోసారి బయలుదెరుదాం! రగిలే హృదయాలతో విశ్వాస నేత్రాలు తెరచి, కదిలే పాదాలతో వడివడిగా మళ్లి బయలు దేరుదాం ! దేవుని వాక్యంతో క్రీస్తు వలే ఇతరులు హృదయాలను రగిలింప చేయడానికి రొట్టె విరుచుటలో మనో నేత్రములు తెరవడానికి, తండ్రి అయిన దేవుడు క్రీస్తు ద్వారా సకల మానవాళికి సంసిద్ధపరిచిన శాంతి, రక్షణ మార్గంలో దైవ ప్రజలందరి కలసి ప్రయాణించాలని సినడల్ అంశాలు అయిన సహవాసం భాగస్వామ్యం ప్రేషిత కార్యం శ్రీసభలో భాగం అవ్వాలని కోరుకుంటున్నాను.

❋ ❋ ❋ ❋

# 5. క్షేత్ర స్థాయిలో యేసుగాథను కథనంగా బోధించడంలో చిక్కులు, సూచనలు

– ఫాదర్ డాక్టర్ పొలిశెట్టి జయరాజు

## ఉపోద్ఘాతం



"కలిసి పయనించడం (synodality)" అనేది శ్రీసభ దేవుని ప్రజలుగా కలిసి నడిచే విధానాన్ని సూచిస్తుంది. అనగా ఒకరినొకరు ఆలకిస్తూ పవిత్రాత్మ స్వరాన్ని వినడం మరియు శ్రీసభ యొక్క ప్రేషిత కార్యము కోసం దేవుని చిత్తాన్ని వివేచించడం. సినడాలిటీ అనేది కొత్త భావన కాదు, కానీ ఆధునిక ప్రపంచంలో శ్రీసభ ముందుకు నడవటానికి, సువార్త ప్రచారంలో ప్రపంచానికి సాక్ష్యంగా ఉండటానికి దీనిని ఒక మార్గంగా ఫ్రాన్సిస్ పాపుగారు నొక్కి చెప్పారు. విశ్వ శ్రీసభ సమలోచన (Synod on synodality) సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ గారు ఒక ప్రశ్న సంధించారు. ఈ "కలిసి పయనించడం (synodality)" శ్రీసభ తన యొక్క ప్రేషిత కార్యములో సువార్త ప్రకటన చేయటానికి ఏ విధంగా వీలు కల్పిస్తుంది? ఒక సినడల్ శ్రీసభగా వృద్ధి చెందటానికి ఏ చర్యలు తీసుకోవాలని పరిశుద్ధాత్మ మనల్ని ఆహ్వానిస్తుంది? ఈ ప్రాథమిక ప్రశ్నకు మనం సమాధానం అన్వేషించగలిగితే ఆంధ్ర తెలంగాణ శ్రీసభలో యేసుప్రభుని జీవిత కథను చెప్పడం ద్వారా సువార్త ప్రకటన చేయడానికి మార్గాలను అన్వేషించవచ్చు.

ఈ వ్యాసంలో, విశ్వ శ్రీసభ సమాలోచన 2021–24 ప్రకటన తర్వాత, తెలంగాణ–ఆంధ్ర శ్రీసభలో జరిగిన పరిణామాలను విశ్వాసుల అభిప్రాయ

సేకరణ ఆధారంగా విశ్లేషిస్తూ, సువార్తా ప్రకటన కోసం తీసుకోవాల్సిన చర్యలు, సలహాలు, సూచనలు పరిశీలించానికి ప్రయత్నం చేద్దాం.

## 1. సువారా ప్రకటన-యేసు ప్రభుని జీవిత కథ చెప్పడం

యేసు ప్రభుని జీవిత కథను చెప్పడం కతోలిక విశ్వాసంతో ఒక ప్రధాన భాగం. ఇది సువార్తీకరనకు మూలం. సులభంగా చెప్పాలంటే సువార్త ప్రకటన అంటే క్రీస్తు ప్రభు శుభవార్తను ఇతరులతో పంచుకోవడం. దేవుడు మనలను ప్రేమిస్తున్నాడని, మనము ఆయనచే రక్షించబడి నిత్య జీవములోనికి పిలువబడినామన్న సత్య శుభవార్తను కుటుంబాలకు, స్నేహితులకు, పొరుగువారికి తెలియచేయడం. ఇది యేసు ఆజ్ఞ ప్రకారం ఆయనను విశ్వంసించే వారందరూ చేయవలసిన పని. పునీత ఆరవ పౌల్ పాపుగారు సువార్తీకరణ గురించి తన అపోస్తోలిక లేఖ "సువార్త ప్రబోధం" (Evangelii Nuntiandi)లో నిజమైన సువార్త ప్రబోధం గురించి వివరిస్తూ క్రీస్తు ప్రభు నామాన్ని, ఆయన బోధనలను, ఆయన జీవితం, ఆయన చేసిన వాగ్దానాలు, దైవరాజ్యం, క్రీస్తు దైవ కుమారుడున్న పరమ రహస్యమును చాటకపోతే అది నిజమైన సువార్తీకరణ కాదు అని స్పష్టంగా చెప్పారు.

యేసు ప్రభువే "మీరు పెళ్లి సకల జాతి జనులను నా శిష్యులను చేయుడు" (మత్తయి 28:19-20) అని పిలుపునిచ్చారు. ఆ పిలుపు నేటికి మనకు వినిపిస్తూనే ఉంది. మారుతున్న ప్రపంచంలో మారతున్న జీవన స్థితిగతుల్లో మనం ప్రభువు పిలుపుకు బదులు పలకాలి. తల్లి శ్రీసభ ఈ ప్రేషిత కార్యాన్ని తన మాటలలోనూ, చేతలలోనూ జీవిస్తూ కొనసాగిస్తూ ఉంది. మానవాళికి శుభవార్త ఏసు ప్రభువే. ఆయనలో మానవాళిపై దేవునికి ఉన్న ప్రేమ సంపూర్ణంగా ప్రత్యక్ష పరచబడింది. భారత దేశ శ్రీసభ ఎన్నో ఒడిదుడుకులను ఎదర్కొంటూ ప్రభువు తనకు అప్పగించిన ఈ పనిలో విశ్వాసపాత్రంగా జీవిస్తూ ఆయన సువార్తకు సాక్ష్యంగా నిలవడానికి ప్రయత్నిస్తుంది. అయితే మన మన ఆంధ్ర, తెలంగాణ శ్రీసభలో ఈ ప్రయత్నం ఎంతవరకు నెరవేరుతంది, ఈ సువార్త ప్రకటనలో మనకున్న అడ్డంకులు, కష్టాలు, అవాంతరాలు ఏమిటో పరిశీలించి, లోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగటానికి ప్రయత్నించాలి.

## 2. సినడల్ విధానం అంటే ఏమిటి?

సినడల్ మార్గం కేవలం ఒక ఆలోచన లేదా పద్ధతి మాత్రమే కాదు కానీ అంత కంటే ఎక్కువ. ఇది ఒక ప్రయాణం. అందరూ కలిసి పరలోకం వైపు పయనించడం; కతోలిక శ్రీసభలో పరిపాలన మరియు నిర్ణయాలు తీసుకునే విధానంలో మన దృక్పథం పూర్తిగా మారాలని సూచిస్తుంది. పరస్పర సహకారం, సుహృద్భావ సంభాషణ మరియు భాగస్వామ్య బాధ్యతను ఈ విధానం నొక్కి చెబుతుంది. శ్రీసభలోని సభ్యులందరినీ నిర్ణయాత్మక ప్రక్రియల్లో చురుకుగా పాల్గొనమని సినడల్ విధానం ఆహ్వానిస్తుంది. ఈ విధానంలో పీఠాధిపతులు, గురువులు, దైవాంకితులు, సాధారణ ప్రజలు-ప్రతి ఒక్కరికీ తమ స్వరం వినిపించే స్వేచ్ఛ ఉంటుంది.

సినాడాలిటీ వైపు సాగే ఈ ప్రయాణంలో ఆలకించడం చాలా ముఖ్యం. ఇది వ్యక్తులు ఒకరిపై మరొకరికి ఉన్న అభిప్రాయానికి సంబంధించినది కాదు; కానీ ఇది విభిన్న దృక్పథాలు ఏకీకృతం అయ్యే బహిరంగ మరియు నిజాయితీ గల సంభాషణలకు, చర్చలకు అవకాశాన్ని ఇవ్వడం. ప్రేమ, వినయంతో కూడిన ఆలకింపు; మర్యాదపూర్వక సంభాషణల ద్వారా, మన సంఘం కోసం దేవుని చిత్తమేమిటో సమిష్టిగా తెలుసుకోవడానికి ఈ పరస్పర ఆలకించడం ద్వారా ప్రయత్నిస్తాం.

శ్రీసభలో ప్రతి వ్యక్తికి దేవుడిచ్చిన ప్రత్యేక వరాలు ఉన్నాయి. వారిలోని ఈ ప్రత్యేక వారాలను సువార్త ప్రకటనకు దోహదపడే విధంగా వెలికి తీయాలని ఈ సమాలోచన మనకు పిలుపునిస్తుంది. ఎందుకంటే ఏ ఒక్క వ్యక్తికి అన్ని వరాలు లేదా సంపూర్ణ జ్ఞానం ఇవ్వబడలేదని మనకు తెలుసు. కనుక పవిత్రాత్మచే మార్గనిర్దేశనం చేయబడిన సంఘం వలె, ప్రార్తనా పూర్వకమైన విచక్షణతో దేవుడు మనకు ఇచ్చిన వరాలను సమిష్టిగా వినియోగించుకుంటూ మనకు ఎదురయ్యే సవాళ్లను ఐక్యతతో దైర్యంగా అధిగమించానికి ప్రయత్నించాలని సినడల్ మార్గం మనకు పిలుపునిస్తుంది.

అటువంటి మార్గాన్ని అవలంబించడానికి ధైర్యం కావాలి. ఎటువంటి ధైర్యం అంటే – ధీర్ఘకాలంగా వ్యవస్థలపై ఆధిపత్యం చెలాయిస్తున్న అధికారాన్ని

విడిచిపెట్టడానికి ధైర్యం; తన ప్రజల మధ్య దేవుని సన్నిధిని నమ్మే ధైర్యము; చాలా కాలంగా అణచివేయబడిన లేదా అలకించబడని స్వరాలకు చోటు కల్పించే ధైర్యం ఉండాలి. కలిసి చేసే ఈ ప్రయాణంలో అధికార దర్పం కన్నా సహకార దక్షిత కనిపించాలి. శ్రీసభలో సినడల్ విధానాన్ని అనుసరించడం ద్వారా తెలుగు రాష్ట్రాలలో యేసు ప్రభుని జీవిత కథను చెప్పడానికి మనము కొత్త మార్గాలను అన్వేషించడానికి అవకాశముంటుంది.

## 3. తెలుగు రాష్ట్రాలలో శ్రీసభ స్థితి గతులు

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలోని శ్రీసభ నేడు అనేక సవాళ్లను అధిగమిస్తూ, ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే ముందుకు వెళ్ల గలిగే కీలక దశలో ఉంది. రాష్ట్రంలో గణనీయమైన క్రైస్తవ జనాభాతో, విశ్వాసం, ఆధ్యాత్మికత మరియు సామాజిక న్యాయాన్ని పెంపొందించడంలో క్రైస్తవ సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఏ సంఘమైనా విశ్వాసములో దృఢంగా ఉండి, ఐక్యతతో జీవిస్తున్నప్పుడే తమ అనుకున్న లక్ష్యాలని సాధించగలరు. కతోలిక సంఘంలో కూడా ముఖ్యంగా విచారణలలో అంతర్గతంగా ఉన్న సమస్యలను లోటు పాట్లను సరిదిద్దుకుంటూ సువార్త పరిచర్యలో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యలు వివిధ రకాలుగా వివిధ స్థాయిలో ఉత్పన్నమవుతున్నాయి. వాటిని గుర్తించి తగిన పరిష్కార మార్గాన్ని కనుగొన్నప్పుడు మన శ్రీసభ ఇంకా అర్థవంతంగా క్రీస్తు సువార్తకు సాక్ష్యంగా నిలువగలదు. మేత్రాసన స్థాయిలో సినడ్ (synod) నిర్వహణ సందర్భంగా ఏర్పాటు చేసిన సంప్రదింపులలో (consultations) కతోలిక విశ్వాసుల అభిప్రాయాలను సేకరించడం జరిగింది. వాని ఆధారంగా మన మేత్రాసనాలలో, విచారణలో ఉన్న కొన్ని సమస్యలను, సువార్త ప్రకటనలో ఎదురువుతున్న అడ్డంకులను కనుగొనడానికి ప్రయత్నం చేద్దాం.

### 3.1. సామాజిక-ఆర్థిక అసమానతలు

సామాజిక-ఆర్థిక అసమానతలు ఆంధ్ర, తెలంగాణలోని శ్రీసభకి గణనీయమైన సవాళ్లను విసురుతున్నాయి. శ్రీసభలో అధిక భాగం సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందినవారు, వారిలో అనేకమంది పేదికంతో

పోరాడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య ఇంకా ఎక్కువగా వుంది. విద్య మరియు వైద్యం, ఆరోగ్య సంరక్షణ వంటి ప్రాథమిక సౌకర్యాలకు అనేక కుటుంబాలు నోచుకోవడం లేదు. కొన్ని కుటుంబాలలో ఆదాయ వనరులు ఉండి, జీవన ప్రమాణాలు మెరుగు పడినట్లు అనిపించినా, త్రాగుడు, జూదం వంటి వ్యవసనాలకు బానిసలై తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారు. కుల వివక్ష ఈ అంతరాలను మరింత పెంచుతుంది.

## 3.2. నిరుద్యోగం

అనేక కుటుంబాలలో నిరుద్యోగం పెద్ద సమస్యగా పరిణమించింది. ముఖ్యంగా యువతకు ఈ సమస్య అధికంగా ఉంది. తమ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమను చదివించినప్పటికీ, ఉన్నత విద్యను అభ్యసించిన యువతి యువకులు కూడా ఎటువంటి జీవనోపాధి లేక, ఉద్యోగం లేక ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఖాళీగా ఉంటూ సతమతమవుతున్నారు. కొందరు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతూ ఉంటే, మరి కొందరు ఉన్న గ్రామంలో తల్లిదండ్రులను వదలలేక కూలి పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నారు. ఇది కుటుంబంలో ఒక సమస్యగా పరిణమించింది. ఈ నిరుద్యోగ సమస్య యువతను మానసికంగా కృంగదీస్తుంది. ఇందువల్ల వారిలో పెరుగుతున్న అసహనం కొన్నిసార్లు కుటుంబంలో హింసకు కృంగదీస్తుంది. ఇందువల్ల వారిలో పెరుగుతున్న అసహనం కొన్నిసార్లు కుటుంబంలో హింసకు దారితీస్తుంది. ప్రభుత్వం కొన్ని ఉపాధి అవకాశాలు కల్పించినా అవి అందరికీ అందుబాటులో లేవు. ఈ సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించడానికి శ్రీసభలోని సంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థల, ఎన్జీవోల మధ్య సహకార ప్రయత్నాలు అవసరం.

## 3.3. పెరుగుతున్న లౌకిక వాదం-తగ్గుతున్న నైతిక విలువలు

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు తన అపోస్తలిక ప్రబోధం "సువార్తనందం"లో లౌకిక వాదానికి మతానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని వివరిస్తూ ఈ విధంగా అన్నారు: "లౌకికవాదం విస్తరించే కొద్దీ-విశ్వాసము శ్రీసభ అనేవి కేవలం వ్యక్తిగత వ్యవహారాలుగా కుదింపబడుతున్నాయి. అంతేకాదు దేవుణ్ణి, దైవ

భావనను కూడా పూర్తిగా తిరస్కరించడం వలన నైతిక విలువలు క్షీణిస్తున్నాయి.” సమాజంలో మనుషులు వ్యక్తి గత స్వేచ్ఛ పేరుతో తమకు ఇష్టమైన రీతిలో జీవిస్తూ నైతిక విలువలకు తిలోదకాలిస్తున్నారు. వ్యక్తిగత పాపం, సమిష్టి పాపం అనే స్పృహ లేకుండా పోవడం వలన పాప భీతి నశిస్తుంది. ప్రసార మాధ్యమాలు, టీవీ వినియోగం ఎక్కువ అవడం, మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్ అందుబాటులో ఉండటం వలన ఇటువంటి భావజాలం చాలా త్వరగా అందరికీ చేరుతుంది. ప్రజలు కూడా ప్రసార మాధ్యమాల్లో మరియు సోషల్ మీడియాలో వచ్చినవే మంచి వని భావించి వాటినే తమ విలువలుగా మార్చుకుంటున్నారు. దీనివలన కుటుంబ వ్యవస్థలో సంక్షోభం తలెత్తుతుంది. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు మరియు ఇంటర్నెట్ యొక్క మితిమీరిన వినియోగం కుటుంబాల సామరస్యపూర్వక జీవితంపై విపరీతమైన ఒత్తిడిని పెంచాయి.

## 4. విశ్వాస జీవితంలో సవాళ్లు

సువార్త పరిచర్యలో పీఠాధిపతులు, గురువులు, దైవాంకితులు మరియు సాధారణ క్రైస్తవులు భాగస్వామ్యం చాలా ఆవశ్యం. అప్పుడే ఈ పరిచర్య సక్రమంగా సాగుతుంది. కానీ వీరి మధ్య సమన్వయం లేని కారణంగా విశ్వాసులు జీవితాలలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ లోపాలను అధిగమించగలిగితే సువార్త పరిచర్య సజావుగా సాగటానికి అవకాశం ఉంటుంది. కాబట్టి విశ్వాసులు జీవితాల్లో ఎదురయ్యే కొన్నిటిని ఇక్కడ ప్రస్తావించడానికి ప్రయత్నం చేద్దాం.

### 4.1. విశ్వాసంలో ఎదుగుదల లేకపోవడం (Lack of Faith Formation)

అనేకమంది కతోలిక విశ్వాసులలో పటిష్ట విశ్వాస నిర్మాణము లేకపోవటం నేడు మనం ఎదుర్కొంటున్న ఒక ముఖ్య సమస్య. చాలామంది కతోలిక క్రైస్తవులకు ముఖ్యంగా గ్రామీన ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి తమ విశ్వాసం గురించి కనీస అవగాహన లేకపోవడం బాధాకరం. వారు బాల్యంలో నేర్చుకున్న కొన్ని ప్రార్థనలు తప్ప విశ్వాస సత్యాల గురించి గాని, శ్రీసభ బోధనల గురించి గానీ, సాంప్రదాయాల గురించి గానీ పెద్దగా అవగాహన లేదు. దివ్యబలి పూజలో గురువులు చేసే ప్రసంగాలు లేదా అప్పుడప్పుడు నిర్వహించే ప్రార్థన

సమావేశాల ద్వారా మాత్రమే వారికి మత విశ్వాసం గూర్చి తెలుస్తుంది. కానీ ఇది చాలా స్వల్పం.

విశ్వాస నిర్మాణం అనేది బోధించడం, ఆలకించడం, జీవించడం ద్వారా జరుగుతుంది. గతంలో మన సంఘాలలో బాల్యం నుంచే సత్యోపదేశ సంక్షేపం బోధించడం, ఆదివారం బైబిల్ తరగతులు నిర్వహించటం, వేసవికాలంలో వేసివి శిక్షణా శిబిరాలు నిర్వహించి విశ్వాస సంబంధ విషయాలలో శిక్షణ ఇవ్వటం జరిగేది. కానీ ఈ రోజుల్లో చాలా చోట్ల అవి కనుమరుగయ్యాయి. కారణాలు అనేకం. ఒకపైపు తల్లిదండ్రులకు, పిల్లలకు కూడా ఈ కార్యక్రమాల్లో ఆసిక్త లేకపోవడం, చదువుల ఒత్తిడి, ఆధునిక జీవిత విధానం. ఇంకొక వైపు విచారణ గురువులు, విచారణలో ఉన్న సిస్టర్స్ అందుకు తగిన ఏర్పాట్లు చేయక పోవడం. కారణాలు ఏమైనా ఇందువలన ప్రజలకు మత విశ్వాసం గురించి, సాంప్రదాయాల గురించి ఉండవలసిన కనీస జ్ఞానం, అవగాహన లేకుండా పోతుంది. దీనిని సరిదిద్దాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రతి ఒక్కరూ ముఖ్యంగా గురువులు, మఠవాసులు సువార్త పరిచర్యలో ముఖ్యమైన భాగంగా ముందుగా విశ్వాసలును తమ యొక్క మతపరమైన విషయాలలోనూ, పరిశుద్ధ గ్రంత పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ప్రయత్నం చేయాలి. అందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవడానికి, వారిని ప్రోత్సహించటానికి ప్రయత్నం చేయాలి.

కుటుంబ జీవితంలో ప్రార్థన కొరవడింది. కలిసి ప్రార్థించే కుటుంబాలను ఈ రోజుల్లో చాలా అరుదుగా చూస్తాం. ప్రస్తుత జీవిత విధానంలో కటుంబమంతా ఒకేసారి కలిసి ఉండటమే సాధ్యం కావడం లేదు. పిల్లల చదువులు, పెద్దల ఉద్యోగాలు ఎడతెరిపి లేని పనులు ఈ పరిస్థితికి కారణం. ఒకవేళ కలిసి ఉన్నా, ఆ కొద్ది సమయంలో వారు వారి ఫోన్లోగాని, టీవీ చూడండంలో గాని నిమగ్నమవుతున్నారు. అంతెందుకు, కొన్ని మఠవాస నిలయాల్లో (Religious Communities) కూడా సభ్యులందరూ కలిసి ప్రార్థించడం కుదరడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కుటుంబ స్రార్థన ఉన్న కుటుంబాలు చాలా అరుదు అని చెప్పక తప్పదు. ఆదివార పూజల్లో పాల్గొనడం

కూడా పూర్తిగా జరగడం లేదు. సంఖ్యాపరంగా కొన్నిచోట్ల గుడి నిండినా, ఇంకా రావాల్సిన వారు చాలామంది ఉన్నారు అన్న విషయాన్ని మనం మరవకూడదు.

## 4.2 పాలనాపరమైన విషయాలలో భాగస్వామ్యం

విచారణలో పరిపాలన సంబంధమైన విషయాలలో కొన్నిచోట్ల సంఘస్తులలో నిర్లిప్తత కనిపిస్తుంది. ఇది మాకు సంబంధమైన విషయం కాదు అన్న ధోరణి కనపడుతుంది. చాలా చోట్ల విచారణ కౌన్సిల్ లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సంఘ పెద్దల వ్యవస్థ నడుస్తూ ఉంది. సంఘ పెద్దలు కూడా తమ బాధ్యతను విచారణ పండుగలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వరకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. మరొకవైపు విచారణ కౌన్సిల్ ఉన్న చోట్ల కొన్ని సార్లు విచారణ గురువు ప్రమేయం లేకుండా కౌన్సిల్ డామినేట్ చేస్తూ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నం చేస్తున్నారు. సాధారణ క్రైస్తవుల యొక్క భాగస్వామ్యంతో విచారణలో పాలనాపరమైన బాధ్యతలను నిర్వహించడానికి అవకాశం కల్పించాలి. విచారణ గురువుకు, సంఘస్తులకు మధ్య సమన్వయం సహకారం ఉండాలి.

## 4.3 ఆధ్యాత్మిక లౌకికత

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు సువార్త పరిచారకులలో ఉన్న ఆధ్యాత్మిక లౌకికత (spiritual worldliness) గూర్చి హెచ్చరిస్తున్నారు. ఆధ్యాత్మిక ముసుగులో లౌకిక వ్యామోహాలున్నవారు, దేవుని మహిమను కోరుకోవడానికి బదులు తమకు మానవులిచ్చే గౌరవాన్ని కీర్తిని, వ్యక్తిగత శ్రేయస్సును కోరుకొంటారు. ఈ తరహా భావాలు గల వారి వల్లే మన తెలుగు శ్రీసభలో కులతత్వం, వర్గతత్వం పెరుగుతోంది. తమ వ్యక్తిగత స్వార్ధం కోసం ఇతరులను ఉపయోగించుకొంటూ సామాజిక రాజకీయ లబ్ధి పొందాలనే తపన వీరిలో ఉంటుంది. సువార్తా ప్రబోధం మీద ఆసిక్తి కన్నా తన వ్యక్తిగత విషయాల మీద శ్రద్ధ ఎక్కువగా ఉంటుంది. మన తెలుగు రాష్ట్రాలలోని కతోలిక శ్రీసభలో ముఖ్యంగా కొన్ని మేత్రాసనాలలో ఈ జాడ్యం మరీ ఎక్కువగా వుంది. ఇటువంటి పరిస్థితి సువార్త పరిచారకుల విశ్వసనీయతను ప్రశ్నార్ధకం చేస్తుంది.

గురువులు మరియు మఠవాసులు తమ విశ్వాస జీవితం మరియు సువార్త పరిచర్య ద్వారా ఇతరులకు ఆదర్శంగా ఉండాల్సిన వారు. అయితే కొంతమంది తాము చేయాల్సిన పనిని మరచి ఇతరుల యొక్క వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ తమ బాధ్యతను మరచిపోతున్నారు. సువార్తకు సాక్షులుగా ఉండటానికి బదులు వ్యతిరేక సాక్షులుగా (counter witnesses) తయారవుతున్నారు. గురువుల మధ్య, మఠ వాససభలలో కూడా కుల వర్గ విబేధాలు ఉన్నాయన్నది మనం కాదనలేని సత్యం. ఈ రోజుల్లో కొన్ని చోట్ల గురువుల మధ్య ఉన్న అనైక్యత, విభేదాలు, గ్రూపు రాజకీయాలు బహిరంగ రహస్యం. ప్రభువు చెప్పినట్లు "వారు బోధించునదేమో వారే ఆచరింపరు" అన్న చందాన శ్రీసభ అధికార గణం యొక్క జీవన శైలి, వారి యొక్క జీవిత విధానం సువార్తకు విరుద్ధంగా సాక్ష్యం ఇస్తున్నాయి. కొంత మంది గురువులు తమ స్వర్ధ ప్రయోజనాల కోసం సాధారణ క్రైస్తవులను కూడా తమ యొక్క కుల రాజాకీయాల్లోకి లాగి, వారిని ఉపయోగించుకొని ఇతరుల పేర్లు చడగొట్టడం తోడి గురువులకు వ్యతిరేకంగా, పీఠాధిపతులకు వ్యతిరేకంగా ఆకాశ రామన్న ఉత్తరాలు రాయించడం ద్వారా శ్రీసభకు చాలా హాని చేస్తూ ఉన్నారు. కొన్ని చోట్ల కుల ఘర్షణలు జరుగుతున్నాయి. తద్వారా బాధపడినవారు సంఘాన్ని వదలి వెళుతున్నారు. ఇది సువార్త వ్యాప్తికి పెద్ద ఆటంకంగా తయారయింది.

మనం లక్ష్యం ప్రజలని క్రీస్తువైపు నడిపించాలని ఉన్నప్పుడు అక్కడ మనం ముఖ్యం కాదు కానీ క్రీస్తు ప్రభువు ముఖ్యమన్న విషయం మనం గ్రహించాలి. కానీ దురదృష్టవశాత్తూ, కొన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, దివ్యబలిపూజలో కూడా వ్యక్తి పూజలకు ప్రాధాన్యమిస్తూ పీఠాధిపతులను, గురువులను, నాయకులను కీర్తిస్తూ, ముఖస్తుతి చేయటానికి ప్రయత్నిస్తూ, దివ్యబలిపూజ యొక్క విశిష్టతను, ఆధ్యాత్మికతను పలుచన చేస్తూన్నారు. ఇందువలన దివ్య బలి పూజా నిర్వహణలో భక్తి సన్నగిల్లుతుంది. ఆధ్యాత్మికత పట్ల శ్రద్ధ కొరవడి ప్రజలు ఆ బలిపూజలో భక్తిగా పాల్గొనడానికి అవకాశం లేకుండా పోతుంది.

పునీత రెండవ జాన్ పౌల్ పాపుగారు తన విశ్వలేఖ Redemtoris Missio లో చెప్పినట్లు “ఈనాటి ప్రజలు మాటల కన్నా చేతలమీద, సిద్దాంతాల కాన్న అనుభవజ్ఞుల పైన, మరియు బోధించేవారి కన్నా సాక్షులుగా జీవించే వారిపైన ఎక్కువ నమ్మకం కలిగియున్నారు.” ఒక క్రైస్తవ జీవిత సాక్షి మొట్టమొదటి మరియు చిరస్మరణీయమైన సువార్త ప్రచార రూపం. కాబట్టి మనం ఎంత బోధించినా, దానిని ఆచరించలేకపోతే ఆ బోధ వ్యర్ధమే. అది ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. కనుక ప్రధమంగా గురువులు మరియు మఠవాస జీవితం జీవించేవారు, సువార్త వ్యాప్తిలో సత్ఫలితాలు సాధించుటకు తమ జీవితంలో సువార్తకు సాక్షులుగా జీవిస్తూ, సువార్త ప్రబోధనకు ప్రధమ స్థానాన్ని ఇవ్వాలి.

## 4.4 ఇతర మతస్తుల నుంచి ఎదురయ్యే సవాళ్లు

మన రాష్ట్రాలలో ఇతర మతస్తులు మన పట్ల స్నేహభావంతో సామరస్యంగానే జీవిస్తున్నారు. మన రాష్ట్రాలలో మత మార్పిడి నిరోధక చట్టాలు లేకపోవుట వలన చాలా వరకు మనకు తగినంత స్వేచ్ఛ స్వతంత్రం ఉన్నాయి. మతాన్ని ఆచరించడంలో, ప్రకటించడంలో ముఖ్యంగా కతోలిక విశ్వాసులకు పెద్దగా ఇబ్బందులు లేవు. కానీ అప్పుడప్పుడు సోషల్ మీడియా వేదికగా మతపరమైన వివాదాలు సృష్టించటానికి కొందరు అతివాదులు ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని వివాదాలను సృష్టించడం ద్వారా సమస్యలను లేవనెత్తుతూ ప్రశాంతతను భగ్నం చేయటానికి ప్రయత్నిస్తున్నారు. మత ఛాందసవాదులు ఒక ప్రణాళిక ప్రకారం క్రైస్తవ మత వ్యతిరేకతను పెంచడానికి రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా, హింసను ప్రేరేపించినా, సామరస్యంతో ఎదుర్కొవడానికి సమైక్యంగా కృషి చేయాలి. ఈ విషయాల గురించి ఉన్నత స్థాయిలో పరిష్కారాన్ని వెదకడానికి ప్రయత్నించాలి.

## 4.5 క్రైస్తవ శ్యాఖల నుంచి సవాళ్లు

సువార్త పరిచర్యలో మనం ఎదుర్కొంటున్న ఇంకొక సవాలు ఇతర క్రైస్తవ శాఖల ప్రభావం. ఉన్నతి స్థాయిలో వివిధ క్రైస్తవ శాఖల మధ్య ఐక్యతకు కృషి చేస్తూ, క్రైస్తవ సమైక్యతా వారాలు నిర్వహిస్తూ, కతోలిక సంఘం ప్రయత్నం చేస్తున్నా, గ్రామీణ స్థాయిలో అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. ప్రొటెస్టెంట్

పాస్టర్లు ముఖ్యంగా స్వతంత్ర పాస్టర్లు కతోలికులనే లక్ష్యంగా చేసుకొని తమ యొక్క బోధన కొనసాగిస్తున్నారు. దివ్య సంస్కారాలకు, శ్రీసభ సాంప్రదాయాలకు పరిశుద్ధ మరియమాతకు వ్యతిరేకంగా బోధిస్తూ, మన సంఘస్తులను తమ వైపు త్రిప్పుకోటానికి ప్రయత్నం చేస్తున్నారు. దీని వలన అనేకమంది ప్రొటెస్టెంట్ శాఖలవైపు ఆకర్షింపబడి సంఘాన్ని విడిచి వెళ్తున్నారు.

అందుకు ఇంకా ఇతర కారణాలు కూడా ఉన్నాయి. శ్రీసభ చట్టం, మరియు నియమాలు కొంతమందికి కఠినంగా అనిపిస్తూ వాటిని ఆచరించాలంటే కష్టతరంగా ఉంది. కాబట్టి ఇతర శాఖలకు వెళ్తున్నామని చెప్తున్నారు. ముఖ్యంగా వివాహ విషయంలో శ్రీసభ చట్టంలో ఉన్న నియమాలు కఠినం అనే భావన ప్రజలలో ఉంది. ఇతర మతస్తులను గానీ, కతోలికేతరులను గానీ వివాహం చేసుకోవలసి వస్తే పాటించాల్సిన నియమాలు (అనుమతి కోసం అనుసరించాల్సిన ప్రక్రియ) కష్టతంరంగా ఉంటుంది. కాబట్టి దీని కన్నా వేరే శాఖలకు వెళ్ళటం మంచిది అనుకునే వారు కూడా ఉన్నారు.

మరియొక కారణం ప్రొటెస్టెంట పొస్టర్లు చూపిస్తున్న ఆదరణ, వ్యక్తిగత శ్రద్ధ కతోలిక శ్రీసభలో లభించడం లేదనే ఆరోపణ ఉంది. తరచూ కుటుంబ సందర్శన చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండటం వలన ఈ సమస్యను అధిగమించవచ్చు. అందుకు ఉపదేశులు, వివిధ భక్తి సంఘాల సహకారం తీసుకోవడం చాలా మంచిది.

## 4.6 యువతా సమస్య

నేటి యువతకు భగవంతుని పట్ల భక్తి సన్నగిల్లుతుంది. తల్లిదండ్రులు అందించిన విశ్వాసం ఇప్పుడు యువతకు చేదుగా మారిపోయింది. సాంకేతిక శాస్త్ర విజ్ఞానం పట్ల కొంత పరిజ్ఞానం సంపాదించడం వల్ల ప్రతిదీ మానవ ప్రయోగం గానే భావిస్తున్నారు. కుటుంబంలో చిన్నతనం నుండి ఆధ్యాత్మిక సామాజిక విలువలు నేర్చుకుంటే సభ్య సమాజంలో నైతికత ఉండేది. ఈరోజు మన దేవాలయాలు యువత లేక బోసిపోయి ఉన్నాయి. ప్రార్థన యువతకు ఎంతమాత్రం రుచిండంలేదు. దేవుడు లేడని అంతా ఇహలోకం అని ప్రచారం

చేసే సంఘాలు యువతను బాగా ఆకర్షిస్తున్నాయి. ప్రపంచంలో ప్రతిదీ వ్యాపారమే అన్న సందేశాన్ని యువతకు అందిస్తున్నారు.

యువతీ యువకులు సరైన దిశా నిర్దేశం లేక విశ్వాసంలో శిక్షణ లేక లౌకిక విలువల ఆధారంగా తమ జీవితాన్ని మలుచుకుంటున్నారు. కొన్నిసోర్లు మంచి, చెడుల మధ్య వ్యత్యాసాన్ని గ్రహించలేని స్థితిలో ఉన్నారు. ఈ సూపర్ టెక్నాలజీ యుగంలో వారికి అన్ని విధాలైన లోకజ్ఞానం అందుబాటులో ఉంది. మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్ చౌకగా అందుబాటులో ఉండటం వల్ల మంచిని నేర్చుకోవడం కన్నా, చెడు పట్ల ఆకర్షితులై పెడత్రోవ పడుతున్నారు. మాదకద్రవ్యాలకు అశ్లీలతకు బానిసలై యువత చాలా మంది చెడిపోతున్నారు.

## 5. సినడల్ పద్ధతిని అనుసరించడం

ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ, నేడు తెలుగు శ్రీసభలో ప్రోత్సాహకరమైన సంకేతాలు కూడా ఉన్నాయి. శక్తివంతమైన యువత మనకు అందుబాటులో ఉంది. వారికి సరియైన శిక్షణ ఇవ్వ కలిగితే వారి శక్తి వనరులను శ్రీసభ సేవలో సద్వినియోగం చేసుకోవచ్చు. వివిధ భక్తి సంఘాల ద్వారా సువార్త పరిచర్యలో చురుకైన భాగస్వామ్యంతో, తమ సొంత ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మరింత లోతుగా కొనసాగిస్తూ తోడ్పడే సాధారణ క్రైస్తవులు వున్నారు. వీరి భాగస్వామ్యంతో కలిసి పయనించడానికి విశ్వ శ్రీసభ సూచిస్తున్న ఈ సినోడల్ విధానం, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో శ్రీసభకు పరివర్తనాత్మక విధానాన్ని (transformative approach) అందిస్తుంది. ఈ నమూనాను స్వీకరించడం ద్వారా శ్రీసభ పరిపాలన మరియు నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో దైవ ప్రజల మధ్య ఎక్కువ భాగస్వామ్యంమరియు సహకారాన్ని పెంపొందించగలదు. ఇది మరింత సమన్వయంతో పని చేసే శక్తివంతమైన విశ్వాస సంఘ నిర్మాణానికి స్ఫూర్తినిస్తుంది.

మన శ్రీసభలో సినడల్ పద్ధతిని అనుసరించాలంటే, పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు మరియు సాధారణ క్రైస్తవులు సమాన భాగస్వామ్యం కలిగి ఉండటం చాలా ముఖ్యం. పరస్పరం ఆలకించడం సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, విభిన్న కోణాలను పరిగణలోకి తీసుకోవటానికి సుముఖత కలిగి ఉండటం ద్వారా దీనిని సాధించవచ్చు. అందరి

అభిప్రాయాలను ఆలకించి విలువనిచ్చే, గౌరవించే నమ్మకమైన సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం కూడా ఉంది.

అదనంగా, ఈ ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని చేర్చడం ద్వారా వర్చువల్ సమావేశాలు లేదా ఆన్లైన్ సర్వేలను అనుమతించడం మరియు సోషల్ మీడియా ద్వారా అనుసంధానం కావడం ద్వారా భాగస్వామ్యాన్ని పెంచవచ్చు. సమావేశాలకు భౌతికంగా హాజరు కాలేని వారు కూడా తమ అభిప్రాయాలను, ఆలోచనలు పెంచుకోవడానికి ఇది అవకాశం కల్పిస్తుంది. అంతేకాక, పరస్పర గౌరవం మరియు అవగాహన ఆధారంగా సామరస్యపూర్వక సంబంధాలను నిర్మించడానికి ఇతర క్రైస్తవ శాఖలతో చర్చలు పెంపొందించడం చాలా అవసరం. సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడేటప్పుడు, మరియు శాంతిస్థాపన ప్రయత్నాలను ప్రోత్సహించేటప్పుడు ఇతర క్రైస్తవ శాఖలతో కలసి పని చేయడాన్ని సినడల్ విధానం ప్రోత్సహిస్తుంది.

## 6. సలహాలు, సూచనలు

శ్రీసభలోని ప్రతి సభ్యుని యొక్క భాగస్వామ్యంతో యేసు ప్రభుని జీవిత కథను చెప్పడం ద్వారా సువార్తను సమర్థవంతంగా అందరికీ అందచేయడానికి కొన్ని సలహాలను పరిశీలించవచ్చు. ఇవి synod consultations లో భాగంగా ప్రజల నుండి వచ్చినవి. ఇవి అన్నీ కొత్తవి కాకపోయినా మనం పునఃశ్చరణ చేసుకొని, కాలంలో వస్తున్న మార్పులు కనుగుణంగా వానిని మనం ఆచరణలో పెట్టగలిగితే సువార్త ప్రకటనలో మన ప్రయత్నం సఫలం కాగలదు.

- కతోలిక సాహిత్యాన్ని అందరికీ ఉచితంగా ఆన్లైన్‌లో అందుబాటులో ఉంచటం. ఈ రోజుల్లో సమాజంలో చాలా మందికి ఇంటర్నెట్ అందుబాటులో ఉంది. కంప్యూటర్స్ ద్వారా గాని మొబైల్ ఫోన్స్ ద్వారా గాని అనేక విషయాలు తెలుసుకోగలుగుతున్నారు. అరచేతిలోనే ప్రపంచమంతా ఇమిడి ఉంది. ఈ నేపథ్యంలో తెలుగు భాషలో కతోలిక సాహిత్యం అందరికీ అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతో ఉంది. కతోలిక విశ్వాసం గురించి తెలుసుకోవాలనుకున్న వారికి పవిత్ర గ్రంథాన్ని చదవాలనుకునే వారికి అవకాశాలు అంతగా కనబడడం లేదు. భారత మిత్రం యాప్ ద్వారా కొన్ని విషయాలు, కొంత సాహిత్యం

అందుబాటులో ఉన్నా, తెలుగు పీఠాధిపతులు సమాఖ్య ద్వారా వివిధ విభాగాలలో, కతోలిక సాహిత్యాన్ని ఎక్కువగా ప్రజలకు అందుబాటులో ఉంచితే, దాని గురించి తెలుసుకోవాటానికి అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కతోలిక విశ్వాస ప్రామాణిక గ్రంథం కతోలిక సత్యోపదేశ గ్రంథాన్ని (Catechism of the Catholic Church, CCC), తెలుగు పీఠాధిపతుల సమాఖ్య నిర్ణయాలను ఆనలైన్ అందరికీ అందుబాటులో ఉంచగలిగితే, ఆసిక్తి ఉన్నవారు తమకున్న అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి, తమ యొక్క కతోలిక జ్ఞానాన్ని పెంపొందించు కోవడానికి అవకాశం ఉంటుంది.

- దైవార్చనలో, దివ్యబలిపూజా నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. వారు భక్తియుతంగా పాల్గొనడానికి అనుకూలమైన వాతావరణం, సరి అయిన రీతిలో భక్తిప్రత్తులతో దివ్యబలిపూజను కొనియాడడం జరగాలి. గురువులు దివ్యబలిపూజను సమర్పిస్తున్నపుడు, యాంత్రికంగా కాకుండా, తామేమి చేస్తున్నామో, గ్రహించే మనస్సు గలవారై, భక్తితో ప్రార్థన పూర్వకంగా చేయాలి. ముఖ్యంగా పెద్ద పండుగలు జరిగే సమయంలో సమిష్టి దివ్యబలిపూజలో భక్తి కన్నా ఆర్భాటం, ఆడంబరం ఎక్కువగా ఉంటుంది. దీనిని తగ్గించడానికి ప్రయత్నించాలి.
- విచారణలలో, గ్రామాలలో ప్రణాళిఖాబద్ధంగా కుటుంబ సందర్శన చేయటం, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాలలో దివ్యబలిపూజలు సమర్పించడం, సమయానుకూలంగా వారికి విశ్వాసం వికాసంలో శిక్షణ కార్యక్రమాలు ఇవ్వడం జరగాలి.
- ఇంతకుముందు జ్యోతిర్మయి సంస్థ ఆద్వర్యంలో మౌలిక క్రైస్తవ సంఘాలు నడిచేవి. కానీ ఇప్పుడు చాలాచోట్ల అవి కనుమరుగయ్యాయి. కారణాలను సమీక్షించి, వానిని మరలా పునరుద్ధరించి, ప్రజలకు సరైన అవగాహన కల్పించి, సినడల్ విధానంలో ఈ మౌలిక సంఘాల యొక్క ఉద్దేశం, అవి ఏ విధంగా నిర్వహించాలో తెలియచేస్తే, సువార్త పరిచర్యలో అవి ప్రభావవంతమైన సాధనాలుగా మారగలవు.

- దివ్యబలిపూజ యొక్క విశిష్టతను, దివ్య సంస్కారాల యొక్క గొప్పతనాన్ని అవసరాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది కతోలికులు తాము నిర్వహించుకునే కుటుంబ ప్రార్థనే ముఖ్యం అనుకుంటూ దివ్యసంస్కారాలకు దివ్యబలిపూజకు అంత ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఈ భావన ప్రొటెస్టెంట్ సంఘాల ప్రార్థన కూటాల ప్రభావం వల్ల కలిగినదే. కాబట్టి దివ్యబలిపూజ యొక్క విశిష్టతను, దివ్యసంస్కారాల ఆవశ్యకతను ప్రజలకు తెలియపరచి ఈ లోపాన్ని సరిదిద్ద కలగాలి.
- గురువులు, మఠవాసుల మధ్య సమన్వయం ఉండాలి. కొన్ని చోట్ల మఠవాసులు తమకు విచారణ పరిచర్యలో సంబంధం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తూ ఉన్నారు. వారి ఇన్స్టిట్యూషన్స్ నడిపించుకోవడంలోనే శ్రద్ధ చూపిస్తున్నారు. ఇటువంటి ధోరణి విడనాడాలి. వారి ముఖ్యమైన పని సువార్త ప్రకటనేనని గుర్తుంచుకొని దానికి ప్రాధాన్యత ఇవ్వగలిగాలి. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో విచారణ గురువు. మఠవాసుల మధ్య సహకారం, సమన్వయం ఉండాలి.
- విచారణ నిర్వహణలో పక్షపాత ధోరణి, కుల వివక్ష విడనాడి, స్త్రీలను, యువతీ యువకులను ప్రోత్సహిస్తూ విచారణ కౌన్సిల్ ద్వారా అందరి భాగస్వామ్యం కలిగి ఉండాలి. విచారణ వ్యవహారాలలో పారదర్శకత కలిగి ఉండాలి. ఉపదేశలకు తగిన తర్ఫీదునిచ్చి వారిని సువార్త పరిచర్యలో వినియోగించుకోవాలి. అదే సమయంలో వారి యొక్క జీవన భృతిని పెంచాలి

ఇవి కొన్ని సూచనలు సలహాలు మాత్రమే. సలహాలు ఎన్ని ఉన్నా వాటిని ఆచరణలో పెట్టే మనము లేనప్పుడు అవి నిరుపయోగం. కాబట్టి స్థానిక పరిస్థితులను బట్టి తగిన నిర్ణయాలు తీసుకొని అమలు పరచగలగాలి. మన సంఘాలను క్రైస్తవ విశ్వాసం జీవితంలో చురుకుగా ఉండే సంఘాలుగా మార్చగలిగితే వారే సువార్త పరిచర్యలో సాధనాలుగాను, ప్రభావంతమైన సాక్ష్యంగా ఉండగలరు.

## ముగింపు

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు హెచ్చరించినట్లు, ఈ సమాలోచన యొక్క ఫలితం వ్రాత ప్రతులకు మాత్రమే పరిమితం కాకూడదు. కానీ దాని ముఖ్య ఉద్దేశాన్ని జ్ఞాపకం ఉంచుకొని, ఆశను వికసింప చేస్తూ, కలలను సాకారం చేస్తూ, విశ్వాసాన్ని ప్రేరేపించడం, గాయాలను మాన్పుతూ, సంబంధాలను ధృఢతరం చేయాలి. ఆంధ్ర, తెలంగాణలో శ్రీసభ పరిస్థితి నేడు సంక్లిష్టంగా ఉంది, కానీ ఆశతో నిండి ఉంది. మత సహనం, సామాజిక-ఆర్థిక అసమానతలు మరియు యువతకు, సాధారణ క్రైస్తవులకు సాధికారత కల్పించడం వంటి సమస్యలను పరిష్కరించడం ద్వారా, సినడల్ మార్గాన్ని ఇక్కడ సమర్థవంతంగా ఆచరించవచ్చు, ఐక్యమత్యం, సహకారం, ఇతరులకు సేవ చేయాలనే అచంచలమైన నిబద్ధత ద్వారా, మన మధ్య దేవుని ప్రేమను చూడటానికి తెలుగు శ్రీసభ పరిపక్వం చెందుతుంది!

❋ ❋ ❋ ❋






తెలుగు కతోలిక వేదశాస్త్ర సమాఖ్య, 9వ సదస్సు
Telling the Story of Jesus in a Synodal Way in the Context of Telangana and Andhra
Most Rev. Udumala Bala
Bishop of Warangal
& Apostolic Administrator of Khammam
& Chairman, TCBC Commission for Doctrine and Theology
అక్టోబర్ 04 & 05, 2023
భక్త యోహాను ప్రాంతీయ గురు విద్యాలయం,
రామంతపురం, హైదరాబాద్ - 500 013.
తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య - కతోలిక సిద్ధాంత, వేదశాస్త్ర విభాగము





**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing